# జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల పక్ష పత్రిక

www.janashaktionline.com


లోపలి పేజీల్లో...


- యూరోపియన్ యూనియన్‌తో భారత వాణిజ్య ఒప్పందం
- స్వేచ్ఛా మార్కెట్టు ఫెమినిజం–జోహన్నా బ్రెన్నర్
- అమెరికా : టక్సాన్‌లో సెనేటర్‌పై కాల్పులు – డేవిడ్‌నార్త్
- హక్కుల ఉద్యమంపై కొన్ని అభిప్రాయాలు–పాణి
- దేశంలోని వివిధ ప్రాంతాల్లో ప్రజల నిరసన, ఆందోళనలు
- నవల్‌ఘడ్ ప్రాంతంలో తీవ్రమౌతున్న రైతాంగ ఆందోళనలు
- నెల్లూరు–ప్రకాశం తీరాన్ని ముంచెత్తనున్న థర్మల్ కేంద్రాలు



సంపుటి : 43 సంచిక : 21 విజయవాడ 5-3-2011 పేజీలు : 12 వెల: రు 5.00


# భూసేకరణ చట్టాన్ని రద్దుచేయాలి!

**కాకరాపల్లి** భగ్గుమంది. అంతకుముందు సోంపేట, కనపర్తి. ఇవన్నీ విద్యుత్తు కర్మాగారాలకోసం పూనుకున్న భూసేకరణకు ప్రతిఘటనలు. ఇవికాక సెజ్‌ల కొరకు భూసేకరణ సాగుతున్నది. విశాఖ–కాకినాడ కారిడార్, వాన్‌పిక్‌ల పేరిట భూసేకరణ. అడ్డగోలుగా పేదల పంట భూములను దోపిడీ వర్గాలకు కట్టపెడుతున్న సందర్భాలివి. అభివృద్ధిపేరిట సాగుతున్న వినాశనమిది. పర్యావరణ రక్షణ, ప్రజాభిప్రాయసేకరణవంటి అంశాలలో తాము రూపొందించిన నియమ నిబంధనలను తామే తుంగలో తొక్కుతున్న ఉదంతాలివి.

ఇది ఆంధ్రప్రదేశ్‌కే పరిమితం కాదు. పరిశ్రమలు, అభివృద్ధి పేరిట దేశ వ్యాపితంగా రైతాంగాన్ని భూములనుండి తరిమివేస్తున్నారు. ఈ నిర్బంధ భూసేకరణకు ప్రతిఘటన ఎంత తీవ్రస్థాయికి చేరిందంటే, అధినాయకులు ప్రజలకు న్యాయం జరగాలంటూ ప్రకటనలిస్తున్నారు. నేను మీ సిపాయిగా మీ తరపున పోరాడతానంటూ రాహుల్‌గాంధి అంటే, అభివృద్ధి ఫలాలలో న్యాయమైన వాటా నిర్వాసితులకు చెందాలంటూ సోనియాగాంధీ ప్రకటిస్తున్నది. పర్యావరణ నియమాలను ఉల్లంఘించిందంటూ పోస్కోకు అనుమతులు రద్దుచేసిన కేంద్ర పర్యావరణమంత్రి జైరామ్ రమేష్ నెలరోజులు తిరక్కుండానే రైతులకు చెల్లించే నష్టపరిహారాన్ని కొంత పెంచమని చెప్పి తిరిగి అనుమతులు మంజూరు చేశాడు.

ప్రభుత్వమే ఒక రియల్ ఎస్టేటు దళారీగా వ్యవహరిస్తున్నది. ఢిల్లీ పొరుగునున్న హర్యానా రాష్ట్రంలో రైతాంగం నుండి సేకరించిన భూమికి రాష్ట్రప్రభుత్వం మార్కెట్టు రేటు యివ్వటానికి నిరాకరించింది. అయితే ఏడాదికి ఎకరానికి 15వేల రూ॥ల చొప్పున 33 ఏళ్లు రాయల్టీ చెల్లింపుకు పెట్టుబడిదారులకిచ్చింది. ఇది రైతులకు చెల్లించిన దానికి 4 రెట్లు ఎక్కువ. మార్కెట్టురేటుకు రెట్టింపు. అర్సెలాల్ మిట్టల్ విదేశీ పెట్టుబడిదారుడి ఉక్కుమిల్లుకు కర్ణాటక ప్రభుత్వం 4500 ఎకరాలు యిచ్చింది. ఎకరానికి 74 లక్షల రేటుకు, కాగా రైతులకు చెల్లించింది 7 లక్షలు. ఫరిదాబాదులో మార్కెట్టు రేటు ఎకరా రెండున్నర కోట్లుండగా, రైతాంగానికి 16 లక్షలు చెల్లించి స్వాధీనం చేసుకున్న 1832 ఎకరాలనూ ఎకరా 5 కోట్ల చొప్పున అమ్మింది. ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే.

పన్నులు వసూలుచేసి సమాజ ఉమ్మడి అవసరాలకూ, ప్రజాహిత కార్యాలకూ ఖర్చు చేయాల్సిన ప్రభుత్వం తన బాధ్యతను వదిలివేసుకుంది. ధనాఢ్య వర్గాలపై ఆదాయపు పన్నులను తగ్గిస్తూ, మధ్యతరగతి, పేదవర్గాలపై పన్నుల భారాన్ని పెంచటమేకాక విద్యా, వైద్యంవంటి సేవలను కూడా కొనుగోలు సరుకుగా చేసింది. ప్రభుత్వాన్నే ఒక దళారీ వ్యాపారిగా మార్చారు. స్పెక్ట్రం అమ్మకాలద్వారా 1,70,000 కోట్ల రూ॥ల ఆదాయానికి గండిపడిందని దుమ్మురేపుతున్నారు. ఆ నష్టమన్న దాని సంగతలా వుంచితే, స్పెక్ట్రం అమ్మకాలద్వారా ప్రభుత్వానికి లక్షకోట్ల ఆదాయం వచ్చింది. ప్రభుత్వ ఆస్తుల అమ్మకాలు చేసి జేబులు నింపుకునే దళారీ అయింది.

ఇదంతా ఒక పార్శ్వం మాత్రమే. సెంటర్ ఫర్ సైన్సు అంచనా ప్రకారం నేడు గనులతో కలిపి పరిశ్రమలు వినియోగిస్తున్న భూమి 7 లక్షల హెక్టార్లు. రాగల పదేళ్లలో మరో 10 లక్షల హెక్టార్లు పరిశ్రమల ఆధీనంలోకి వస్తాయి. దీనిలో మూడున్నర లక్షల హెక్టార్లు గనుల తవ్వకానికి నిర్ణయించిన దట్టమైన అడవి ప్రాంతంలో 80శాతం ఆదివాసులు జీవించే ప్రాంతంలో వుంది. విమానాశ్రయాలు, రేవులు, రోడ్లు, నీటి ప్రాజెక్టులు, విద్యుత్తు కర్మాగారాలు మొదలగు మౌలిక సదుపాయాల రంగానికి వాడే భూమి ఈ లెక్కలో లేదు. ఇంత పెద్ద ఎత్తున సాగుతున్న భూమి సేకరణ, తత్పర్యవసానంగా కోట్లాదిమంది నిర్వాసితులౌతున్న స్థితి అనేక ప్రశ్నలను ముందుకు తెస్తున్నది.

భూసేకరణ చట్టాన్ని 1894లో వలస పాలకులు చేశారు. 116 ఏళ్లనాటి ఈ చట్టం ఎవరి భూమినైనా, ఎప్పుడైనా స్వాధీనపరచుకునే అధికారాన్ని ప్రభుత్వానికివ్వటంద్వారా దానిని అంతిమ స్వంతదారుగా భూస్వామిగా చేసింది. వందేళ్ల తర్వాత ఈ చట్టానికి సవరణలు చేశారు. భూసేకరణకు అధికారులు పాటించాల్సిన విధి విధానాల్లో కొన్ని మార్పులు మాత్రమే ఈ సవరణలు! 2007లో మరో సవరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టారు. సేకరించిన భూమిని అధిక ధరకు అమ్మితే, పెరిగిన ఆదాయంలో 80శాతం అసలు భూమిస్వంతదారులకు చెల్లించాలన్న, గనుల తవ్వకానికి భూమిని సేకరిస్తే, వచ్చే లాభాలలో 26 శాతం భూమి స్వంతదారులకివ్వాలన్న సవరణలను ఇందులో ప్రతిపాదించారు. దీనిపై ఏ చర్చలూ సాగలేదు. ఇంతవరకూ పార్లమెంటు ఆమోదం తెలుపకపోవటంతో దానికి కాలం చెల్లిపోయింది. 1984 చట్టానికి సవరణలు ప్రతిపాదిస్తూ కొత్తబిల్లును పార్లమెంటు 2010 శీతాకాల సమావేశాల్లో ప్రవేశపెడతామని గత జూన్‌లో ప్రధాని ప్రకటించారు. 2010 వెళ్లిపోయినా ఈ బిల్లు పార్లమెంటు ముందుకు రాలేదు. సవరణలెలా వుండాలన్న చర్చ అంతంలేకుండా సాగుతున్నది. కొత్త పద్ధతి వచ్చేవరకూ భూసేకరణ ఆపమని ప్రభుత్వం చెప్పలేదు. భూసేకరణ నోటీసులు లేకుండా ఏరోజూ పత్రికలు రావటంలేదు. భూసేకరణ చట్టమిస్తున్న నిరంకుశాధికారాలు వేటినీ వదులుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా లేదు. ప్రతిపాదనలు, చర్చల పేరిట కాలయాపన చేయటమే లక్ష్యంగా సాగుతున్నది.

ఈలోగా గనులు, ఖనిజాలు(అభివృద్ధి, క్రమబద్ధీకరణ) బిల్లు 2010 ముసాయిదాను మంత్రుల బృందం ఆమోదించింది. గనుల తవ్వకంతో వచ్చిన ఖనిజాల అమ్మకాల లాభాలలో 26శాతాన్ని నిర్వాసితులకు చెల్లించటం, ఖనిజాలపై రాయల్టీ వసూలుచేసి రాష్ట్ర, కేంద్ర స్థాయిలో నిధులు ఏర్పాటుచేసి, వాటిని ఆ ప్రాంతాల అభివృద్ధికి వినియోగించటం వంటి క్లాజులు ఈ బిల్లులో వున్నాయి.

గనుల తవ్వకం ప్రధానంగా అటవీ ప్రాంతంలోనే సాగుతుంది. ఈ ప్రాంతంలో భూమి రికార్డులే లేవు. ఒక భూమి నాదంటే నాదని రెవెన్యూ, అటవీశాఖలే తగాయిదాపడ్డ సందర్భాలు అనేకం వున్నాయి. చదువులేని అమాయక ఆదివాసీలకు అనూచానంగా భూమి సాగుచేసుకోవటం తప్ప వారికి పట్టాలు లేవు. వారు సాగుచేసుకుంటున్న భూమి రిజర్వు ఫారెస్టులోదంటూ ఆదివాసులను తరిమివేయటం, వారి గ్రామాలను తగులబెట్టడం తరచుగా సాగుతున్నది. అటవీ హక్కుల చట్టం వచ్చినా ఇంతవరకూ దాని అమలుకు తీసుకున్న చర్యలు నామమాత్రమే. ఈ స్థితిలో భూమి ఆదివాసులదిగా గుర్తించకుండా స్వాధీనం చేసుకుంటారు. వాస్తవ పరిస్థితి ఇలా వుండగా, 26 శాతం ఎవరికి చెల్లించబోతారు; అసలు భూమి ఆదివాసులకు చెందినదిగా గుర్తించకుండా లాభాలలో వాటా యిస్తామనటం వంచనాత్మకమే.

ఒక్క ఉక్కు మంత్రిత్వశాఖే ఉక్కు ఉత్పత్తిని ప్రస్తుత 7.2 కోట్ల టన్నుల నుండి 2012 నాటికి 12 కోట్ల టన్నులకు పెంచాలని తీర్మానించింది. అంటే ఇనుప, బొగ్గు నిక్షేపాల తవ్వకం రెట్టింపుకావాలి. దీనికోసం 11 లక్షల కోట్ల రూపాయలతో ప్రణాళిక సిద్ధంచేసింది. నిర్వాసితులయ్యే ఆదివాసుల పునరావాసానికి దీనిలో కేటాయించింది 100 కోట్లు. దీనిలో సగానికి పైగా పరిపాలనా ఖర్చులకే సరిపోతుంది. ఇక పునరావాసానికి మిగిలేదెంత?

జాతీయ గనుల నిధిని ఏర్పాటుచేస్తామనటం కూడా ఇంత వంచనతో కూడినదే. ఖనిజాలపై వసూలుచేసిన రాయల్టీని మొదట ప్రభుత్వ ఖజానాకు జమచేస్తారు. తర్వాత అవసరమైనప్పుడు మాత్రమే దీనిని జాతీయ గనుల నిధికి తరలిస్తారు. చమురు రంగానికి గతంలో ఇలాంటి నిధినే ఏర్పాటుచేశారు. నిర్ణయించిన ధరకు పెట్రోలు, డీజిలు తదితర ఉత్పత్తులు అమ్ముతున్నందున, చమురు ధర పెరిగినప్పుడు మార్కెటింగ్ కంపెనీలకు వచ్చిన నష్టాలను ఈ నిధితో పూరిస్తామని చెప్పారు. చమురు ధర తక్కువగావున్నప్పుడు వచ్చిన లాభాలను ఈ నిధికి తరలించి ప్రభుత్వం ఖర్చుచేసింది. కాగా చమురు **(తరువాయి 2వ పేజీలో)**

సంపాదకీయం

## రైల్వే బడ్జెట్టు

# ప్రజారంజక కసరత్తులతో వంచన

**బెంగాలుకే** వరాలన్నీ యిచ్చారన్న ప్రతిపక్షాల నిరసనకు ప్రతి రైల్వేమంత్రి చేస్తున్నదదేకదా అంటూ మమతా బెనర్జీ రైల్వేబడ్జెట్టును ప్రవేశపెట్టారు. సరుకు రవాణా ఛార్జీలు పెంచనందుకు గుత్తవాణిజ్యవర్గాలు హర్షం వెలిబుచ్చగా, ప్రయాణీకుల ఛార్జీలు పెంచనందుకు ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఛార్జీలు పెంచటం ద్వారా ఆదాయం పెంచుకోకుండా రైల్వేల ఆర్థికాన్ని బలహీనపరిచి, ఎన్నికల దృష్ట్యా ప్రజారంజక బడ్జెట్టును రూపొందించారని "నిపుణులు" వ్యాఖ్యానించారు. ప్రజలపై ఛార్జీలు మోపటానికి అనుసరిస్తున్న దొడ్డిదారి పద్ధతులూ, వాటిని కప్పిపుచ్చేందుకు ప్రదర్శనాత్మక పథకాల ప్రకటనలూ యధావిధిగా సాగాయి.

నూతన ఆర్థిక సంస్కరణలు ప్రారంభమయ్యేనాటికి రైల్వేలో 22 లక్షల మంది ఉద్యోగులున్నారు. వారి సంఖ్యను నేటికి 14 లక్షలకు తగ్గించారు. కాగా ఒక లక్షా 75 వేల ఉద్యోగాలు మాత్రమే ఖాళీగా వున్నాయని మమతా చెప్పారు. మిగిలిన ఆరు లక్షలకు పైగా ఉద్యోగాలను రద్దుచేశారు. కాగా ఈ ఏడాది 29 వేల మందిని ఉద్యోగాల్లో నియామకం చేస్తామని రైల్వే మంత్రి ఘనంగా ప్రకటించారు. దీనిలో రైల్వే పోలీసులుగా 13 వేల మంది మాజీ సైనికోద్యోగులను తీసుకుంటామని చెప్పారు. క్రిందటి ఏడాది రైల్వే బడ్జెట్టులో 13 వేలమంది మాజీ సైనికోద్యోగులను రైల్వే పోలీసు దళంలో నియామకం జరుపుతామని మమతా చెప్పారు. ఏడాది తర్వాత 1200 రైల్వే పోలీసు ఉద్యోగాలకు ప్రకటనలు యివ్వటం మాత్రమే జరిగింది. నియామకాలు జరగలేదు. ఆ సంఖ్యనే మళ్లీ కొత్తగా పెంచి చెప్పారు తప్ప నియామకం జరుపుతారన్న నమ్మకం లేదు.వేతన సవరణ సంఘం సూచనలు అమలు చేసినందున సిబ్బంది వేతన భారం 92 శాతం పెరిగిందని వగచిన మమతా కొత్త నియామకాలు జరపరు. రైల్వేల నిర్వహణకు అవసరమైన సాంకేతిక సిబ్బంది కొరత తీరనందున భద్రతకు ప్రమాదమేర్పడుతుంది.

రైల్వేల ఆదాయం నుండి రిజర్వు ఫండుకు చెల్లింపులను గతబడ్జెట్టులో కేటాయింపులను సవరించి నాల్గవ వంతుకు తగ్గించారు. ప్రస్తుత బడ్జెట్టులో దీనిని మరో రూ. 2000 కోట్లు తగ్గించారు. పాతబడ్డ రైలు పట్టాలను తొలగించి కొత్తవి వేయటానికి ఈ రిజర్వు నిధులనే వినియోగిస్తారు. రిజర్వు నిధి చెల్లింపులు తగ్గించటమంటే కాలం చెల్లిన రైల్వే మార్గాలను పునరుద్ధరించటానికి నిధులుండవు. మళ్లీ రైల్వే ప్రయాణ భద్రత ప్రమాదంలో పడుతుంది. పాత పట్టాల తొలగింపుకు నిధులివ్వని మంత్రి కొత్తగా 1000 కి.మీ. రైలు మార్గం నిర్మిస్తామని చెప్పారు. క్రిందటేడు చెప్పిన వెయ్యి కి.మీ. కొత్త మార్గాలల్లో 700 కి.మీ. కూడా ఇంకా పూర్తికాలేదు. కొత్తగా చెప్పిన వెయ్యిలో సగంకూడా పూర్తి కాబోదని ఘంటాపథంగా చెప్పవచ్చు.

సరకు రవాణా పెట్టెలు, ప్రయాణీకుల పెట్టెలు కొనుగోలు చేయటానికి నిధులను గత బడ్జెట్లో రూ. 373 కోట్ల నుండి రూ. 162 కోట్లకు (56శాతం) తగ్గించారు. గత ఏడాది కొన్న 18 వేల సరకు రవాణా పెట్టెలనే ఈ ఏడాదీ కొంటారు. ప్రయాణీకుల పెట్టెల కొనుగోళ్లను గత ఏడాది 3210 నుండి 2455కు తగ్గించారు. అయినా అనేక కొత్త రైళ్లను ప్రకటించారు. కొత్తపెట్టెలు కొని ఎక్కువ రైళ్లు నడపటం కాక, రైలు పెట్టెల నిర్వహణ, మరమ్మత్తుల సమయాన్ని తగ్గించటం ద్వారా పాతపెట్టెలతోనే కొత్త రైళ్లను నడుపుతారు. నిర్వహణ, మరమ్మత్తులకు తగినంత సమయం లేనందున వీటిలో ప్రయాణం ప్రమాదకరమౌతుంది.

తక్కువ సమయంలోనే నిర్వహణా మరమ్మత్తులు చేసేందుకు సిబ్బంది సంఖ్యను పెంచటమొక మార్గం. ఇప్పటికే లక్షా 75వేల పోస్టులు ఖాళీగా వుంటే 29 వేల పోస్టులు మాత్రమే నింపుతానంటున్నారు. ఇంతకు ముందు చెప్పినట్లు నియామక ప్రకటనలు వెలువడి 1200 పోస్టులు నింపితే (అదీ సాంకేతిక సిబ్బంది కాదు రైల్వే పోలీసు సిబ్బంది) చాలా సాధించినట్లే. ప్రయాణీకుల భద్రతను పణంగా పెట్టి ప్రజాకర్షక బడ్జెట్టును రూపొందించారు.

పోనీ ఛార్జీలన్నా పెంచలేదని తృప్తిపడటానికీ లేదు. ఈ బడ్జెట్టులో ప్రయాణీకుల సంఖ్య 6.4 శాతం పెరిగి పై తరగతి ప్రయాణీకుల నుండి 17 శాతమూ, రెండవ తరగతి ప్రయాణికుల నుండి 16 శాతమూ ఆదాయం పెరుగుతుందని అంచనా వేశారు. కాగా గత ఏడాది బడ్జెట్టు అంచనాలకంటే ప్రయాణికుల సంఖ్య పెరుగుదల 6 శాతం నుండి 5.3 శాతానికి తగ్గినా, ఆదాయం మాత్రం అశించిన విధంగానే 11 శాతాన్ని మించి పెరిగింది. రిజర్వేషన్ ఛార్జీల పేరిట మోపిన భారంతో ప్రయాణీకుల పెరుగుదల తగ్గినా ఆదాయం పెరిగింది. తత్కాల్‌కు సీట్ల కోటా పెంచటం ద్వారా ఎక్కువమంది ప్రయాణీకులు ఎక్కువరేటు చెల్లించి ప్రయాణించాల్సిన స్థితి కల్పించారు. ఈ ఏడాదికూడా ప్రయాణ ఛార్జీలు పెంచలేదని చెప్పుకున్నా, పరోక్షంగా పెంచే పద్ధతినే అనుసరిస్తారు.

రైల్వేల సరుకు రవాణాలో 40 శాతం బొగ్గు, 20 శాతం ఇనుపఖనిజం నుండి ఆదాయం వస్తుంది. ఈ బడ్జెట్టులో బొగ్గురవాణా నుండి 12 శాతం, ఇనుప ఖనిజరవాణానుండి 17 శాతం ఆదాయం పెరుగుతుందని అంచనా. ఇవి రెండూ బడా బూర్జువాలకూ, సామ్రాజ్యవాదులకూ ఉపయోగపడేవే. బొగ్గు, ఇనుము. ఉక్కు అమ్మకాల ధరల నియంత్రణను ప్రభుత్వం క్రమంగా వదిలివేసుకుంటున్నది. వీటి రవాణా ఛార్జీలు పెంచకపోవటమంటే ఈ పరిశ్రమాధిపతులకు లాభాలు చేకూర్చటమే. వీటి ధరల క్రమం అంతర్జాతీయ మార్కెట్టు ధరలను బట్టి నిర్ణయిస్తుండటం సాగుతున్నది గనుక రవాణా ఛార్జీలు పెరగకపోతే వారికి లాభాలు పెరుగుతాయి. వీరికి లాభాలు కట్టబెట్టడం కోసం రైల్వేల ఆదాయాన్ని త్యాగం చేసి, సామాన్య ప్రయాణీకులపై భారాన్ని పెంచుతున్నారు.

ఈ పరిశ్రమాధిపతుల అవసరాలు తీర్చేందుకే ప్రత్యేకంగా సరుకు రవాణా రైల్వే లైన్లు నిర్మించాలని ప్రభుత్వం పూనుకుంది. పథకం రూపకల్పన సామ్రాజ్యవాదులదేనని ప్రత్యేకంగా చెప్పనవసరంలేదు. ఢిల్లీ నుండి ముంబయికి నిర్మించే ఈ సరుకు రవాణాలైనుకు జపాను అప్పులిస్తుంది. కలకత్తా నుండి నిర్మించే తూర్పులైనుకు రుణమిచ్చే **(తరువాయి 2వ పేజీలో)**

# భారతీయ ఉపఖండపు అంతర్జాతీయ ప్రజా కవి ఫైజ్ శతజయంతి-2011

**సుప్రసిద్ధ** ప్రగతిశీల ఉర్దూకవి ఫైజ్ అహ్మద్ ఫైజ్ శతజయంతి సంవత్సరం ఇది. ఆయన 1911 ఫిబ్రవరి 13న సియాల్‌కోట్ (ఇప్పుడు పాకిస్తాన్‌లో వుంది)లో జన్మించారు. ఆయన 1941 నుండి నాలుగు దశాబ్దాలపాటు ప్రగతిశీల రచయితగా కొనసాగారు. (1984 నవంబరు 20న మరణించారు).

1930 నాటి ఆర్థిక మాంద్యమూ, రైతుకూలీల ఉద్యమాలూ, ప్రేమ్‌చంద్ తదితరులతో కూడిన అభ్యుదయ రచయితల సంఘం (1936) నవ యువకుడిగా వున్న ఫైజ్ అహ్మద్ ఫైజ్ హృదయాన్ని కదిలించాయి.

పాకిస్తాన్ ఏర్పడిన తర్వాత లాహోర్‌లోని రెండు అభ్యుదయ దినపత్రికలకు ఆయన ప్రధాన సంపాదకునిగా పనిచేశాడు. అంతేగాక పాకిస్తాన్‌లోని ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్‌కు ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. 1950లో శాంతి ఉద్యమంలో ప్రధాన పాత్ర పోషించారు. 1949 నవంబర్‌లో జరిగిన అఖిల పాకిస్తాన్ ప్రగతిశీల రచయితల మహాసభల నిర్వహణలో ఆయనొకరు.

ప్రగతిశీల రచయితల మహాసభ జరిగిన దాదాపు సంవత్సరానికి పాకిస్తాన్ మిలటరీ పాలకులు ఫైజ్ పైనా, ఇంకా 12 మంది అధికార్ల పైనా, మరికొందరు పౌరులపై రావల్పిండి కుట్ర కేసుపెట్టి దాదాపు రెండేళ్ళు నిర్బంధించింది. కఠిన కారాగారవాసంలో కూడా ధైర్యంగా పాలకుల దౌష్ట్యాన్ని నిరసిస్తూ అత్యుత్తమ కవితలు వ్రాశారు. వాటిని రహస్యంగా బయటకు పంపేవారు. 1951లో ఒకసారి, 1958లో మరొకసారి ఆయన జైలు జీవితం గడిపారు.

మిలటరీ జనరల్ జియా వుల్‌హక్ పాలనలో పాకిస్తాన్ వదిలి బీరూట్‌కు ఆఫ్రో-ఏసియన్ అభ్యుదయ సాహిత్య పత్రిక 'లోటస్'కు సంపాదకునిగా వెళ్ళారు.

మొదట్లో నవ యువకుడిగా ప్రణయ కవితలు రాసిన ఫైజ్, తన రెండవ కవితా సంపుటి నాటికి 'ప్రపంచంలో ప్రేమేకాదు మరెంతో దుఃఖమూ వుంది' అనే అవగాహనకు వచ్చారు. ఆ తర్వాత అంతా సంకెళ్ళు, జైలు గోడలు, ఖైదీలు వస్తువుగా పాకిస్తాన్ సైనిక ప్రభుత్వపు దమన నీతిని ఎండగట్టారు.

ఆఫ్రికా-యూరప్ పర్యటన అనంతరం ఫైజ్ దృష్టి విశ్వమానవుడి దుఃఖంపై మళ్ళింది. పాలస్తీనాపై సామ్రాజ్యవాద దేశాల దాడిని ఖండించారు. సాహిత్య భాష వదిలేసి వ్యావహారిక భాషలో అణచివేతకు గురౌతున్న ప్రపంచ ప్రజలందరి తరఫునా స్పందించారు. ప్రజా శత్రువులపై ఆయన కలం నిప్పులు చెరిగింది. ఆయన కవిత్వం స్థలకాలాల్ని దాటి, వ్యధార్థ జీవులకు బాసటగా నిలిచి ఊరటనిచ్చింది.

# కాకరాపల్లి ఈస్ట్‌కోస్ట్ థర్మల్ విద్యుత్ కేంద్ర

## ఆందోళనాకారులను పోలీసులు కాల్చి చంపటాన్ని ఖండించండి!

కాకరాపల్లిలో పోలీసులు కాల్పులు జరిపి ఇద్దరిని హత్యగావించటాన్ని రైతుకూలీ సంఘం ఖండిస్తున్నది.

శ్రీకాకుళం జిల్లా-సంతబొమ్మాళి మండలంలో 'ఈస్టుకోస్టు ఎనర్జీ ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో 2468 మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యంతో నిర్మాణం చేస్తున్న మెగా థర్మల్ విద్యుత్ కేంద్రానికి ప్రతిపాదనల కాలం నాటి నుండీ స్థానిక ప్రజలు, రైతులు, పర్యావరణవాదులు, ప్రజాసంఘాలు తీవ్ర నిరసనాందోళలను వ్యక్తం చేస్తున్నారు.

తమ జీవనోపాధిని, భూములను, సముద్ర సంపదను నాశనం గావించే ఈస్టుకోస్టు విద్యుత్ కేంద్రాన్ని వ్యతిరేకిస్తూ సాగిస్తున్న ప్రజల నిరసనను బేఖాతరు చేస్తూ ప్రభుత్వం పోలీసు యంత్రాంగాన్ని ప్రయోగించి విద్యుత్ కేంద్ర నిర్మాణానికే పూనుకుంది.

25-2-11న విద్యుత్ కేంద్ర నిరసనకారులపై వడ్డితాండ్ర గ్రామంలో పోలీసులు బీభ త్సం సాగించారు. లాఠీఛార్జీ జరిపారు. ఈ దాడిని ఎదుర్కొన్న ప్రజలపై భాష్పవాయువు ప్రయోగించారు. ఇళ్ళల్లోకి చొరబడి మరీ మహిళలు, వృద్ధులతో సహా 150 మందికిపైగా అరెస్టులు సాగించారు. దీనికి నిరసనగా జిల్లాలో, రాష్ట్రవ్యాపితంగా విస్తృత నిరసన వ్యక్తమైంది.

ఈస్టుకోస్టు యాజమాన్యపు కొమ్ముగాస్తూ ప్రజల నిరసనాందోళనను పరిగణలోకి తీసుకోకుండా ప్రభుత్వం తిరిగి ఈ రోజు (28-2-11)న వేలాది మంది పోలీసులను వడ్డితాండ్ర, కాకరాపల్లి గ్రామాల్లో మోహరించింది. దీనిని నిరసించిన ప్రజల ఇళ్ళపై బాంబులు ప్రయోగించింది. 150 ఇళ్ళు దహనమయ్యాయి. భాష్పవాయు ప్రయోగంతోపాటుగా పోలీసులు రబ్బరు బుల్లెట్లను మాత్రమే ప్రయోగించారని అధికారులు చెప్తుండగా ఇప్పటికి అందిన సమాచారం మేరకు ఇరువురు మృతులయ్యారు. అనేకమందికి తీవ్ర గాయాలయ్యాయి.

సామ్రాజ్యవాద ప్రపంచీకరణను వేగవంతం చేస్తున్న ప్రభుత్వ విధానాల అమలులో భాగంగా బడా కార్పోరేట్ సంస్థలకు, బహుళజాతి ప్రైవేటు యాజమాన్యాల ప్రయోజనాల కోసం వేల మెగావాట్ల సామర్థ్యంతో కూడిన మర్చంట్ పవర్ ప్రాజెక్టులు నిర్మాణం చేస్తూ ప్రజలను, రైతాంగాన్ని, మత్స్యకారులను నిర్వాసితులను చేస్తూ, వారిని భూముల నుండి తొలగించివేస్తూ, జీవనోపాధిని దెబ్బతీస్తూ రాష్ట్రంలో పెద్ద ఎత్తున నిర్మాణం చేస్తున్న విద్యుత్ ప్రాజెక్టులను తక్షణమే నిలిపివేయాలని రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) డిమాండ్ చేస్తున్నది.

కాకరాపల్లి పోలీసు కాల్పులకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని, కాల్పులు సాగించిన పోలీసు అధికారులను శిక్షించాలని, తక్షణం వడ్డితాండ్ర, కాకరాపల్లి పరిసర ప్రాంతాల నుండి పోలీసు బలగాలను ఉపసంహరించాలని సంతబొమ్మాళి థర్మల్ విద్యుత్ కేంద్ర నిర్మాణాన్ని ఆపివేయాలని డిమాండ్ చేస్తున్నది.

| | | |
|---|---|---|
| | ఎస్. ఝాన్సి | కె. కోటయ్య |
| | కో-కన్వీనర్ | కార్యదర్శి |
| విజయవాడ | ఆల్ ఇండియా ఖేత్ మజ్దూర్ కిసాన్‌సభ | రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) |
| 28-2-11 | (ఏ.ఐ.కె.ఎమ్.కె.ఎస్.) | |

# 1962లో లెనిన్ శాంతి బహుమతి స్వీకరణ సందర్భంగా ఫైజ్ ఉపన్యాసం

**పదాలు,** వాటిని కలగలిపిన రచనా సృష్టి కవుల, రచయితల వ్యాపకం. అయితే మాటలే దొరకని సందర్భాలు జీవితంలో ఎదురౌతాయి. ఇది అలాంటి సందర్భమే. నాకిచ్చిన గౌరవానికి లెనిన్ శాంతి బహుమతి కమిటీకీ, సోవియటు సంస్థలకూ, మిత్రులకూ ధన్యవాదాలు తెలిపేందుకు నాకు మాటలు దొరకటం లేదు. ఈ శాంతి బహుమతి అమూల్యమైనది. ఎందుకంటే స్వేచ్ఛా, శాంతుల పతాకాన్ని సమున్నతంగా నిలిపిన లెనిన్ పేరిటా, మానవ జీవన సౌందర్య సాఫల్యతకు మూలమైనశాంతి పేరిటా ఈ బహుమతి వుంది. జీవితంలోనూ, రచనల్లోనూ ఈ బహుమతికి నన్ను అర్హుడిని చేసిన అంశమేదీ నాకు కనిపించలేదు. ఒక కారణం వుందనిపిస్తున్నది. నేనూ, నా తోటివారు శాంతి, స్వాతంత్ర్యాల కోసం పడిన తపన. శాంతి స్వాతంత్ర్యాల ఆకాంక్షల్లోనే మహోజ్వల ఆశయ ముంటుంది. గౌరవానికి అర్హులను చేస్తుంది.

పిచ్చివాళ్లూ, నేరస్తులూ తప్ప మిగిలిన వారందరూ శాంతి స్వాతంత్ర్య ఆశయ సౌందర్యాన్ని అంగీకరిస్తారు. గోధుమ పొలాల్లో, చెట్ల చిగుర్లలో, పెళ్లికూతురి మేలిముసుగులో, పసిపిల్లల చిరునవ్వుల్లో, కవి కలంలో, కళాకారుడి కుంచెలో శాంతినందరూ చూడగలరు. స్వాతంత్ర్యం వీటన్నింటికీ హామీ యిస్తుందనీ, పశువుల నుండి మనిషిని వేరుచేసే లక్షణాలన్నింటిని బానిసత్వం రూపుమాపుతుందనీ మనందరకూ తెలుసు, తెలివితేటలు, మేధ, మన్నన, ధీరత్వం, దయ, క్షమ-ఇవే ఆ లక్షణాలు. కనుక శాంతి స్వాతంత్రాల సాధనా, సంఘటితపర్చటాల పట్ల భిన్నాభిప్రాయం వుండబోదు. దురదృష్టవశాత్తూ ఎంతోకాలం నుండి ఈ సమిష్టి అవగాహన కొరవడి వుంటున్నది. చీకటికీ-వెలుగుకీ, న్యాయానికీ-అన్యాయానికీ, సృష్టికీ-వినాశనానికీ ప్రాతినిధ్యశక్తులు దీనికి ఆటంకంగా వున్నాయి. ఈ విభిన్న శక్తుల మధ్య అంతస్సంబంధం నేటికీ కొనసాగుతున్నది. అదే సమయంలో గతంలో మనకెదురైన సమస్యలకూ నేడున్న సమస్యలకూ మధ్య స్వభావంలో చాలా తేడా వుంది. అనాగరిక జాతుల మధ్య రక్తపాతమే యుద్ధంగా నేడు లేదు. శాంతి అంటే ఈ రక్తపాతం ఆగిపోవటమే కాదు. నేడు యుద్ధమంటే మానవజాతి మొత్తంగా తుడిచిపెట్టుకుపోవడమే. నేడు శాంతి అంటే మానవాళి మనుగడకు ముందుషరతు. జీవనం-వినాశనమన్న ఈ రెండు ప్రపంచాల మధ్య మానవ చరిత్ర కొనసాగింపూ, పరాకాష్టావుంది. ఈ రెండు ప్రపంచాలపై మానవ జాతి మనుగడ ఆధారపడివుంది. సహజవనరుల మీదా, ప్రజాసమూహాల అవసరాలు తీర్చే ఉత్పత్తి శక్తుల మీదా ఈనాడున్నంత అదుపు మానవునికి ఇంతకుముందు లేదు. గతంలో మానవ చరిత్రలో భాగంగా దోపిడీ సాగటాన్ని మనం అర్థం చేసుకోగలం. ఈనాటి పరిస్థితి అదికాదు. మానవ సృజనాత్మకత శాస్త్ర, సాంకేతిక విజ్ఞానాన్ని అందరకూ తిండి సంపాదించగల, వారి అన్ని భౌతిక అవసరాలూ తీర్చగల ఉన్నతస్థాయికి కొని పోయింది. మానవజాతికి అందుబాటులోవున్న అపార సహజ వనరులూ, ఉత్పత్తి సాధనాలూ అత్యాశలనూ, స్వార్థాన్నీ, గుత్తపెట్టుబడి కోర్కెలను తీర్చేవిగా వుంచరాదు. అవి అందరి సంక్షేమానికీ వినియోగింపబడాలి; మానవుల శాస్త్ర, పారిశ్రామిక విజ్ఞానం నిర్మాణానికి ఉపయోగపడాలి; వినాశనానికి కాదు.

న్యాయం, సమానత్వం, స్వాతంత్ర్యం, సమిష్టికి మేలు పునాదిగాగల సామాజిక వ్యవస్థలోనే ఇదంతా సాధ్యమౌతుంది. పేరాశ, దోపిడీ, గుత్తాధిపత్యం కలచోట ఇది సాధ్యపడదు. దీని గురించి మాట్లాడటం కాదు; దీనికోసం పనిచేయాలి. దీనికి కార్యాచరణ కావాలి. ఆ కార్యాచరణలోనే శాంతి కొరకు పోరాటం, స్వాతంత్ర్యం కొరకు పోరాటం విడదీయలేని విధంగా మిళితమై పోతాయి. ఎందుకంటే శాంతి కొరకు పోరాడే శక్తులే స్వాతంత్ర్యం కొరకు కూడా పోరాడుతాయి. స్వాతంత్ర్యాన్ని వ్యతిరేకించే శక్తులే శాంతి వినాశక శక్తులుగా వుంటాయి. ఒక ప్రక్కన పశుబలంతోనూ, అతంలేని పోటీతోనూ మాత్రమే తమ ప్రయోజనాలు నెరవేర్చుకోగల గుత్తాధిపతులూ, సామ్రాజ్యవాదశక్తులూ వున్నాయి. బ్యాంకులూ, ఫ్యాక్టరీలకంటే మానవ జీవనానికి ఎక్కువ విలువ నిచ్చే, ఇతరులకు ఆజ్ఞలివ్వడం కాక సమిష్టి శ్రమను ప్రేమించే శక్తులు మరో వైపున వున్నాయి. నిర్మాణాత్మక, వినాశక శక్తుల మధ్యపోరాటం రాజకీయాలు, నైతికత, సాహిత్యం, కళలు, రోజూవారీ జీవనం మొదలగు అన్ని రంగాలలోనూ, అనేక రూపాలలోనూ సాగించాలి. స్వాతంత్ర్యాన్ని కోరే, శాంతిని ప్రేమించే వారందరూ అన్ని రంగాలలోనూ సంసిద్ధంగా వుండాలి. ఉదాహరణకు సామ్రాజ్యవాదులకూ, సామ్రాజ్యవాదేతరులకు అనివార్య ఘర్షణతో పాటు, ఇటీవల స్వాతంత్ర్యాన్ని పొందిన దేశాల మధ్య తీవ్ర విభేదాలున్నాయి. అలాంటి విభేదాలు పాకిస్తానుకు పొరుగునున్న భారత్‌కూ మధ్య వున్నాయి. అరబుప్రాంత దేశాల మధ్య వున్నాయి. ఆఫ్రికా దేశాల మధ్యన వున్నాయి. ప్రపంచశాంతినీ, మానవ సౌభాతృత్వాన్ని వ్యతిరేకంచే శక్తులే వీటివల్ల లాభపడతాయి. కనుక వీటి పరిష్కారానికి మార్గాలు వెతకటానికి శాంతి కాముకులు పూనుకోవాలి.

కొన్ని రోజుల క్రితం రోదసిలో సోవియటు సాధించిన విజయం మొత్తం ప్రపంచాన్ని ఉత్తేజ పరిచింది. అప్పుడు నాకొకటనిపించింది. మరో చోటునుండి మన స్వంతగ్రహాన్ని చూడవచ్చు. మన గ్రహాన్ని ముక్కలు ముక్కలుగా విభజించుకొనే ఆశ, చిన్ని సమూహంగావున్న ప్రజలపై ఆధిపత్యం నెరపటమన్న సంకుచిత మెంత తెలివిమాలినతనం! విశ్వాంతరాళాల్లోకి వెళ్తున్నాం, విశ్వంలో వున్న సంపదలన్నీ మనకందుబాటులోకి రాగలవు; సైనికి స్థావరాలను రద్దుచేయండి; బాంబులు రాకెట్లు, తుపాకులను పారవెయ్యండి; మనముందున్న విశాల విశ్వంలోకి కలిసి పయనిద్దాం. అక్కడ ఒకరితో మరొకరు పోట్లాడుకోనవసరంలేదు; ఆ అనంతంలో అందరికీ స్థానం వుందని చెప్పగల నిజాయితీ, మానవత్వం గల వారెవరూ లేరా? ఎన్ని కష్టాలెదురైనా ఈ వాస్తవాన్ని మానవాళిచే గుర్తింపచేయంటంతో విజయం సాధిస్తామన్న విశ్వాసం నాకుంది.

శతృవు ముందేనాడూ తలవంచని మానవాళి విజయాన్నే పొందుతుంది. ద్వేషం, అణచివేత, యుద్ధం తొలగిపోతాయి. శాంతి, సౌభాతృత్వాలు వెల్లివిరుస్తాయి. ఆ విశ్వాసం నాకుంది. పర్షియన్‌కవి హాఫీజ్ ఏనాడో చెప్పినట్లుగా మనందరం సమిష్టి జీవనాన్ని సాగిద్దాం.

ఖలాల్ పజీర్ బావద్ హర్‌బినా కి విం బిని
బాజూజ్ బినా ఐ మొహబ్బత్ కి ఖాలి ఆస్ ఖలాల్ ఆస్త
(మనం చూస్తున్న పునాదులన్నీ లోపభూయిష్టమైనవే.
ఒక్క ప్రేమ పునాది తప్ప ప్రేమ లోపాలు లేనిది.)

***(2011 ఫైజ్ అహ్మద్ ఫైజ్ శతజయంతి సందర్భంగా)***

## రైల్వే బడ్జెట్టు...

(మొదటి పేజీ తరువాయి)

పరిశీలనలో ప్రపంచ బ్యాంకు వుంది. ప్రస్తుతమున్న రైల్వే లైను ప్రక్కనే మరో రైల్వే లైను వెయ్యటానికి కావలసిన సాంకేతిక పరిజ్ఞానమూ, సామర్థ్యమూ భారత రైల్వేలకుంది. కానీ దీనిని ప్రైవేటు - ప్రభుత్వ భాగస్వామ్యం క్రింద నిర్మిస్తామని అన్నారు. జపాను, ప్రపంచబ్యాంకు రుణాలివ్వటానికి అంగీకరించాయంటే వీటి నిర్మాణం జపాను, అమెరికా కంపెనీలకే కట్టబెడతాయి. రుణాన్ని, వడ్డీతో వసూలు చేసుకోవటమే కాక, ఇచ్చిన రుణంలో 80 శాతం సామ్రాజ్యవాద కంపెనీలకే చేరుతుంది. శక్తి సామర్థ్యమున్న రైల్వేలు మాత్రం చేతులు ముడుచుకు కూర్చుంటాయి.

ఈ ప్రైవేటు-ప్రభుత్వ భాగస్వామ్యం ఇక్కడితో ఆగలేదు. శీతల గోదాములు నిర్మించటానికి ప్రైవేటు వారికి రైల్వే భూమిని కేటాయిస్తారు. దీనికి కిసాన్ విజన్ అని పేరు పెట్టారు. ఇక రైల్వేలకవసరమైన విద్యుత్తుకు ప్రైవేటు రంగంతో కలసి కర్మాగారాలు పెడతారు. సరుకు చేరవేతకు ట్రాన్సిట్ కేంద్రాలల్లో ప్రైవేటు భాగస్వామ్యాన్ని ఆహ్వానిస్తారు. పెట్టుబడి మదుపు పెట్టేందుకు పరిశ్రమాధిపతులు ముందుకు వచ్చేందుకు అనేక పథకాలు రూపొందించామనీ రూ॥ 2,11,600 కోట్ల పెట్టుబడి వస్తుందనీ మమతా చెప్పారు. రైల్వేల ప్రైవేటీకరణ క్రమాన్ని వేగవంతం చేసేందుకు యుపిఏ ప్రభుత్వం పూనుకుంది. ఈ ప్రైవేటీకరణ పట్టా లెక్కించేవరకూ, ప్రజారంజకమనే వంచనా కసరత్తుల రైల్వే బడ్జెట్టులు మరికొన్నింటిని రాబోయే ఏళ్లలో ప్రజలు చూడబోతున్నారు. ఆ తరువాత మోపబడే ప్రత్యక్ష, పరోక్ష భారాలు ప్రజలనడ్డి విరుస్తాయి.

## భూసేకరణ...

(మొదటి పేజీ తరువాయి)

ధరలు పెరిగినప్పుడల్లా తప్పలేదంటూ ధరలు పెంచేది తప్ప ఈ నిధిలో వుండాల్సిన డబ్బు ఊసుకూడా ఎత్తేది కాదు. ఒకసారి ప్రభుత్వ ఖజానాలోకి చేరిన తర్వాత ఆ నిధిని మింగివేయటవే ప్రకటిత లక్ష్యానికి వినియోగించరు. కేంద్రం పరిస్థితే ఇలా వుంటే రాష్ట్రాల పరిస్థితి చెప్పనవసరంలేదు. ఎస్‌సి, ఎస్.టి. విద్యార్థులకు ఫీజు తిరిగి చెల్లింపు, ఉపకార వేతనాలకు కేంద్రం విడుదలచేసిన నిధులను దిగమింగి కాలేజీలకు చెల్లించకుండా విద్యార్థులను నానా యిబ్బందులు పెట్టిన రాష్ట్ర ప్రభుత్వ తీరు దీనికి తాజా ఉదాహరణ.

ఇంతకీ ఈ నిధిని దేనికి వినియోగిస్తారట? ఆయా ప్రాంతాల స్థానిక అభివృద్ధికోసమని ఘనంగా ప్రకటించారు. భూమి సేకరించే సమయంలో రోడ్లు వేస్తాం, ఇళ్లు కట్టిస్తాం, ఉద్యోగాలిస్తాం, ఆస్పత్రులు, పాఠశాలలు కట్టిస్తామంటూ వాగ్దానాలు చేస్తారు. భూమి సేకరణ తర్వాత అటు ముఖం కూడా చూపరు. 40 ఏళ్లనాడు ఇలాంటి వాగ్దానాలతోనే అల్యూమినియం ఫ్యాక్టరీకోసం గంధమర్ధన్ ప్రాంతంలో ఆదివాసులను నిర్వాసితులను చేశారు. వారు బిక్షకులుగా మారినా ఈనాటికీ పునరావాసం సంగతలావుంచి, నష్టపరిహారం కూడా యివ్వలేదు.

నిర్వాసిత కుటుంబంలో ఒకరికి ఉద్యోగమివ్వటం, లాభాలలో వాటాలివ్వటం వంటి ప్రతిపాదనలు ముందు కొస్తున్నాయి. ఈ విధంగా అభివృద్ధి ఫలాల్లో నిర్వాసితులకు వాటా అందాలని కోరుతున్నాయి. అయితే ఒక జీవన విధానాన్ని కోల్పోతున్న ప్రజలకు ప్రత్యామ్నాయాన్ని చూపించే చర్చ సాగించటంలేదు.

గనుల రంగంలో సంస్కరణలతో విదేశీ పెట్టుబడి తరలి వస్తున్నది. ఒక్క బొగ్గుగనుల రంగంలోనే 67 శాతం విదేశీ పెట్టుబడులు వచ్చాయి. వందల సంఖ్యలో నిర్మించ బూనుకున్న

(తరువాయి 3వ పేజీలో)

# ఇ.యు.తో భారత ద్విపక్ష వాణిజ్య, పెట్టుబడి మదుపు ఒప్పందం: తీవ్ర పరిణామాలకు దారితీసే ప్రతిపాదనలు

**సరుకులూ** సేవలలో వాణిజ్యం, మేధోపర ఆస్థిహక్కులూ, ప్రభుత్వ కొనుగోళ్లూ తదితర రంగాలకు సంబంధించి ఒక సమగ్ర ఒప్పందాన్ని చేసుకునేందుకు యూరోపియన్ యూనియను(ఇయు)తో 2007 నుండీ భారత్ చర్చలు సాగిస్తున్నది. ద్విపక్ష ఒప్పందమన్న పేరుతో పిలుస్తున్నప్పటికీ సారాంశంలో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందమైన దీనికొరకు ఇప్పటివరకూ 10 విడతలుగా చర్చలు జరిగాయి. 2011 మధ్యనాటికి ఈ ఒప్పందంపై సంతకాలు జరగవచ్చు. ఇయు తరఫున భారత్‌తో చర్చలు సాగిస్తున్న యూరోపియన్ కౌన్సిల్(ఇసి) గత డిసెంబరు నెలలో భారత ప్రధాని జర్మనీ పర్యటన తర్వాత నివేదికనూ, సూచనలనూ రూపొందించి ఇయుకు అందజేసింది. ఒప్పందం కుదుర్చుకునే దిశగా తన సూచనలపై తగిన నిర్దేశాలివ్వమని ఇయును కోరింది.

ప్రధాని జర్మనీ ప్రకటన ముగింపులో చేసిన సంయుక్త ప్రకటనలో "అంతిమ ఒప్పందపు చట్రాన్ని అంగీకరించాము, ఈ ఒప్పందపు సమతుల్య ముగింపు ప్రాధాన్యతను పునరుద్ఘాటిస్తున్నాము" అని పేర్కొన్నారు. ఇయు, భారత్‌ల వాణిజ్య మంత్రులు చేసిన సంయుక్త ప్రకటనలోకూడా "ఆర్థికవృద్ధికి నూతన వనరులను కనుగొనే సవాలును కలిసి ఎదుర్కొంటాము; ప్రపంచ వృద్ధిరేటు మందకొడిగా వున్న సమయంలో మేము గోళ్లు కొరుక్కుంటూ కూర్చోలేదు. నూతన మార్కెట్లు కనుగొనటానికీ, విదేశీ వాణిజ్యానికున్న అడ్డంకులను తొలగించటానికీ కలిసి పని చేస్తున్నాము'' అని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో భారత్‌ను ఆమోదింపచేసిన తర్వాతే తన సూచనలను ఇసి రూపొందినట్లుగా అర్థమవుతుంది.

ఇయులో 27 దేశాలు సభ్యత్వం కలిగి వున్నాయి. వీటిలో ఫ్రాన్సు, జర్మనీ, బ్రిటన్, ఇటలీలదే ప్రధాన పాత్ర. మిగిలిన వాటిది నామమాత్రమే. బ్రిటను, ఇటలీలు సంక్షోభంలో వుండటంతో ఫ్రాన్సు, జర్మనీలే ఇయుపై ఆధిపత్యం కొరకు పోటీపడుతూ నడుపుతున్నాయి. ఈ ఒప్పందంలోని షరతులకు లోబడే 27 ఇయు దేశాలతో భారత ఆర్థిక సంబంధాలు సాగాల్సివున్న రీత్యానూ, 5600 కోట్ల యూరోల(3 లక్షల కోట్ల రూ) వాణిజ్యం సాగుతున్న దేశాలతో జరుగుతున్నందున ఇది భారత్‌కు అతిపెద్ద ద్విపక్ష ఒప్పందమైనందునా, దీనికున్న ప్రాధాన్యతరీత్యా లోతుగా పరిశీలించాల్సిన అవసరముంది.

ఇసి చేసిన సూచనలు తీవ్ర పరిణామాలకు దారితీస్తాయి. ఇవి గనుక అంతిమ ఒప్పందంలో చేరితే దేశాభివృద్ధికీ, ప్రజాప్రయోజనాలకూ తీవ్రవిఘాతం కలుగుతుంది. సామ్రాజ్యవాద పెట్టుబడుల ప్రవేశానికీ, దేశంనుండి ద్రవ్యవనరుల తరలింపుకూ గేట్లు బార్లా తెరవబడతాయి. వీటి సారాంశం ఇయు మాటల్లోనే "పెట్టుబడుల మదుపుపై వున్న ఆంక్షలను అత్యధిక స్థాయిలో మార్కెట్టు అందుబాటులోకి వచ్చేవిధంగా క్రమంగా రద్దుచేయాలి".

ఈ సూచనలు ఇరుపక్షాలకూ సమానంగా వర్తిస్తాయని చెబుతున్నారు. అంటే మనదేశంలో యూరపు దేశాల పెట్టుబడిదారులకిచ్చే సౌకర్యాలన్నింటినీ యూరపు దేశాలలో పెట్టుబడిపెట్టే భారత పెట్టుబడిదారులకు కూడా అవి కల్పించాలి. వాస్తవంలో సామ్రాజ్యవాదులదే పైచేయి అవుతుంది. బలవంతుడు, బలహీనుల మధ్య సమానత్వమంటే బలవంతుడికి పైచేయినివ్వటమే అవుతుంది. సామ్రాజ్యవాదులు ఈ సమానత్వాన్ని పాటించకపోయినా అడిగే శక్తి భారత పాలకులకులేదు. మధ్యప్రాచ్యంనుండీ, ఆగ్నేయాసియానుండీ మ్యూచువల్ ఫండ్లు, సార్వభౌమత్వ నిధులు తదితర రూపాలలో వచ్చిన పెట్టుబడులతో యూరపులో ఆస్తులను కొనుగోలు చేయటం ఇటీవల సాగింది. ఇది చాలా తక్కువగా వున్నప్పటికీ, ఫ్రాన్సు, జర్మనీలు ఆందోళనచెంది తగ్గించటంమెలా అని చర్చిస్తున్నాయి.

మొదటగా పెట్టుబడుల మదుపు అన్న పదానికి ఇసి సూచన విస్తృత నిర్వచనం యిచ్చింది. పరోక్షంగానో, ప్రత్యక్షంగానో పెట్టుబడిదారుడు కలిగివున్న లేదా అతని అదుపులోవున్న అన్నిరకాల ఆస్తులనూ పెట్టుబడులుగా నిర్వచించింది. పరిశ్రమల స్థాపనకు పెట్టుబడులతోపాటు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు, విదేశీ సంస్థాగత పెట్టుబడులు, వాటాలు, డిబెంచర్లు, రుణాలు, వడ్డీలు, వాణిజ్య రాయితీలు, స్థిర, చలన ఆస్తులు, మేధోపర ఆస్థిహక్కులూ, సాంకేతిక పరిజ్ఞానం తదితరాలన్నీ ఈ నిర్వచనం క్రిందకు వస్తాయి. ఇంత విస్తృత నిర్వచనం ఇచ్చినందున అన్నిరూపాలలోనూ విదేశీ పెట్టుబడులు దేశంలోకి ప్రవహించేందుకు దారి వెడల్పు చేయబడింది. దేశ ప్రయోజనాలరీత్యా ఒక రూపంలోవున్న విదేశీ పెట్టుబడి (ఉదా:షేరు మార్కెట్టులో వాటాల కొనుగోలు) అవసరంలేదని భారత ప్రభుత్వం భావించినా ఆపటం సాధ్యపడదు.

ఇయు దేశాలనుండి వచ్చే పెట్టుబడులను భారత దేశపు పెట్టుబడితో సమానంగా గుర్తించాలనీ, అత్యంత ప్రీతిపాత్ర దేశపు స్థాయినివ్వాలనీ ఇసి సూచించింది. పరిశ్రమలను ప్రోత్సహించేందుకు దేశీయ పరిశ్రమలకు కల్పిస్తున్న సౌకర్యాలన్నింటినీ విదేశీ పెట్టుబడికి కూడా కల్పించటమని కోరటమంటే దేశీయ పరిశ్రమ అన్నదేదీ మిగలకుండాపోతుంది. తద్వారా దేశీయ సహజ, ద్రవ్యవనరులన్నీ విదేశీ పెట్టుబడిదారుల చేతుల్లోకి వెళతాయి. దేశ ప్రజల అవసరాలు తీర్చటంకొరకు కాకుండా ప్రపంచ మార్కెట్టులో అమ్మి లాభాలు చేసుకునేందుకే దేశవనరులు వినియోగింపబడతాయి.

1991నుండీ దేశంలోకి విదేశీ పెట్టుబడుల ప్రవేశానికున్న ఆటంకాలను వరుసగా తొలగిస్తూ వస్తున్నారు. చివరకు సైనిక పరిశ్రమలలోకి కూడా అనుమతించారు. చిల్లర వ్యాపారం, న్యాయసేవలు, రైలుబండ్లు నడపటంలోకి ఇంకా ప్రవేశం కల్పించలేదు. అలాగే బ్యాంకులు, బీమా, టెలిఫోన్లు, పత్రికలు, టివి ఛానళ్లు, విమానయాన రంగాల్లో విదేశీ పెట్టుబడుల మదుపుపై పరిమితులు విధించారు. బ్యాంకులు, బీమా రంగాల్లో విదేశీ పెట్టుబడులపై వున్న పరిమితులను ఎత్తివేయమని భారత్ పర్యటనకు వచ్చిన ఫ్రాన్సు అధ్యక్షుడు సర్కోజీ కోరాడు. అలాగే జర్మనీ పర్యటనకు వెళ్లిన భారత ప్రధానినీ జర్మనీ ఛాన్సెలర్ మెర్కెల్ కూడా ఇదే అడిగారు. చర్చలలో ఇసి కూడా దానిపైనే పట్టుపట్టింది. మూడు సందర్భాల్లోకూడా భారత ప్రభుత్వం చిల్లర వ్యాపార రంగంలో అనతికాలంలోనే విదేశీ పెట్టుబడులకు ద్వారం తెరుస్తామని హామీ ఇచ్చింది. ఇసి చేసిన సూచన దీని కొనసాగింపే.

అలాగే ఉత్పత్తి నిర్వహణా షరతులపై "క్రమశిక్షణ"ను అమలుచేయాలని ఇసి సూచించింది. ఉత్పత్తి నిర్వహణా షరతులంటే (పెర్ఫామెన్స్ రిక్వైర్‌మెంట్సు) ఏమిటి? విదేశీ పెట్టుబడిని అనుమతించే సమయంలో ఉత్పత్తిలో కొంతభాగాన్ని ఎగుమతి చేయాలనీ, వెనుకబడిన ప్రాంతంలోనే పరిశ్రమ పెట్టాలనీ, తప్పని సరిగా సాంకేతిక పరిజ్ఞానాన్ని మార్పిడి చేయాలనీ, విడిభాగాలను స్థానికంగా సేకరించాలనీ, స్థానికులకు ఉపాధి కల్పించాలనీ మొదలగు షరతులను విధిస్తారు. వీటివల్ల విదేశీ పెట్టుబడి లాభాలు గడించినా, దేశీయంగా పారిశ్రామిక పునాది ఏర్పడుతుంది. ఈ ఉద్దేశ్యంతోటే ఇలాంటి షరతులను అన్నిదేశాలూ విధిస్తాయి. ఈ షరతులను అమలు చెయ్యటంలో అనుమతులిచ్చిన తర్వాత మినహాయింపు లిస్తూ అసలు లక్ష్యానికే భారత పాలకులు ఎసరుపెడుతూ వస్తున్నారు. ఈ దొడ్డిదారి పద్ధతిని కూడా మానివేసి అసలు షరతులే లేకుండా చేయమని ఇసి సూచనలు కోరుతున్నాయి.

సుజుకీ కంపెనీకి మారుతీకార్ల తయారీకి అనుమతి నిచ్చినప్పుడు పదేళ్లలోగా 90శాతం విడిభాగాలను దేశంలోని పరిశ్రమలనుండే కొనుగోలు చేయాలన్న షరతు విధించింది. దీనివల్ల కార్ల విడిభాగాల తయారీ పరిశ్రమలు వృద్ధిచెంది దేశంలో కార్ల తయారీకి పునాది ఏర్పడుతుందని పాలకులు చెప్పారు. అనేక విడిభాగాల తయారీని చిన్న పరిశ్రమల రంగానికి రిజర్వు చేశారు. చిన్న పరిశ్రమల రిజర్వేషనునుండి ఒక్కొక్క విడిభాగ తయారీని తొలగించటంద్వారా, ఆ విడిభాగాల పరిశ్రమను సుజుకీ కంపెనీయే పెట్టుకునే అవకాశం కల్పించారు. ఇప్పుడు విడిభాగాలన్నీ భారత పరిశ్రమలనుండే సేకరిస్తున్నట్లు సుజుకి చూపుతున్నది. అయితే ఆ పరిశ్రమలన్నీ సుజుకీ ఆధీనంలోనే వున్నాయి. ఇసి సూచన ప్రకారం యిప్పుడీ షరతును కూడా ఎత్తివేయాలి.

అలాగే విదేశీ పెట్టుబడివున్న బ్యాంకుల్లో డైరక్టర్ల బోర్డు సభ్యుల్లో సగం మందికి తగ్గకుండా భారత పౌరులుండాలన్న షరతువుంది. దీనిని చూపి దేశ ప్రయోజనాలను కాపాడుతున్నానని భారత ప్రభుత్వం పార్లమెంటుకు చెప్పింది. అయితే ఆ బ్యాంకులు తాము రూపొందించుకున్న అనుబంధ నిబంధనలలో (ఆర్టికల్స్ ఆఫ్ అసోసియేషన్) బోర్డుచేసిన నిర్ణయాలను వీటోచేసే హక్కుతోపాటు అన్ని అధికారాలనూ విదేశీయ మేనేజింగ్ డైరెక్టరుకు కట్టబెట్టడం ద్వారా విదేశీ పెత్తనాన్ని నిలుపుతుంది. భారతీయ డైరక్టర్లు వేతనం పుచ్చుకుని నిద్రపోవటంతప్ప చేసేదేమీ వుండదు.

అలాగే పరిశ్రమ స్థాపనకూ, నడిపేందుకూ విదేశాలనుండి చేసుకునే దిగుమతులు, స్వదేశానికి తిరిగి పంపే లాభాలూ, రాయల్టీలను మించి, ఎగుమతులద్వారా ఎక్కువ విదేశీ మారకద్రవ్యాన్ని ఆర్జించాలన్న షరతు వుంటుంది. అయితే తర్వాత మినహాయింపు లివ్వటం ద్వారా దీనిని వమ్ముచేస్తారు. భారత దేశంలో అమ్మినా కొనుగోలుదారు డాలర్లలో చెల్లిస్తే ఎగుమతులుగానే పరిగణిస్తామన్న మినహాయింపుతో ప్రకటిత లక్ష్యాన్ని అమలుచెయ్యరు.

ఈ షరతులపై "క్రమశిక్షణ అమలు" అన్న మాటల అర్థాల స్పష్టమే. షరతు పెట్టడం, తర్వాత మినహాయింపులు వద్దు ఏదో కొన్ని నామమాత్రపు షరతులతో సరిపెట్టమని చెప్పటమే. పెట్టుబడుల మదుపుకు "సవాళ్లు" ఎదుర్కోవటం "నూతన మార్కెట్లు"కనుగొనటం కోసం కలిసి పనిచేయటమన్న సంయుక్త ప్రకటన అర్థమిదే. ఈ షరతులన్నింటికీ చెల్లు చీటీ పాడటమే.

ఇసి చేసిన మరొక ముఖ్యసూచన పెట్టుబడుల తరలింపుపైవున్న ఆంక్షలన్నింటినీ తొలగించాలని కోరటం, దేశంలోకి వచ్చేందుకున్న ఆంక్షలను తొలగించమన్నట్లే. లాభాలూ, డివిడెండ్లు, పెట్టుబడి వృద్ధిఆదాయం, రాయల్టీలు, ఫీజులను దేశంనుండి తరలించేందుకు కూడా ఎలాంటి ఆంక్షలూ వుండరాదని కోరుతున్నారు. అంతేకాక పరిశ్రమను మూసివేసి వెళ్లిపోయేందుకుకూడా ఎలాంటి ఆంక్షలూ వుండరాదు. వీటి విపరిణామాలు స్పష్టమే. ఇలా ఎలాంటి ఆంక్షలూ లేకుండా పెట్టుబడులు తరలించి నందునే "ఆగ్నేయాసియా పులులు''గా ఆదర్శమని కీర్తించిన దేశాలలోని పరిశ్రమలన్నీ 1997లో ఒక్కసారిగా మూతపడి సంక్షోభంలోపడి కుదేలు అయ్యాయి. విదేశీ మారక ద్రవ్య నిల్వలలో అధికభాగం ఎప్పుడైనా తరలించుకుపోగల ఎఫ్ఐఐల రూపంలో ఇప్పటికేవున్న స్థితిలో ఈ సూచనను ఆమోదిస్తే 'అగ్రరాజ్య' స్థాయి వైపు నడుస్తున్నానని చెప్పుకుంటున్న భారత్ చతికిల పడుతుంది. సంఘటిత రంగంలోని కార్మికులు, ఉద్యోగులందరూ రోడ్డున పడే ప్రమాదం అంచున నిలబడినట్లవుతుంది. ఒక్క వెలుగు వెలిగి కొడిగట్టిన సాఫ్ట్‌వేరు రంగ అనుభవాన్ని భారత ప్రజలింకా మరిచిపోలేదు.

ఈ సూచనను ఆమోదిస్తే వచ్చిన లాభాలతో మరొక పరిశ్రమ పెట్టమని ఆదేశించే అవకాశం కూడా భారత ప్రభుత్వానికుండదు. విదేశీ పరిశ్రమల కెంత లాభాలు వచ్చినా, విదేశీ వాణిజ్యం, మారక నిల్వలు పెరిగాయని చెప్పుకోవటానికి తప్ప భారత ప్రజలకు మిగిలేదేమీ వుండదు. అసలు ఏ పరిశ్రమలు పెట్టాలి, వాటిద్వారా ఏ సరుకులు తయారుచెయ్యాలి, అవి భారత ప్రజలు అవసరాలు తీరుస్తాయా మొదలగు ఏ అంశం లోనూ భారత ప్రభుత్వానికి ఎలాంటి నిర్ణయాధికారమూ వుండదు. లాభార్జనే ధ్యేయంగా విదేశీ పెట్టుబడిదారులే ఈ నిర్ణయాలు తీసుకుంటారు.

సంక్షోభంలో కూరుకుపోయివున్న యూరపు సామ్రాజ్యవాద దేశాలు ఆ సంక్షోభ భారాన్ని భారత ప్రజలపై మోపేందుకు చేస్తున్న ప్రయత్నాల్లో భాగమే ఈ ఒప్పందం. 11వ ఇండియా – ఇయు శిఖరాగ్ర సమావేశంలో మేధోపర హక్కులకు ఆమోదించమనీ ధాన్య సేకరణలోకి అనుమతించమనీ, పాల ఉత్పత్తులకు ద్వారాలు తెరవమనీ, చిల్లరవ్యాపారం బీమారంగాలలో వున్న ఆంక్షలను తొలగించమనీ భారత్‌ను కోరాయి. దీనిని వ్యవస్థీకరించే ప్రయత్నమే ఒప్పందంకోసం చేసిన సూచనలు.

ఈ ఒప్పందం జరిగితే మేధోపరహక్కుల ప్రకారం దేశంలో ఉత్పత్తి అవుతున్న ఔషధాల ధరలన్నీ ఆకాశాన్నంటుతాయి. యూరపునుండి పాడి ఉత్పత్తులు కుప్పలు తెప్పలుగా వచ్చిపడటమేకాక బహుళజాతి పాడి పరిశ్రమలు కూడా రంగప్రవేశం చేస్తాయి. కోట్లాది రైతాంగం పాల ఉత్పత్తికి తగిన ధర అందక ఆదాయాలు కోల్పోతారు. చిల్లర వాణిజ్యం ద్వారాలు తెరిస్తే నాలుగుకోట్ల మంది చిల్లర వ్యాపారులు ఉపాధి కోల్పోతారు. ధాన్యసేకరణ రంగంలోకి సామ్రాజ్యవాదుల గుత్తకంపెనీలు ప్రవేశిస్తే రైతాంగానికి కనీస ధర రాదు; ప్రజా పంపిణీ వ్యవస్థ అడ్రసు లేకుండా పోతుంది. ఆహార ధాన్యాల ధరలు కొండెక్కి కూర్చుంటాయి.

ఫ్రాన్సు నుండి రెండు అణురియాక్టర్లను కొంటే 2 లక్షల కోట్లు రూ॥లు ఖర్చు అవుతాయి. దీనికి ప్రతిగా ఏఏ సరుకులు ఎగుమతి చేస్తానని భారత ప్రభుత్వం ఫ్రాన్సుకు చెప్పిందో గోప్యంగా వుంచారు. భారత్–ఇయుల మధ్య వాణిజ్యం 6 లక్షల కోట్లకు చేరుతుందట. అందులో 2 లక్షల కోట్లు అణురియాక్టర్లకే. మనవైపునుండి 3 లక్షల కోట్లకు ఎగుమతి చెయ్యాలంటే మనకు వున్నది పంటలూ, కార్లు మాత్రమే. అతి తక్కువ ధరకే వీటిని ఎగుమతి చేస్తారు. ఇక పెట్టుబడుల మదుపుతో పరిశ్రమలు కూడా విదేశీ ఆధిపత్యంలోకి పోతాయి. విదేశాలతో జరిగే ఒప్పందాలన్నీ భారత పాలకులు గోప్యంగానే వుంచుతున్నారు. పార్లమెంటుకు కూడా చెప్పరు. తాంబూలాలిచ్చేసాను తన్నుకు చావండిలా వ్యవహరిస్తారు.

దేశ ప్రయోజనాలకు వినాశకరమైన భారత–ఇయు ఒప్పందం చేసుకోరాదని డిమాండు చేయాలి. దేశ ప్రజల అవసరాలు తీర్చేవిధంగా స్వావలంబ పారిశ్రామిక విధానాన్ని అమలు జరపాలని నినదించాలి. దీనికోసం ఉద్యమించాలి. ✡

---

## భూసేకరణ...

(2వ పేజీ తరువాయి)

విద్యుత్తు కర్మాగారాలకు అవసరమయ్యే బొగ్గును విదేశాలనుండి దిగుమతి చేసుకుంటున్నారు. అణువిద్యుత్తు సంగతి చెప్పనవసరంలేదు. దేశానికెంత విద్యుత్తు అవసరమో దానినిబట్టి కాకుండా, అడిగిన వారికల్లా అనుమతులిచ్చేసారు. ఒక్క నెల్లూరు జిల్లాలోనే 30 కర్మాగారాలకు అనుమతినిచ్చారంటే రాష్ట్ర అవసరాలే కాదు, దక్షిణాది రాష్ట్రాల అవసరాలకు కూడా మించి యిచ్చారంటే ప్రణాళికా రహితంగా దోపిడీ వర్గాల కోర్కెలు తీర్చేటమే పనిగా సాగుతున్నది.

ఈ స్థితిలో భారత, విదేశీ గుత్తపెట్టుబడిదారుల లాభార్జన కొరకు పేదల జీవనాలను వినాశనానికి గురిచేస్తూ భూమిని ప్రభుత్వం సేకరించాలా? కళింగనగర్‌లో టాటాపెడుతున్న ఉక్కుమిల్లుకు పెట్టుబడి ఖర్చు 18వేల కోట్లు 25 ఏళ్లలో 16శాతం లాభాలతో మొత్తం తిరిగివస్తుంది. దీనిలో నష్టపరిహారానికి కేటాయించింది 69 కోట్లు. ప్రజల ప్రతిఘటనపై తుపాకీ కాల్పులతో విరుచుకుపడిన తర్వాత ఆశలు కల్పిస్తూ చేసిన వాగ్దానం 400 కోట్లు కూడా మొత్తం ఖర్చులో 2 శాతం. 54వేల కోట్లు ఖర్చుపెడుతున్న పోస్కో మిల్లు కూడా నిర్వాసితులయ్యే 2000 మందికీ చెల్లిస్తానన్నది వందకోట్లు. ఆందోళన తర్వాత యిప్పుడు వాగ్దానం చేస్తున్నది 400 కోట్లు. ఇందులో వందకోట్లు ప్రభుత్వ భూమికోసమే చెల్లిస్తారు. ఎలా చూసినా మొత్తం ప్రాజెక్టు వ్యయంలో, అది గడించే నాలుగురెట్ల లాభాలలో నిర్వాసితులకు సకల సౌకర్యాలూ కల్పిస్తే అయ్యే వ్యయం నామమాత్రమే. రోడ్లువంటి నిర్మాణాలలోనూ ఇదే పరిస్థితి. ప్రైవేటు పెట్టుబడిదారులకిచ్చి గోళ్ళూడగొట్టి టోలు వసూలుచేస్తూ అందులో ప్రభుత్వం రాయల్టీ వసూలు చేసుకుంటున్నది. ఈ భారాన్నంతా పెరిగిన రవాణా ఛార్జీల రూపంలో ప్రజలపై మోపుతున్నది.

ఈ స్థితిలో భూసేకరణ అన్న వాణిజ్యంనుండి ప్రభుత్వం తప్పుకోవాలి. 116 ఏళ్లనాటి భూసేకరణ చట్టానికి సవరణలతో అతుకులు వేయటంకాదు. దానిని మొత్తంగా రద్దుచేయాలి. పరిశ్రమలకు భూమి అవసరమైనప్పుడు భూమి స్వంతదారులతో బేరసారాలాడుకుని పెట్టుబడిదారులే కొనుగోలు చేసుకోవాలి. పర్యావరణ రక్షణ, కాలుష్యం, సమతుల్య అభివృద్ధి అంశాలుగా ఏఏ పరిశ్రమలు ఏ ప్రాంతంలో స్థాపించాలో సూత్రప్రాయంగా నిర్దేశించే పనికే ప్రభుత్వం పరిమితమవ్వాలి. ✡


**ఎన్.వై.ఎస్. ప్రచురణలు**

**అప్పుల ఊబికి అందమైన పేరే**
**మైక్రోఫైనాన్స్** 5/-

**తరతరాల విధ్వంసం** 5/-
భోపాల్‌లో నాడు జరిగిందేమిటి?
మళ్ళీ జరగవని గ్యారంటీ ఏమిటి?

**కాపీలకు: మైత్రీ బుక్ హౌస్**
**జలీల్ వీధి, అరండల్‌పేట,**
**విజయవాడ**

# స్వేచ్ఛా మార్కెట్టు ఫెమినిజం

జోహన్నా బ్రెన్నర్

*(హెస్టర్ ఐసెన్ స్టీన్ రాసిన 'ఫెమినిజం సెడ్యూస్డ్'(ఫెమినిజం లోబరుచుకోబడింది.) అన్న గ్రంథంపై, సాలిడారిటీ అనబడే ప్రజాతంత్ర, విప్లవ సోషలిస్టు, ఫెమినిస్టు, జాత్యహంకార వ్యతిరేక సంస్థ యొక్క కార్యకర్తా 'ఎగెనెష్టు ది కరెంట్' అనే పత్రికకు అసోసియేట్ ఎడిటర్ అయిన జోహన్నా బ్రెన్నర్, మంత్లీ రెవ్యూ పత్రికలో రాసిన సమీక్షకు ఇది అనువాదం-సంపాదకుడు)*

**సాధారణ** పాఠకుల కోసం రాయబడ్డ 'ఫెమినిజం సెడ్యూస్డ్' అన్న గ్రంథం ఉదారవాద ఫెమినిజంపై, చరిత్రపై ఆధారపడి చేయబడ్డ ఒక శక్తివంతమైన సవిమర్శనాత్మకమైన పరిశీలన. గత మూడు దశాబ్దాలుగా సోషలిస్టు/మార్క్సిస్టు ఫెమినిస్టులు, శ్వేత వర్ణేతర ఫెమినిస్టులు రాసిన పలు విషయాల నుండి గ్రహించిన సారం నుండి ఐసెన్‌స్టీన్ 'అధిపత్య ఫెమినిజం' యొక్క కేంద్ర భావనలు అమెరికాలోని కార్మికవర్గంపైనా, చిన్నకారు రైతులపైనా, గ్రామీణ ప్రాంతాలలోనూ పట్టణ ప్రాంతాలలోనూ వుండే వారిపైనా, దక్షిణ భాగపు ప్రపంచంలో వుండే వారిపైనా, పెట్టుబడిదారీ కార్పోరేట్లు జరిపే దాడులను ఏ విధంగా చట్టబద్ధంగావించాయో అన్న విషయాన్ని అత్యంత ప్రతిభావంతంగా వివరించింది.

ఈ విధంగా ప్రధాన స్రవంతి ఫెమినిజం అన్నది, తనకు తెలియకుండానే తాను పెట్టుబడిదారీ వర్గం చేతిలో ఒక సేవకురాలిగా సేవ చేసి పెట్టింది అని ఆమె వాదించింది. ప్రధాన స్రవంతి ఫెమినిజంపై తన విశ్లేషణను పెట్టుబడిదారీ ప్రపంచీకరణ విధానం యొక్క ఆర్థిక విధానాల యొక్క విశాల సందర్భంలో వుంచి, ఐసెన్‌స్టీన్, స్త్రీ-పురుష సంబంధ వ్యవస్థలో సంభవించిన మార్పులూ, నయా ఉదారవాదం పెరగటానికీ ఆ మార్పులకూ గల సంబంధాన్ని గురించి వివరించింది. ఈ పుస్తకం యొక్క సంయోజిత పరిధి, దాని యొక్క స్పష్టమైన తేలిగ్గా అర్థం చేసుకో వీలైన శైలీ, 20వ శతాబ్ద మధ్యకాలం నుండీ నేటి వరకూ రాజకీయ అర్థశాస్త్రంలో సంభవించిన మార్పులను గురించి ఆ గ్రంథంలో యివ్వబడిన సంక్షిప్త సారాంశములు, ఆ గ్రంధాన్ని ఉద్యమాన్ని అధ్యయనం చేసే గ్రూపుల వారికీ, కాలేజీ విద్యార్థులకూ ఒక ఆదర్శమైన పాఠ్య గ్రంథంగా చేశాయి.

ఐసెన్‌స్టీన్ తన విమర్శనాత్మక పరిశీలనను, ప్రత్యామ్నాయ వ్యూహాలను సూచించే దాకా సాగించింది. ఐతే, గత నూరు సంవత్సరాలుగా ఏ ద్వైతవాదమయితే మహిళా ఉద్యమాన్ని నాశనం చేసిందని తాను అంగీకరించిందో అదే ద్వైతవాదాన్ని రీసైకిల్ చేసి దాన్నే ఆమె ప్రత్నామ్నాయ వ్యూహంగా సూచించింది. అంతే కాక ఈ పుస్తకం యొక్క మరో దురదృష్టకరమైన లక్షణం ఏమిటంటే, పెట్టుబడిదారీ ప్రపంచీకరణ శకంలో ఫెమినిస్టు రాజకీయాలు, వ్యూహాల యొక్క పరిణామం గురించి ఆమె యిచ్చిన వివరణ, విషయాలపై ఆధారపడినదిగా వుండకుండా, స్వచ్ఛందవాద వివరణగా వుండటం అన్నది. అయితే దీన్ని గురించి ఈ సమీక్ష చివరి భాగంలో మరింతగా వివరణ యిస్తాను. ప్రస్తుతం ఐసెన్‌స్టీన్ యొక్క విశ్లేషణలోని పరిగణించాల్సిన బలమైన అంశాలపై కేంద్రీకరిస్తాను.

'ఆధిపత్య ఫెమినిజం' అన్న దానికి ఐసెన్‌స్టీన్, అమెరికా దేశపు సంస్కృతి యొక్క 'వ్యవహారజ్ఞానం'లో భాగమైన కొన్ని నిశ్చిత ఉదారవాద, ఫెమినిస్టు భావనలుగా అర్థం చెబుతోంది. ప్రత్యేకించి, అమెరికన్ ఉదారవాద ఫెమినిష్టుల నిశ్చిత అభిప్రాయమైన, వేతనం చెల్లింపబడే పనిలోనే మహిళల విముక్తి వుందనే-విస్తృతంగా అంగీకరింపబడిన భావనను ఆమె 'అధిపత్య ఫెమినిజం'గా భావిస్తోంది. రెండవ తరంగపు ఫెమినిజంలో సోషలిస్టు-అనార్కిష్టు ఫెమినిజం యొక్క, మూడవ ప్రపంచ, శ్వేత వర్ణేతర మహిళల ఫెమినిజం యొక్క, రాడికల్ ఫెమినిజం యొక్కా బలమైన సాంప్రదాయాలు యిమిడి వున్నప్పటికీ, ఆ ఉద్యమం యొక్క ప్రబలమైన భావనలూ, అభిప్రాయాలూ-అందరికీ స్వేచ్ఛగా వుండే, పోటీతత్వంతో కూడుకొని వున్న, మార్కెట్టు ప్రదేశ-రాజకీయ వ్యవస్థలో అంతర్లీనంగా వున్న స్వయం-వాస్తవికతను పొందటానికి గల అవకాశాలూ, వ్యక్తిగతంగా వాటిని సాధించగలగటం అన్న విషయంపైనే నొక్కచెప్పటం జరిగింది. ఉదారవాద ఫెమినిజం పలుసమస్యలను చేపట్టింది. కానీ లేబరు మార్కెట్టులో సమాన ప్రాతిపదికపై పురుషులతో సమానంగా పోటీ పడటానికి మహిళ హక్కు అన్న విషయంపై ఉదారవాద ఫెమినిజం అతి ఎక్కువగా కేంద్రీకరించింది.

ఉద్యోగాల్లోనూ, విద్యలోనూ వివక్షతకు వ్యతిరేకంగానూ, లైంగిక వేధింపులకు వ్యతిరేకంగానూ, మహిళలకు సమాన అవకాశాలు కల్పించే చర్యలు తీసుకోమని కోరటంలోనూ అటువంటి డిమాండ్లపై ఉదారవాద ఫెమినిజం చేబట్టిన ఉద్యమాలు కీలకంగా ప్రధానమైనవి. ఆ ఉద్యమాల యొక్క విజయం అన్నది మన యొక్క ఆర్థిక, రాజకీయ వ్యవస్థ యొక్క దృశ్యాన్ని-మహిళలకు మరింతగా ఉన్నతమైన వృత్తిపరమైన పనిని అందుబాటులోకి తెచ్చే దానిగానూ, మేనేజిమెంటు స్థాయి నాయకత్వాన్ని అందుబాటులోకి తెచ్చేదిగానూ, రాజకీయ అధికారాన్ని అందుబాటులోకి తెచ్చేదిగానూ-మార్చి వేసింది. కానీ మరోవైపు మహిళలకు ఉన్నతస్థాయి వృత్తి, మేనేజీరియల్ స్థాయి ఉద్యోగ అవకాశాలను అందుబాటులోకి తేవటానికి వీలైన చట్టబద్ధమైన, సాంస్కృతిక పరమైన మార్పులు రావటం కోసం ముందుకు తీసుకురాబడ్డ అదే సిద్ధాంతం, అమెరికాలోనూ, విదేశాల్లోనూ కార్మికవర్గ మహిళలను (శ్రమను) దోపిడీ చేయడాన్నీ, నిరుపేదలుగా మార్చటాన్నీ, దుర్భరస్థితిలోకి నెట్టడాన్నీ సమర్థించుకోవటానికి కూడా ఉపయోగ పడుతోంది. మహిళలందరికీ ప్రాతినిధ్యం వహిస్తున్న దానిగా చెప్పుకొంటూనే ప్రధాన స్రవంతి ఫెమినిజం ప్రాథమికంగా ఉన్నత విద్య నభ్యసించిన మహిళల ప్రయోజనాలనే ముందుకు తీసుకువెళ్ళింది. ఫలితంగా 40 సంవత్సరాల ఫెమినిస్టు ఉద్యమం తర్వాత శ్రామిక మహిళల్లో వర్గ విభజన (వర్గ పరమైన చీలిక) నెలకొని వుంది. ఇలా ఎందుకు? ఎప్పుడు? జరిగింది అన్న విషయాన్ని అర్థం చేసుకోవటం కోసం ఐసెన్‌స్టీన్ నయా ఉదారవాద రాజకీయవ్యవస్థ, ప్రపంచ ఆర్థిక వ్యవస్థను మౌలికంగా పునర్నిర్మాణం జరిపే సందర్భంలోని ఫెమినిజం యొక్క అభిప్రాయాలు, భావాలు, రాజకీయాల యొక్క చరిత్ర నుండి జాడలను వెతికింది.

ప్రపంచ పెట్టుబడిదారీ రాజకీయ అర్థశాస్త్రంలో సంభవించిన ఈ 'మార్పు సముద్రాన్ని' వివరించటం కోసం ప్రపంచీకరణను ఒక చట్రంగా తీసుకొన్న ఐసెన్‌స్టీన్ పారిశ్రామీకరణను తగ్గించటం, దక్షిణ ప్రపంచంలో ఎగుమతి ప్రక్రియాజోన్లు (ఇ.పి.జడ్‌లు) పెరగటం, సర్వీసు (సేవా) రంగం అభివృద్ధి చెందటం, ద్రవ్య సంబంధ రంగంలో సంభవించిన విస్ఫోటనం, యూనియన్లకు వ్యతిరేకంగా యజమానులు దాడులు అన్నవి వేతన శ్రమతో మహిళలకు గల సంబంధాల్లో సంభవించిన మార్పుకు కీలకమైన అంశాలుగా గుర్తించింది. ఉత్తర ప్రపంచంలో ప్రపంచీకరణ-పురుషుల వేతనాలను గణనీయంగా తగ్గించి వేయటం ద్వారా 'కుటుంబ వేతనం' యొక్క అంతానికి (రద్దుకు) ఒక గుర్తుగా వుంది. ఇంతవరకూ తరచుగా సాంప్రదాయక వివాహాలలో సాగుతున్న పురుషులు, కుటుంబానికి ఆహారాన్ని సంపాదించి, కుటుంబానికి ఆర్థిక మద్దతును యిచ్చే విధానానికి ప్రపంచీకరణ స్వస్తి చెప్పింది. అదే సందర్భంలో ఆర్థిక రంగంలో సేవా ఆర్థిక విధానం తలెత్తటం, పెరగటం వలన తక్కువ కూలి చెల్లింపబడే మహిళల శ్రమశక్తి యొక్క భారీ ఎత్తు డిమాండుకు ఆర్థిక రంగం తెరబడింది. దక్షిణ ప్రపంచంలో "నూతన ఆవరణ" (న్యూ ఎంక్లోజర్) ఉద్యమం మహిళలను విస్తరిస్తున్న లేబరు మార్కెట్టులోకి త్రోసి వేసింది. ఇప్పటి వరకూ ప్రధాన స్రవంతి ఫెమినిజం, మహిళలకు ఉద్యోగాలుండటం వలన వారు పితృస్వామిక అణచివేత నుండి తప్పించుకోగలరని కీర్తించినందున అమెరికాలో పెట్టుబడిదారులైన యజమానులు తమ ఖర్చులను తగ్గించుకోవటానికి వీలైన ఒక శ్రామికుల గనిని సృష్టించుకోవటానికి ఫెమినిజం దోహదపడింది. భారీ సంఖ్యలో మహిళలు కార్మికశక్తిలో చేరటానికి యిష్టపడటం వలన, వేతన పెంపుదల కోసం తమపై గతం నుండీ వున్న వత్తిడిని కార్పోరేషన్లు ప్రతిఘటించటానికి అనుమతి దొరికింది. వేతనాలు చెల్లింపబడే పనిని, స్వేచ్ఛగా గుర్తించటం ద్వారా, ఫెమినిజం స్వేచ్ఛా వాణిజ్య మండళ్ళలో బహుళజాతి కార్పోరేషన్లు మహిళల శ్రమను దోచుకోవటానికి అవసరమైన ఒక ముసుగును సమకూర్చి పెట్టింది. సంగ్రహంగా చెప్పాలంటే పెట్టుబడిదారీ ఆధునీకరణకు అది ఒక వాడుక భాష అయింది.

అమెరికా ఆర్థిక వ్యవస్థ పునర్నిర్మాణం అనే దానికి, నిర్మాణయుతంగా వున్న శ్రమశక్తిపై దాడి జరపటం అన్నది తోడయింది. ఇందుకు 1980 ఎన్నికలలో రీగన్ అధ్యక్షుడు కావటంతో మొట్టమొదటిసారిగా ఎన్నికలలో అధికారానికి రావటానికి తోడ్పడిన, పునరుద్ధరింపబడిన మితవాద ఉద్యమం ప్రేరణనూ, తోడ్పాటునూ ఇచ్చింది. తర్వాతి దశకాలలో కూడా నిర్మాణయుత శ్రమశక్తిపై దాడి కొనసాగుతూ, అదే వైఖరి బలపడి, తన పట్టును కొనసాగిస్తోంది. సంక్షేమ రాజ్యాన్ని రద్దు చేయటం అన్నది మితవాద రాజకీయ ఎజెండాకు కేంద్ర లక్ష్యం. 'సంక్షేమ సంస్కరణ' అన్నది సంక్షేమ రాజ్యాన్ని రద్దు చేయటానికి ఉపయోగించే పలు సాధనాలలో ఒకటి. కేవలం పూర్తిగా వేతన చెల్లింపు అన్నదే స్వేచ్ఛకు మార్గం అని కేంద్రీకరించటం వల్లనే, ఒంటరి తల్లులకు ఆదాయ మద్దతు హక్కు నిలబెట్టడానికి అవసరమైన వాదనలు తమ దగ్గర లేకుండా ఫెమినిస్టులు మిగిలిపోయారనీ ఐసెన్‌స్టీన్ వాదిస్తోంది. బిల్ క్లింటన్‌లాంటి మధ్యేమార్గ డెమోక్రటిక్ రాజకీయవేత్తలు "ఇన్నాళ్లూ మనం సంక్షేమ మనుకుంటున్న దాన్ని రద్దుచేయాలి" అని ఉద్యమిస్తూ, సంక్షేమ-సంస్కరణవాదుల ముఠాలో చేరిపోవటం అన్న దానికి గల ప్రత్యేక కారణం యిదే.

ఈ సందర్భంగా తొలి కాలపు సోషల్ ఫెమినిస్టుల యొక్క 'మాతృత్వవాద' రాజకీయాలనూ, ఒంటరి తల్లులకు ఆదాయపు మద్దతును, వ్యవస్థీకరణ కోసం వారు పోరాడిన విషయాన్నీ, ఇరవయ్యవ శతాబ్దపు మలుపులో రెండవ తరంగపు ఫెమినిస్టుల సమానత్వ రాజకీయాలతో సరిపోల్చి, రెండింటి మధ్య గల బేధాన్ని ఐసెన్‌స్టీన్ చూపించటం జరిగింది. మాతృత్వవాద ఫెమినిస్టులు తల్లులుగా మహిళలు చేసే పని విలువ గురించి పట్టుబట్టారు. ఆహార సంపాదన జరిపే పురుషుల నుండి ఆర్థిక మద్దతు లేనప్పుడు, తల్లులు తమ యొక్క పిల్లలను పెంచే పాత్రను నిర్వహించి, పరిపూర్తి చేయటానికి వీలుగా ముందుకు రావాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని ఆ మాతృత్వవాద ఫెమినిస్టులు వాదించారు. కానీ 1990 నాటికి మెజార్టీ భాగం వివాహితులైన తల్లులు పని చేయటం వలన, కనీసం పార్టు టైం ఉద్యోగినులుగానైనా పని చేయటం వలన ఈ రకంగా వాదించటానికి కష్టమైంది. ఐతే ప్రధాన స్రవంతి ఫెమినిస్టుల విశ్వాసాల వలన అది మరింత కష్టమైంది. జాతీయ మహిళల సంస్థ నాయకత్వం, కొంతమంది ఫెమినిస్టు పండితులతో కలిసి సంక్షేమ సంస్కరణల నిర్నిరోధక శక్తిని వ్యతిరేకించటం కోసం సంక్షేమ కార్యకర్తలతో కలవటం వలన, జాతీయ మహిళా సంస్థలోనూ, యితర ఫెమినిస్టు సంస్థలోనూ సభ్యత్వం తీసుకోవటం పట్ల-శతృభావం లేకపోయినా-విముఖత పెరిగింది. వేతనాన్ని చెల్లించే పనిని మహిళా విముక్తిలో కీలకమైనదిగా ప్రధాన స్రవంతి ఫెమినిజం నిర్వచించటం వలన ఇంటివద్ద మాడిపోయే తల్లుల యొక్క పనిని ప్రభుత్వం తన చర్యల ద్వారా వాణిజ్య సరుకుల విలువలను పెంచటంపై ఆధారపడ్డ పనిగా మార్చివేయటాన్ని గురించి గట్టిగా అడగటానికి అవకాశం లేకుండా పోయింది.

సంక్షేమాన్ని నిలబెట్టుకోవటం కోసం సమీకరించటంలో జరిగిన ఫెమినిస్టుల ఈ వైఫల్యం అన్నది, అమెరికన్ ఫెమినిజం అవలంబించిన చారిత్రక 'తప్పుడు పంథాల' యొక్క పర్యవసానాలలో ఒక భాగం. ఇది మహిళా ఉద్యమాన్ని గణనీయంగా బలహీనపరచింది. ప్రారంభకాలం నుంచీ కూడా, మహిళా ఉద్యమంలో ఆధిపత్యంగా వున్న గళాలు, కార్మికవర్గ-మహిళల యొక్క, శ్వేతవర్ణేతర మహిళల యొక్కా అనుభవాలను ప్రతిబింబించలేదు. అంతేకాక కీలక ప్రాముఖ్యత గలిగిన కార్మిక మహిళల యొక్కా, శ్వేత వర్ణేతర మహిళల యొక్కా సమస్యలు ప్రధానస్రవంతి ఫెమినిస్టుల ఎజెండాలో కనీసం చోటు కూడా చేసుకోలేదు. శ్వేత వర్ణేతర మహిళలు ఎక్కుపెట్టిన సవిర్శనాత్మక పరిశీలనా సారాంశాన్ని సంక్షిప్తపరుస్తూ, ఐసెన్‌స్టీన్, ఈ విషయంలోని వివాదాలు అమెరికన్ రాజకీయాల లోపల ఏ విధంగా అవకాశాలను లేకుండా హరించివేశాయో, అనేక ఉదాహరణలను యివ్వటం జరిగింది. గర్భ విచ్ఛిత్తి అనే దాన్ని పునరుత్పత్తి హక్కుల విశాల కార్యక్రమంలోని ఒక భాగంగా కాకుండా, ఒక వ్యక్తిగతమైన ఎంపిక అన్న అంశంగా, మహిళలను సమీకరించటం వలన మహిళా ఉద్యమం, మితవాదుల దాడులకు తక్కువ లోనుకాగల అన్ని వర్గాల మహిళల, అన్ని జాతుల మహిళల ఉద్యమాన్ని సృష్టించటానికి గల అవకాశాలను పోగొట్టుకొంది అని ఆమె (ఐసెన్‌స్టీన్) వాదిస్తోంది. అదే విధంగా జాత్యహంకార స్థితి వున్న వాస్తవికతను విస్మరించిన హింసా వ్యతిరేక ఫెమినిస్టు ఉద్యమం అభివృద్ధి నిరోధక "శాంతి భద్రతల" ఎజెండాను ముందుకు తీసుకోపోయే దుర్మార్గంలో ఏ విధంగా భాగస్వామి అయిందో, ఆ దుష్ట ఎజెండా పట్టణాల మురికివాడల నివాసితులను వాళ్ళ సామాజిక, ఆర్థిక పరిస్థితులు దిగజారటానికి కారకులుగా వాళ్లనే నిందిస్తూ ఏ పద్ధతుల్లో వనరులను సామాజిక సంక్షేమానికి దూరంగానూ, జైళ్ళ వైపుకూ మళ్లించటం జరిగిందో ఆమె ఎత్తి చూపింది.

## ఫెమినిజం, సామ్రాజ్యవాదం, ఇస్లామ్‌ను గురించిన భయం (ఇస్లామోఫోబియా)

దక్షిణ ప్రపంచంలో నయా ఉదారవాద కార్పోరేటు ఎజెండాను చట్టబద్ధం చేయటానికి కూడా ప్రధాన స్రవంతి ఫెమినిస్టు సిద్ధాంతం వాడుకోబడింది. నియంత్రణలను రద్దు చేసే వ్యవస్థాగత సర్దుబాటు కార్యక్రమాలనూ, ప్రభుత్వ రంగంలో కోతనూ, ఎగుమతి ప్రక్రియా మండళ్ళలో యువ మహిళా కార్మికులకు ఉపాధి అవకాశాలను పెంచే విధానాలు అన్నట్టుగా ప్రపంచ బ్యాంకు వాటిని సమర్థించింది. మైక్రో రుణ విధానం అన్నది మహిళా దారిద్ర్యానికి పరిష్కారంగా మాయమాటలు చెప్పి, ఆ విధానాన్ని ముందుకు తోసింది. ఈలోగా మహిళలకోసం, మహిళ చేత నిర్వహింపబడిన (విదేశీ దాతల విరాళాలపై ఆధారపడ్డ) ప్రభుత్వేతర సంస్థలైన ఎన్.జి.ఓలు ప్రభుత్వ సేవలను రద్దు చేయటానికి వీలు కల్పించటమే కాకుండా, మహిళల యొక్క క్రియాశీలక ఆర్థికాభివృద్ధి నుండి వచ్చే సమష్టి సాధికారత స్థానంలో కొద్దిమంది మహిళలకే చేకూరే వ్యక్తిగత సాధికారత ప్రత్యామ్నాయంగా చూపెట్టబడింది. దక్షిణ ప్రాంత ప్రపంచంలోని మహిళల జీవితాలపై పెట్టుబడిదారీ విస్తరణ వలన పడిన ప్రభావం గురించిన సంక్లిష్టమైన ఫెమినిస్టు సుదీర్ఘమైన చర్చలను ఐసెన్‌స్టీన్ మరీ ఎక్కువగా సరళీకరించినప్పటికీ, ఆమె చెప్పిన విషయమైన-1990 నుంచీ నయా ఉదారవాద పెట్టుబడిదారీ విధానాన్ని నిర్వహిస్తున్న బడా సంస్థలు "మహిళల సాధికారత" అన్నదాన్ని తమ యొక్క వ్యవస్థాగత సర్దుబాటు కార్యక్రమం ద్వారా ప్రత్యేకించి సాధికారతను రద్దు చేస్తున్న దాని ప్రభావాల నుండి దృష్టి మళ్ళించటానికి వాడుకొన్నారు అన్న నిర్ధారణ సరైన మంచి విషయమే.

ఆర్థిక విషయాల నుండి, రాజకీయ హింస వైపు పరిశీలనను మళ్ళించిన ఐసెన్‌స్టీన్ ప్రధాన స్రవంతి ఫెమినిజానికి, టెర్రరిజంపై యుద్ధంతో సంబంధాన్ని కలుపుతోంది. ఆమె ఇస్లామోఫోబియా (ఇస్లాంను గురించిన భయం)ను గురించి చారిత్రకంగా ఆధారపడిన విశ్లేషణను ఇచ్చింది. చాలా కాలంగా జరుపుతున్న చర్చలు, ప్రసంగాల ద్వారా, సామ్రాజ్యవాద ప్రాజెక్టులను, అవి వలస దేశాల మహిళలను "వెనుకబాటులో" వున్న పితృస్వామిక సంస్కృతికి చెందిన పురుషుల నుండి 'రక్షిస్తున్నాయి' అనే రూపంలో సమర్థించటం జరిగింది అనీ, ఆ రకంగా ఇస్లామోఫోబియా ఇటీవలి కాలపు పరిణామం అనీ విశ్లేషించింది. ఫెమినిస్టు మెజార్టీ జాతీయ సంస్థల నుండి, కండోలిజా రైస్, లారా బుష్‌లదాకా ఇరాక్, ఆఫ్ఘనిస్థాన్‌లపై జరిగిన దండయాత్రలను సక్రమమైనవేనని చెల్లుబాటు చేయటం కోసం ఫెమినిస్టు ఆగ్రహాన్ని సమీకరించటం జరిగింది. ఇస్లామోఫోబియా వెనుకదాగిన నిరాధార వూహల ముసుగులను ఐసెన్‌స్టీన్ క్రమపద్ధతిలో తొలగించింది. వాటిని ప్రశ్నించింది. ఉదాహరణకు, సమకాలీన ఇస్లామిక్ మత ఛాందసవాదం అన్నది ఇస్లామిక్ సాంప్రదాయంలో అంతర్భాగం కానే కాదనీ, వాస్తవానికి ఈ సమకాలీన ఇస్లామిక్ మతఛాందసవాదం పెట్టుబడిదారీ ఆర్థిక రాజకీయ, సాంస్కృతిక ఆధిపత్యం నుండీ, సామ్రాజ్యవాద హింస నుండీ పుట్టుకు వచ్చిన ఒక ఆధునిక రాజకీయ ఉద్యమమనీ ఆమె సూచించింది. తన పుస్తకం యొక్క ఈ అధ్యాయంలో ఐసెన్‌స్టీన్ ముస్లిం ఫెమినిస్టు పండితుల, ముస్లిం ఫెమినిస్టు కార్యకర్తల పనిని గురించి యిచ్చిన విశదీకరణ ఎంతో ఉపయుక్తంగా వుంటుంది. ఈ వివరణ ముస్లిం మహిళల అవసరాలూ, ప్రయోజనాలను గురించిన, ప్రధాన స్రవంతి ఫెమినిస్టు అభిప్రాయాలకు ప్రత్యామ్నాయం సమకూర్చటానికి ఉపయోగపడుతుంది.

## ఫెమినిజం ఎలా హైజాక్ చేయబడింది? ఏం చేయాలి?

ఫెమినిజం ఏ రకంగా ఉన్నత పాలక వర్గం చేత దత్తత చేసుకోబడింది అన్న విషయంపై ఐసెన్‌స్టీన్ యిచ్చిన వివరణ, తమ అదుపులో లేని పరిణామాలకు గాను ఫెమినిస్టులను నిందించే వైపుగా వుంది. ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక క్షేత్రాలలో పురుషులతో సమాన స్థాయిలో పోరాడే హక్కు అన్నదే స్వేచ్ఛ అనే అభిప్రాయంపై ఆధారపడ్డ ప్రామాణిక ఉదారవాద ఆలోచనలు గల ఫెమినిజాన్ని సవిర్శనాత్మకంగా ఐసెన్‌స్టీన్ పరిశీలించి చేసిన నిర్ధారణతో, నేనూ ఏకీభావాన్ని కలిగి వున్నాను.

(తరువాయి 5వ పేజీలో)

# అమెరికా టక్సాన్‌లో సెనేటర్‌పై కాల్పులు

డేవిడ్‌నార్త్

**ఆరుగురి** ప్రజల మరణాలకు; చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడే ఒక కాంగ్రెస్ సభ్యురాలితో సహా మరి 14 మంది గాయపడటానికి మూలమైన శనివారం నాటి హింసకు బాధ్యత ఎవరిది?

హంతకదాడికి పాల్పడి కాల్పులు సాగించిన జారెడ్ ఎల్.లానెర్‌కు-రిపబ్లికన్ పార్టీ రాజకీయ నాయకుల అంతులేని ఫాసిస్టు ప్రకటనలకు; కార్పోరేట్ నిధులతో నడిచే 'టీ-పార్టీ' సంస్థలకు మరియు రేడియో-టెలివిజన్ వాక్‌శూరులకు ప్రత్యక్ష, తక్షణ సంబంధముందనేది నిస్సంశయం. ప్రస్తుత రాజకీయ వాతావరణాన్నిగానీ, ఖచ్చితంగా ఏ ఒక బృందాన్నిగానీ కాల్పులు జరిపిన అతనిని ప్రేరేపించారని నిందించటమనేది ఆధారరహిత మైనద'ని 'ది వాషింగ్‌టన్ పోస్టు' మందలిస్తూ అమెరికాలో నెలకొన్న రాజకీయ చలనసూత్రాలు, సామాజిక అమరిక, తీవ్రమితవాద మానసిక స్థితులగురించి బాగా ఎరిగున్న వాస్తవాలను దాటవేసింది. 'వాషింగ్‌టన్ పోస్టు' ప్రకారం 'హంతకుడు లానెర్ పొందికయిన ఒక రాజకీయ తాత్వికతలేని అస్థిమిత యువకుడు మాత్రమే' అనేది పూర్తిగా పిచ్చి ప్రేలాపన. ప్రజలు తీవ్రమైన మానసిక జబ్బులకు-అసహ్యత, మతాంధత్వం, కమ్యూనిస్టు వ్యతిరేకత-వంటి వాటికి తేలికగా మారుతున్నారనే విషయం దీర్ఘకాలంగా అమెరికా హక్కుల ఎరికలో వుంది.

ఏమైనా, పూర్తిగా టీవీలలో ప్రసారమయ్యే వాక్‌చాతుర్యంతో కూడిన రాజకీయ హక్కుల ప్రచార ఫలితంగానో, వాటి స్థిరత్వ ఫలితంగానో లానెర్ చర్యలను వివరించబూనుకోవటం అసంపూర్ణంగా వుంటుంది. టక్సాన్‌లో జరిగిన రక్తసిక్తమైన ఘటనలకు లోతైన సామాజిక కారణాలున్నాయి. అమెరికా అత్యంత ఆనందకరమైన ప్రదేశమనీ, అత్యున్నత నాగరికదేశమనీ, డెమోక్రటిక్ పార్టీ మరియు 'ఉదారవాద వామపక్షమూ' రాజకీయంగా దిగజారిపోయి తమకు తాము ఓదార్పు మాటలు చెప్పుకుంటున్నాయి.

జాన్‌స్టువార్ట్ సువార్త ప్రకారం అతి, మితవాదు లందరికీ నచ్చచెప్పుకోవటం, ఎక్కువగా విని తక్కువగా చర్చించుకోవటం, అందరికీ తగిన సాధారణ భూమిక నేర్పరచుకోవటమే హేతుబద్ధంగా ఆలోచించే ప్రజలందరి ఎదుటా వున్న కర్తవ్యమని వారు వాదిస్తున్నారు. ఈ దుర్బలమైన సార్వత్రిక ఒప్పంద స్ఫూర్తి, కాంగ్రెస్ సభ్యురాలు గిఫర్ట్స్‌పై హత్యా ప్రయత్నానంతర కాలంలోని తీవ్ర ప్రతీఘాతుక వ్యక్తీకరణ! హింసకు ప్రతిగా అమెరికా ప్రజలు ప్రజాశత్రువుల మాదిరి తమ పలుకుబడిని దెబ్బతీసుకునే బదులు రాజకీయాలను ఆచరించేందుకు, పౌరసత్వాన్ని ఉన్నతమైనదిగా భావించేందుకు 'నేషన్' పత్రికకు చెందిన 'రిచర్డ్ కిమ్' ప్రతిపాదిస్తున్నాడు.

ఈ మాటలు అమెరికాలోని 'వామపక్ష' రాజకీయ దివాళాకోరుతనాన్ని, ఆత్మహననంగా వెల్లడిచేస్తున్నాయి. అదేవిధంగా అతి 'మిత' వాదులకు ప్రజల కష్టనష్టాలను ఉపయోగించుకోవటం, సామాజిక అసంతృప్తులను గుత్తకు తీసుకోవటం ఎందుకు సాధ్యమైందనే కారణాలను కూడా ఈ ఘటన వెల్లడిచేస్తున్నది. అమెరికాలో 1930లనాటి మహాసంక్షోభం తర్వాతి కాలపు తీవ్ర ఆర్థిక సంక్షోభం సంభవించి మూడు సంవత్సరాల కాలం గడిచి నాలుగో సంవత్సరంలో ప్రవేశించింది. అధికారికంగా నిరుద్యోగిత 10శాతానికి(ఉద్యోగం కోల్పోయి ఎదురు చూసే వారిని లెక్కించకనే) చేరుకుంది. గృహరుణాల భారంలో పదుల మిలియన్ల అమెరికన్ కుటుంబాలు తమ ఇళ్ళను వదులుకున్నారు. సామాజిక అంతరాలు 1920ల నాటి స్థితికి చేరాయి. గత 40 సం॥ల కాలంలో అమెరికా కార్మికుల ఆదాయాలు ఎదుగూబొదుగూ లేకుండా ఉండిపోయాయి. ఆదాయాల్లో పెరుగుదల అంతా జనాభాలో ఒక శాతంగా వున్న అత్యంత ధనికుల జేబుల్లోకి చేరుతున్నది.

2008 సెప్టెంబర్‌లో సామాజిక సంక్షోభం బ్రద్దలైన తర్వాత, బుష్, ఒబామాలు తమ శక్తియుక్తులన్నిటినీ-ఎవరి దురాశాపూరిత సట్టావ్యాపారం ఈ పతనానికి హేతువయిందో ఆ కులీన, అత్యంత ధనిక, కార్పొరేట్ల ప్రయోజనాలను పరిరక్షించటానికే వెచ్చించారు. ఒబామా పాలనలో రాజ్య యంత్రాంగంపై ఆర్థిక శక్తుల ప్రయోజనాల పట్టు మరింత బిగిసింది. ఆర్థిక పరిశ్రమలోని ఏ ఒక్కరూ ఈ విపత్తుకు జవాబుదారీగా వుండక పోవటమేగాక, ఆర్థిక పరాన్నభుక్కుల రాజకీయ పలుకుబడి, సంపద మరింతగా పెంపొందాయి. వాస్తవానికి, ఒబామా పరిపాలనలో వైట్‌హౌస్-గోల్డ్‌మాన్ సాచెస్ మరియు జె.పి.మోర్గాన్ ఛేజ్‌లకు సంయుక్త శాఖా కార్యాలయంలాగా సేవలందించింది.

రిపబ్లికన్ మరియు డెమోక్రటిక్ పార్టీల రాజకీయ నాయకులు అమ్ముడుబోయారని, ప్రభుత్వంచేసే ముఖ్యమైన నిర్ణయాలన్నీ సంపన్నులకోసమేనని లక్షలాదిమంది అమెరికన్ కార్మికులు సరిగ్గానే గమనించారు. ఈలాంటి రాజకీయ వ్యవస్థలో 'నేషన్' పత్రిక ప్రజలను 'వికసించమ'ని, 'విస్తరించమని', 'సంబరాలు జరుపుకోమ'ని కోరుతున్నది. ఈ విధమైన తీవ్ర సామాజిక సంక్షోభం నడుమనున్న ప్రజలకు ఈ సందేశం ఏవిధంగా తోస్తుంది? 'నేషన్' మరియు అదే స్వభావం కలిగిన 'ప్రగతిశీల' ప్రచురణలు అమెరికా రాజకీయాలను సాధారణంగానూ ప్రత్యేకించి ఒబామా పరిపాలనను ప్రసంశించటం ఆశ్చర్యం కాదూ?!

రోజురోజుకీ నిరాశా, నిస్పృహలతోనూ, ఆగ్రహం తోనూ పెల్లుబుకుతున్న ప్రజానీకం సంఖ్య పెరుగుతున్నది. ఈ తీవ్ర సంక్షోభంనుండి బయటపడే మార్గంకోసం వారు ఎదురు చూస్తున్నారు. కానీ ఏమి చేయాలో, ఎవరితో పోరాడాలో, అన్నిటికంటే ముఖ్యంగా ఎలా పోరాడాలో వారికి చెప్పేవారెవరు? 'స్టెయిన్ బ్యాక్' రూపొందించిన జాన్‌ఫోర్డు దర్శకత్వంలోని 'గ్రేప్స్ ఆఫ్ రాత్' సినిమాలో ఒక అద్భుతమైన సన్నివేశముంది. ఒక నిరుపేద రైతు, తను జీవితకాలం కష్టించి పనిచేసిన భూమినుండి తొలగించబడతాడు. ఆ సందర్భంలో, ఆగ్రహంతో, 'నేను ఎవరిని కాల్చిపారేయాలి?' అని అతను ప్రశ్నిస్తాడు. సూటి సమాధానం పొందలేని పరిస్థితుల్లో నిరాశతో తానే మన్నులో కలిసిపోతాడు.

లక్షలాదిమంది ప్రజలు ఈ రోజున అదే పరిస్థితిలో వున్నారు. విపత్తుల కారణంగా వారు భయకంపితులై వున్నారు. వారు ఎవరినీ కాల్చి చంపాలని భావించటంలేదు. వారు మార్పును కోరుకుంటున్నారు. దానికొరకు పోరాడటానికి వారు సంసిద్ధులుగా వున్నారు. కానీ, యావత్ సామాజిక నిర్మాణం, దానిపై నిర్మించబడిన రాజకీయవ్యవస్థ నిరసనను లేదా ప్రగతిశీల మార్పును ఆమోదించేందుకు ఏవిధమైన అవకాశమూ కల్పించటం లేదు. అత్యధిక సంఖ్యలోని అమెరికన్ కార్మికవర్గానికి నిర్మాణయుతమైన ఒక సామాజిక కార్యక్రమంలో పాల్గొనే అవకాశం కలగలేదు.

1980 ముందు కాలంలో అతిపెద్ద నిరసనలూ, పట్టణప్రాంత వెల్లువలతో సహా సమ్మెలూ, ఇతర రూపాల్లో సామూహిక నిరసనలూ అమెరికా ప్రజల జీవితంలో భాగంగా వుండేవి. సామాజిక ప్రగతికి మార్గదర్శకమైన వర్గపోరాటాలు ఏదో ఒక రూపంలో జరుగుతూండేవి. 1980ల ప్రారంభంలో, ఫెల్ప్సుడాడ్జికి వ్యతిరేకంగా అరిజోనా ప్రాంతం రాగి గని కార్మికులకు ముఖ్యమైన కేంద్రంగా వుండేదనే విషయం గమనార్హం. సమ్మెకు ముఖ్యమైన కారణాల్లో ఒకటేమంటే, టస్కాన్‌నుండి మరీ దూరం లేని అజో పట్టణంలోని గని! 1980లలో జరిగిన ఇతర సమ్మెలకు వలెనే అది కూడా విద్రోహానికి గురైంది.

1930-65ల మధ్య కాలంలో మహత్తర సామాజిక సంఘర్షణలనుండి ఉద్భవించిన అధికారిక కార్మిక సంఘాలూ, పౌరహక్కుల సంఘాలూ గత 30 సంవత్సరాల కాలంగా ప్రజానీకపు ప్రతి అసంతృప్తి వ్యక్తీకరణనూ అడ్డగించేందుకో, అణచివేసేందుకో తమను తాము అంకితం జేసుకున్నాయి. సమ్మెలూ, మరే ఇతర సామాజిక నిరసన రూపాలూ నిజంగా అదృశ్య మయ్యాయి. ఇదే కాలంలో, డెమోక్రటిక్ పార్టీ మరియు రిపబ్లికన్ పార్టీల పాలనా యంత్రాంగం అత్యంత ధనికుల

**(తరువాయి 8వ పేజీలో)**

## స్వేచ్ఛా మార్కెట్టు... (4వ పేజీ తరువాయి)

ఈ ఉదారవాద ఫెమినిజం, నయా ఉదారవాద పెట్టుబడిదారీ విధానాన్ని సహించి దానితో సహజీవనం చెయ్యటం మాత్రమే కాదు, అది లిబరల్ ఫెమినిజాన్ని బలంగా ప్రతిపాదించిన శ్వేతజాతి వృత్తి నైపుణ్య/మేనేజీ రియల్ స్థాయి ఉద్యోగాలు చేసే మహిళల యొక్క వాస్తవ ప్రయోజనాలను కూడా ప్రతిబింబించింది.

అందువలన మౌలికంగా ఎక్కువ విప్లవకర దృక్పథం బదులుగా ఈ ఫెమినిజం మన కాలంలోని లోకజ్ఞానం అవటం అన్నది ఆశ్చర్యం కాదు. అయితే ఈ రాజకీయాలు రెండవ తరంగపు సంస్కరణ కార్యకర్తలలో గల పెద్ద ధోరణి కాదు. రెండవ తరంగపు ప్రధాన స్రవంతి అనుసరించిన విశాలమైన సంస్కరణల కార్యక్రమాలను, వీటిని నేను సామాజిక సంక్షేమ ఫెమినిజం అని పిలుస్తున్నాను- పలుచన చేయబడ్డ అమెరికన్ తరహా సోషల్ డెమోక్రటిక్ రాజకీయాలు ఉత్సాహపరిచాయి. కేవలం స్త్రీ, పురుషుల మధ్య వివక్షను అంతం చేయమని మాత్రమే కాక, మహిళలను ఆదాయపు సంపాదకులు, సంరక్షకులుగా ద్విపాత్రను పోషించే వారిగా వారికి మద్దతు కూడా కల్పించాలని సామాజిక సంక్షేమ ఫెమినిజం ప్రభుత్వం వైపు చూసింది. ఉదాహరణకు వేతనాలు చెల్లించే కుటుంబ సెలవలనూ, భరించగలిగే నాణ్యమైన శిశు సంరక్షణనూ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండు చేసింది. మనం ఎరిగున్నట్లుగా వీటి విషయంలో సామాజిక సంక్షేమ ఫెమినిస్టులు పూర్తిగా విజయవంత మయ్యారు. అయితే బలంగా యజమానులు జరుపుతున్న దాడి సందర్భంలోనూ, మితవాదులు అధికారం కోసం తిరుగుబాటు సలిపే సందర్భంలోనూ, వ్యాధిగ్రస్తమైన వాణిజ్య సంఘాలకు అసమర్థతపై పోరాటంపై ఆధారపడాలనే ఆసక్తి లేని సందర్భంలోనూ, మితవాదం వైపుకి ఒక డెమోక్రాటిక్ పార్టీ వేగవంతంగా కదులుతున్న సందర్భంలోనూ, సామాజిక సంక్షేమ ఫెమినిస్టు కార్యక్రమానికి రాజకీయ స్థలం అన్నదే లేదు. అతి పెద్ద విశాలమైన మిలిటెంట్, విఘాతం కలిగించగలిగే సామాజిక ఉద్యమం మాత్రమే - ఫెమినిజాన్ని, జాత్యహంకార వ్యతిరేక ఉద్యమాన్నీ, నపుంసకుల హక్కుల ఉద్యమాన్నీ, వలస కార్మికులు కార్మిక సంఘాలు ఏర్పాటు చేసుకొనే ఉద్యమాన్నీ, కార్మిక పోరాటాలనీ ఒకటిగా కలిపే ఉద్యమం మాత్రమే-అటువంటి కొన్ని రాయితీలను గుంజుకోగలిగి వుండేది. కానీ ప్రస్తుతం ఉనికిలో వున్న ఆర్థిక, రాజకీయ స్థితి సందర్భంలో, అటువంటి ఉద్యమమన్నది ఆలోచనలోనే లేదు. ఈ సందర్భంలో 'లోబరచుకోబడిన' అనే దాని కన్నా 'పరాజయం పొందిన' (ఫెమినిజం) అన్నదే తగిన రూపకాలంకారపదంగా వుంటుంది.

పూర్తిస్థాయి మాతృత్వాన్ని గురించి, రెండవ తరంగపు ఫెమినిజం ఒకే సమయంలో విరుద్ధమైన భావాలను కలిగి వుంది. యిప్పటికీ అదే విధంగా మిగిలి వుంది అని ఐసెన్‌స్టీన్ చేసిన నిర్ధారణ పూర్తిగా సక్రమమైనదే. అయితే ఫెమినిజంలో గల ఈ విరుద్ధ భావాలకు ఐసెన్‌స్టీన్ చేసినట్లు ఫెమినిస్టులను నిందించటానికి బదులు, మనం యిలా జరగటానికి గల మూలాలు పెట్టుబడిదారీ రాజకీయ అర్థశాస్త్రంలోనే వున్నాయని గుర్తించి, ఫెమినిస్టులు ఇంటి వద్ద వుండే తల్లుల గురించి పని చేయాలా? లేక వేతనం కోసం పనిచేసే మహిళల కోసం పని చేయాలా? అన్న అనంతమైన చర్చను నిలిపివేయాలి. నిజమే ఒంటిరి తల్లులతోసహా మహిళలందరికీ తాము తమ మాతృత్వ స్థితినీ, వేతన పనిని ఏ రకంగా మిళితం చేసుకోవాలన్న విషయాన్ని ఎంపిక చేసుకొనేందుకు వీలుండాలి. అయితే చేసుకోవటానికి 'ఎంపికలు' వున్నాయనే వాస్తవం దానికదే-ప్రత్యేకించి ఆ ఎంపికలన్నవి మంచివి కాకపోతే-అర్థంలేనిదవుతుంది. తమ ఉద్యోగాలంటే యిష్టపడే తల్లులు సహితం అతి ఎక్కువ పనికి గురి చేయబడుతున్నారు. శ్రామిక శక్తిలో చేరటానికి నిర్ణయించుకొన్న మహిళలు తర్వాతి కాలంలో వేతనాలు, పెన్షన్లూ, తదితర ప్రయోజనాల విషయంలో భారీ ఎత్తు పెనాల్టీలను చెల్లించాల్సి వస్తోంది. "లింగాలను (జండర్‌ను) రద్దు చేయాలి" (అబాలిషిన్ ఆఫ్ జండర్) అన్న విషయంపై పట్టు పడుతున్నందుకు ఫెమినిస్టు పండితులను ఐసెన్‌స్టీన్ తన లక్ష్యం చేసుకొంది. ఈ రకమైన వ్యతిరేకపు (రద్దును చేసే) సలహా వలన, "స్త్రీలకుండే సుగుణాల" పేరిట మహిళలు ఏ హక్కులనైనా డిమాండు చేయగల అవకాశం బలహీనపడింది అని ఐసెన్‌స్టీన్ వాదిస్తోంది. మాతృత్వవాద ఫెమినిస్టులు మహిళల సాంప్రదాయ ఆదర్శాలైన పిల్లల సంరక్షణ, పోషణ అన్న విషయాలను పట్టించుకొని, వాటి విషయమై ప్రభుత్వాన్నీ, సమాజాన్నీ డిమాండు చేస్తూండగా, ఆధునిక ఫెమినిస్టులు లింగ భేదంపై ఆధారపడ్డ మహిళల హక్కుల కోసం డిమాండు చేయటానికి మొండిగా నిరాకరించారు. ఆ రకంగా లింగ భేదంపై ఆధారపడి వాదిస్తే, అనివార్యంగానే మహిళలు పురుషులకన్నా వేరైన వారు, తక్కువ రకమైన వారు అనే సమర్థనలు తిరిగి ఉత్పన్నమవుతాయనే భయంతో ఆధునిక ఫెమినిస్టులు లింగ బేధంపై ఆధారపడి మహిళల హక్కులకై డిమాండు చేయటానికి మొండిగా నిరాకరించారు. అయితే ఈ భయాలు సరైనవే అని నేను భావిస్తున్నాను.

అయితే మాతృత్వవాద రాజకీయాలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయని ఐసెన్‌స్టీన్ గుర్తిస్తోంది కనుక, సామాజిక నిర్మితయైన స్త్రీల ద్విపాత్రను గురించి అతీతంగా వుండటానికి ఫెమినిస్టులు చేసే ప్రయత్నాల పట్ల ఐసెన్‌స్టీన్ వ్యతిరేకతను వ్యక్తపరచటం అన్న విషయం పట్ల నేను అయోమయంలో పడ్డాను. ఐసెన్‌స్టీన్ ఏదో ఒక లేదా ద్విపాత్రా వైఖరిని అవలంబించటానికి బదులు ఐసెన్‌స్టీన్ రెండు వైఖరులనూ అవలంబించటాన్ని చూడాలని నేను కోరుకుంటున్నాను. పిల్లల సంరక్షణ, పోషణ అన్న వాటి విలువలను గుర్తించి వాదించటం కోసం, అవి ప్రత్యేకించి మహిళల సుగుణాలు అని నిర్దిష్టంగా క్రోడీకరణ (నియమం) చేయనవసరం లేదు. ఒంటరి తల్లులకు ఆదాయపు మద్దతును డిమాండు చేయటం కోసం, యింటి వద్ద వుండే తల్లులకు పిల్లలను పెంచే రూపంలో ప్రత్యేక హక్కు కల్పించాల్సిన అవసరం లేదు.

ఉదాహరణకు, 1989-1998 కాలంలో సామాజిక సంక్షేమంపై నిలకడగా దాడి జరుగుతున్న కాలంలో నేను ఒక సంక్షేమ హక్కుల గ్రూపును నిర్వహించి దానిలో పని చేశాను. ఈ గ్రూపు తన యొక్క రాజకీయాలను సంక్షేమ సంస్కరణ చుట్టూ అభివృద్ధి పరిచింది. మొత్తం తల్లి-తండ్రులకు ప్రభుత్వం ఆదాయపు మద్దతునివ్వాలనే విస్తృతమైన కార్యక్రమంలో భాగంగా ఒంటరి తల్లులకు ప్రభుత్వం ఆదాయ మద్దతు కల్పించాలనే డిమాండును కూడా రూపొందించింది. (ఉ: పిల్లలను పెంచటానికి వేతనంతో కూడిన సెలవులు, తక్కువ ఆదాయపు కుటుంబాల వారికి సబ్సిడీలు, భరించగల నాణ్యమైన పిల్లల సంరక్షణా హక్కు లాంటి డిమాండ్లు). ఇందువలన (విస్తృతంగా తల్లితండ్రులందరికీ ప్రభుత్వ మద్దతు యివ్వాలనే కార్యక్రమం వలన) వాళ్ళు తమ ఆహార సంపాదనను, తగిన విధంగా తమ పిల్లల సంరక్షణ అవసరాలతో మిళితం చేయగలుగుతారు. సంక్షేమ సంస్కరణలతో వున్న పెద్ద సమస్యల్లో ఇంటి వద్ద వుండే తల్లుల సమస్య ఒకటని వాదించాం. ఈ సంక్షేమ సంస్కరణ ఒంటరి తల్లులను పని చేయమని అడగకపోయినా, వేతనాన్ని చెల్లించే పని చేసే ఒంటరి తల్లులను వారికి పిల్లల సంరక్షణకు చాలినంతగా వేతనం చెల్లించకుండా, లేదా జీవన వేతనం చెల్లించకుండానే పని చేయమంటోందని మేము వాదించాం. చంటి పిల్లల తల్లులకు వేతనంతో వుండే సెలవులు ఇవ్వాలనే డిమాండుతోపాటు, ఒకవేళ పని చేయటం వలన సంరక్షణ నాణ్యతతో రాజీపడాల్సిన ప్రమాదం ఏర్పడిన పరిస్థితిలో, ఒంటరి తల్లులకు పనిని నిరాకరించి-ఆదాయపు మద్దతును పొందే హక్కు ఉండాలని మా గ్రూపు వాదించింది. చాలామంది పనిచేసే ఒంటరి తల్లులు, తమ పిల్లలకు నాణ్యమైన సంరక్షణ కల్పించలేని రకరకాల పరిస్థితుల్లో వున్నారు. అవి: తాము పనిచేసే ప్రాంతాలకు చాలా దూరం పాటు ప్రయాణం చేయాల్సి వుండటం, బడి అయిపోయిన తర్వాత పిల్లలకు సక్రమమైన సంరక్షణ దొరకని ప్రమాదకరమైన ప్రాంతాల్లో ఆ తల్లులు నివసించుతూ వుండాల్సిన స్థితి, పిల్లల సంరక్షణ కోసం యిచ్చే వోచర్లు (ప్రభుత్వం యిచ్చే కూపన్లు) నాణ్యమైన సంరక్షణ పొందటానికి చాలినంతగా వుండకపోవటం (సరిపోయినంతగా లేకపోవటం). మా గ్రూపు రూపొందించిన వ్యూహాన్ని వాస్తవంగా 1960 దశకం చివరలో 1970 దశక ప్రారంభ కాలంలో జాతీయ సంక్షేమ హక్కుల సంస్థ రూపొందించి అభివృద్ధిపరిచింది. ఆ కాలంలో ఈ సంస్థ నాయకత్వాన నల్లజాతికి చెందిన తల్లులతో, ఆదాయపు మద్దతు కోసంతోపాటు ఉద్యోగులకు జీవన వేతనం కోసం ఉద్యమం నిర్వహించటం జరిగింది.

తన పుస్తకంలో ముగింపుగా ఐసెన్‌స్టీన్ ఫెమినిస్టులకు ఒక హేతుబద్ధమైన, ఉద్రేకపూర్వకమైన పిలుపునిచ్చింది. ఫెమినిస్టులు వర్గ విశ్లేషణ చేయటం కోసం వెనకకు రావాలనీ, కార్మికవర్గ మహిళల యొక్క, శ్వేతవర్ణేతర మహిళల యొక్క, దక్షిణ ప్రపంచ మహిళల యొక్క అవసరాలనూ, ప్రయోజనాలనూ కేంద్ర లక్ష్యంగా పెట్టుకొని ఉద్యమాన్ని నిర్మించమనీ ఆమె పిలుపునిచ్చింది. ఇటీవలి కాలపు పోరాటాల నుండి-కాలిఫోర్నియా నర్సుల సంఘం యొక్క పోరాటం నుండి, క్యుబెక్‌లోని ఇన్యూట్ మహిళల పోరాటం వరకూ, ఆక్సాకా స్కూలు టీచర్ల పోరాటం వరకూ-గుణపాఠాలను తీసి ఆమె పెట్టుబడిదారీ వ్యతిరేక, ప్రజాతంత్ర ఫెమినిజం ఏ రకంగా వుండాలో అన్న విషయంపై తన యొక్క సంగ్రహావలోకనాన్ని ముందుంచింది. ముందున్న పోరాటంలో ఆమె చెప్పిన రకపు ఫెమినిజాన్ని రూపొందించేందుకు స్ఫూర్తిని, ఆమె యొక్క పాఠకులు పొందగలరని ఆశిస్తాను. ✡

# హక్కుల ఉద్యమంపై కొన్ని అభిప్రాయాలు

పాణి

**కున్నికలైట్** నాయుకుడు ఎ.వర్గీస్‌ను ఫిబ్రవరి 1970లో హత్యచేసినందుకుగాను పోలీసు అధికారి కె. లక్ష్మణన్‌కు కేరళలోని ఎర్నాకులం సి.బి.ఐ. కోర్టు ఇటీవల జీవిత ఖైదు విధించింది. వర్గీస్ పోలీసు కస్టడీలో మరణించాడు.

వర్గీస్ కేరళ గిరిజనులలో పనిచేశాడు. అతనిని 1970, ఫిబ్రవరి 18న అరెస్టు చేశారు. అతని చేతులు వెనక్కు కట్టి కొండలమీదుగా లాక్కువెళ్ళి అడవిలో పోలీసులు కాల్చివేశారు. కానీ అతను ఎన్‌కౌంటర్‌లో మరణించాడని పోలీసులు ప్రకటించారు. ప్రజలు దీనిపై ఉన్నత స్థాయి విచారణను కోరారు. అతను పనిచేసిన గిరిజనులలో ఉన్న అపోహలను, అనుమానాలను తొలగించడానికి బదులుగా, నాటి సి.పి.ఐ. ప్రభుత్వం పోలీసుల చర్యను సమర్ధించింది. ఈ సంఘటన అడవిలో జరిగింది. సాక్షులంతా పోలీసులే కనుక వారి వాదనను సవాలు చేసేవారేలేరు. ఆ హంతక దళానికి నాయకత్వం వహించిన డిప్యూటి సూపరింటెండెంట్ ఇన్‌స్పెక్టర్ జనరల్‌గా పదోన్నతి పొందాడు. ఇతడు 1976లో విద్యార్థి రాజన్ హత్యతో సహా పలు హత్యా నేరాలలో నిందితుడు. మూడు దశాబ్దాల తరువాత, సర్వీసు నుంచి రిటైర్ అయిన ఇద్దరు కానిస్టేబుళ్ళు, తాము చేసిన పనికి పశ్చాత్తాపం చెంది వర్గీస్ హత్యపై నేరాంగీకార ప్రకటన చేశారు. ఆనాటి డి.ఎస్.పి. లక్ష్మణన్ ఆదేశాల మేరకు తానే వర్గీస్‌ను కాల్చిచంపానని కానిస్టేబుల్ రామచంద్రనాయర్ అంగీకరించాడు. వర్ఘీస్‌ను కాల్చిన తరువాత ఆ రివాల్వర్‌ను వర్ఘీస్ మృతదేహం పక్కన ఉంచినట్లుగా కూడా అంగీకరించాడు. ఆరోజు హంతక దళంలో సభ్యుడుగా ఉన్న మరో కానిస్టేబుల్ ఎ.కె.ఎం. హనీఫర్ కూడా నాయర్ ప్రకటనను సమర్ధిస్తూ సాక్ష్యమిచ్చాడు. ఈ సాక్ష్యాలతో సి.బి.ఐ. కోర్టు వర్ఘీస్ హత్యకేసులో లక్ష్మణన్‌కు శిక్షవిధించింది.

ఎర్నాకులం సి.బి.ఐ. కోర్టు లక్ష్మణన్‌కు విధించిన శిక్ష ప్రజాస్వామిక మనస్తత్వంగల ప్రజలలో న్యాయ వ్యవస్థపైన ఆశలను కలిగించింది, విశ్వాసాన్ని పెంచింది. పోలీసు ఎన్‌కౌంటర్‌లు మన ప్రజాస్వామిక వ్యవస్థ పునాదులపై దాడి అని భావించిన ప్రజాస్వామిక వాదులు, సి.బి.ఐ. కోర్టు తీర్పు విన్న తరువాత 'సత్యమే జయిస్తుంది' 'సత్యమే నిలబడుతోంది' అనే వాటిపై విశ్వాసాన్ని తిరిగి పొందారు. పోలీసు అధికారి లక్ష్మణన్‌కు శిక్ష విధించినందుకు కొందరు సి.బి.ఐ. కోర్టును అభినందించారు. ఈ సంఘటన ద్వారా లక్ష్మణన్ వంటి పోలీసు అధికారులు చట్టం నుంచి పారిపోగలరేమో కాని, దాని పొడవాటి చేతులనుండి తప్పించుకోలేరని వారు భావిస్తున్నారు.

వర్ఘీస్ హత్యకేసులో లక్ష్మణన్ శిక్షించబడ్డాడనే ఉద్వేగంలో ఈ కేసు నాలుగు దశాబ్దాలు ఆలస్యమయిందనే విషయాన్ని వారు పట్టించుకోలేదు. ఈ ఆలస్యమయిన న్యాయంకూడా, పోలీసు కానిస్టేబుళ్ళు నేరాంగీకారాన్ని ప్రకటించటం వల్లనే, తప్పని పరిస్థితులలో సి.బి.ఐ. కోర్టు శిక్ష విధించడం ద్వారా మాత్రమే జరిగింది. వర్ఘీస్ హత్యకు కారకుడైన ఒక పోలీసు అధికారి శిక్షింపబడ్డాడు. కాని ఆ హత్యకు ఆమోదముద్రవేసిన ప్రభుత్వము లేదా రాజ్యం శిక్షింపబడలేదు.

రాజద్రోహ నేరం క్రింద వినాయక్‌సేన్‌కు రాయపూర్ సెషన్స్ కోర్టు శిక్ష విధించడంతో ప్రజాస్వామిక వాదుల ఈ ఆనందోద్వేగాలకు తెరపడింది.

చత్తీస్‌ఘడ్ గిరిజనులకు గత 3 దశాబ్దాల నుంచి వినాయక్‌సేన్ నిస్వార్ధంగా సేవలందిస్తున్నాడు. గిరిజనుల మధ్య హక్కుల కార్యకర్తగా కూడా పనిచేస్తున్నాడు. సాల్వాజుడుం చేస్తున్న హత్యలను, అత్యాచారాలను, మానభంగాలను వెలికితోడి ఎండగడుతున్నాడు. ఈ సాల్వాజుడుం ప్రభుత్వంచే ఏర్పాటు చేయబడిన సాయుధ దళం. మానవహక్కుల ఉల్లంఘనలకు పాల్పడింది. అతను ఈ హక్కుల ఉల్లంఘనలను ప్రశ్నించాడు. వాటికి వ్యతిరేకంగా పోరాడుతున్నాడు. అతని చర్యలు ప్రభుత్వానికి మింగుడుపడే విధంగా లేవు. దీనికి ప్రతిగా అతనిపై రాజద్రోహనేరాన్ని మోపడం జరిగింది. మావో రచనలు, కారల్‌మార్క్స్ రచించిన 'దాస్ కాపిటల్' ఇతర శాస్త్రీయ కమ్యూనిజానికి చెందిన పుస్తకాలను అతను చదువుతున్నాడని ఆరోపించారు. పసలేని, సమర్ధించు కోలేని, బలహీనమైన, హాస్యాస్పదమైన సాక్ష్యాలను కోర్టులో ప్రవేశ పెట్టారు. అన్ని సాక్ష్యాలనూ పరిశీలించకుండా, న్యాయం యొక్క అన్ని కోణాలనూ పరిగణించకుండా కోర్టు వినాయక్‌సేన్‌కు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. భారత రాజ్యానికి శత్రువులుగా ప్రకటించబడిన మావోయిస్టులతో సంబంధాలున్నాయన్న కారణంతోనే అతనిని శిక్షిస్తున్నట్లుగా న్యాయమూర్తి బలంగా చేసిన వ్యాఖ్యానాల ద్వారా స్పష్టమయింది.

వినాయక్ సేన్‌కు రాయపూర్ కోర్టు విధించిన శిక్ష ప్రజా వ్యతిరేకమయినది, అప్రజాస్వామికమైనది. తీవ్రంగా ఖండించదగింది. ఏ పరిస్థితులలోనూ అంగీకరించవీలులేనిది. ఇటువంటి హాస్యాస్పదమైన తీర్పు ఇవ్వటానికి న్యాయవాది అనేక అహేతుక వాదనలు చేశారు.

ఈ పక్షపాతంతో కూడిన తీర్పు వెలువడిన తరువాత హక్కులపైన వినాయక్‌సేన్‌కు మద్దతుగా ఎటువంటి నిరసనలూ చేపట్టరాదంటూ హక్కుల సంఘాలపై ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఆంక్షలు విధించింది. కొన్ని స్వచ్ఛంద సంస్థలపై నిఘా ఉంచమంటూ చత్తీస్‌గఢ్ ఇంటిలిజెన్స్ఐ.జి. చేసిన ప్రకటన చూస్తే వినాయక్‌సేన్‌కు ప్రజల నుంచి వస్తున్న మద్దతు గురించి రాష్ట్ర ప్రభుత్వం ఎంత ఆందోళన చెందుతున్నదీ తెలుస్తుంది. రాయపూర్ ప్రెస్ క్లబ్‌లో మావోయిస్టులకు సానుభూతిపరులైన వారెవ్వరూ పత్రికా విలేకరుల సమావేశం పెట్టుకోవటానికి అనుమతినివ్వరాదని క్లబ్ తీర్మానించడం చూస్తే, అసమ్మతి గొంతును నొక్కి వేయడానికి, ప్రజా భద్రతా చట్టం 2005ను ప్రభుత్వం ఏ విధంగా వినియోగించు కుంటున్నదో అర్ధమవుతుంది.

వినాయక్‌సేన్‌ను వెంటనే విడుదల చేయాలని, రాయపూర్ కోర్టు తీర్పును రద్దుచేయాలని కోరుతూ శక్తివంతమైన ఉద్యమాన్ని నిర్మించటమే దీనికి జవాబు. వివిధ రాజకీయ భావాలు కలిగిన వారందరూ రాయపూర్ తీర్పును ప్రజాస్వామ్య, న్యాయవ్యవస్థ స్వతంత్రత, రాజ్యాంగాన్ని రక్షించటం పేరుతో ప్రజాస్వామిక, పౌర, మానవీయ హక్కులపై జరుగుతున్న దాడిగా ఖండించడం, ఆహ్వానించదగినది.

ఈ తీర్పుతో ప్రజాస్వామిక వాదులు షాక్‌కు గురికాగా, న్యాయకోవిదులు, న్యాయపండితులు గందరగోళపడ్డారు.

విచారణలో నిజాయితీ లేకపోవటం, ప్రభుత్వం ప్రవేశపెట్టిన సాక్ష్యాలపై అనుమానాలు, రాజద్రోహనేరాన్ని మోపుటకు సుప్రీంకోర్టు రూపొందించిన నియమాలను పరిగణించక పోవటం, డిఫెన్స్ న్యాయవాది వ్యక్తం చేసిన అనుమానాలను, సందేహాలను తీర్చుటకు న్యాయమూర్తి ప్రయత్నించకపోవటం, తీర్పును ప్రకటించిన తీరు మొదలైన అంశాలు న్యాయకోవిదులను గందరగోళానికి గురిచేస్తున్నాయి.

అహింసద్వారా మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని, మనది ప్రజాస్వామిక దేశమని, ప్రపంచంలో పెద్ద ప్రజాస్వామ్యమని చాలామంది ప్రజాస్వామిక వాదులు విశ్వసిస్తున్నారు. మన "స్వతంత్ర" న్యాయవ్యవస్థ అందరికీ నిష్పక్షపాతంగా, నిజాయితీగా, సమానంగా న్యాయాన్ని అందిస్తుందని వారు విశ్వసిస్తున్నారు. నేరస్థుడా కాదా అని నిర్ణయించేది న్యాయవ్యవస్థ మాత్రమేనని, పోలీసులతో సహా ఇతర సంస్థలేవీ ఆ నిర్ణయాధికారాన్ని కలిగి ఉండవనీ వారు విశ్వసిస్తున్నారు. రూపంలోనే కాక సారంలో కూడా న్యాయాన్ని అందించే బాధ్యత న్యాయస్థానాలపైన, ప్రభుత్వం పైనా ఉందని వారు విశ్వసిస్తున్నారు. అందువలన, రాజ్యాంగం, చట్టంయొక్క పవిత్రతను, ప్రజాస్వామిక సంస్థల ఆధిక్యతను, బూర్జువా సమాజాన్ని కాపాడటానికి, కొనసాగించటానికి రూపొందించిన ఈ రాజ్యాంగము, చట్టముపై ఎటువంటి అనుమానాలూ వ్యక్తం చేయకుండా ఆమోదించుటను వారు నిష్క్రియపరంగా స్వీకరిస్తున్నారు, అంగీకరిస్తున్నారు. భారత స్వాతంత్ర్య స్వభావాన్ని గూర్చిన అవగాహనలో వారు ఎన్ని కొరతలను కలిగి ఉన్నప్పటికీ, వారు నిజమైన ప్రజాస్వామికవాదులు, ప్రజాస్వామిక, పౌర, మానవ హక్కులను ప్రజలందరూ అనుభవించాలని వారు ఆకాంక్షిస్తున్నారు. వారి ఆకాంక్షలను నిరసన ప్రదర్శనలు ఇంకా ఇతర రూపాల ద్వారా వ్యక్తం చేస్తుంటారు.

వారి విశ్వాసాలకు అనుగుణంగా లేని రాయపూర్ కోర్టు తీర్పుతో వారు దిగ్భ్రమకు గురయ్యారు. న్యాయ వ్యవస్థ యొక్క డొల్లతనాన్ని వారు నమ్మలేకపోతున్నారు. తనజీవితమంతా గిరిజనుల సంక్షేమానికి, అందరికీ సమాన అవకాశలు కల్పించటానికి, నిస్వార్ధంగా పోరాడిన వినాయక్‌సేన్ జీవితాన్ని పరిగణలోనికి తీసుకోకుండా, కోర్టు తీర్పు ఇవ్వడంతో వారు దిగ్భ్రమకు గురయ్యారు. వినాయక్‌సేన్ ఏనాడూ హింసను సమర్ధించలేదు, ప్రోత్సహించలేదు. ఏనాడూ ఎటువంటి హింసాయుత చర్యకూ పాల్పడలేదు. అయినా రాయపూర్ కోర్టు అతనిని రాజద్రోహిగా పరిగణించడంతో వారు దిగ్భ్రమ చెందారు. రాజద్రోహానికి సంబంధించిన చట్టాలను నియమాలను వక్రీకరించడంతో వారు దిగ్భ్రమ చెందారు. వినాయక్‌సేన్‌ను శిక్షించడానికి ఉదహరించిన చట్ట నియమాలు ఎంత బలహీనంగా ఉన్నాయో అంతర్జాతీయ న్యాయ ప్రమాణాలకు ఎంత దూరంగా ఉన్నాయో చూసి వారు దిగ్భ్రమ చెందారు. ఈ తీర్పు భారత ప్రజాస్వామ్యానికే కళంకం తెస్తుందని వారు భావిస్తున్నారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 63 సంవత్సరాల తరువాత కూడా–బ్రిటిష్ వలసదారులు, భారతదేశంలో అసమ్మతిని అణచివేసేందుకు తమ పాలనను వలస దేశాలలో సాగించేందుకు రూపొందించిన 1838 నాటి చట్టాన్ని వినాయక్‌సేన్‌ను శిక్షించడానికి వినియోగించటంపై ప్రజాస్వామిక వాదులు దిగ్భ్రమ చెందారు. మొత్తం మీద సారాంశంలో "భారత న్యాయ ప్రక్రియ నిజాయితీగా ఉంటుందని విశ్వసించడంలోవున్న తమ మూర్ఖత్వం"పైన భారత స్వతంత్ర ప్రజాస్వామ్యదేశం అని తమకున్న విశ్వాసంగా వారు దిగ్భ్రమ చెందారు.

ఈ తీర్పుయొక్క సారాంశాన్ని సమీక్షిస్తే, ఇప్పటికే పార్లమెంటు, కార్యనిర్వాహక వ్యవస్థపైన నమ్మకం కోల్పోయిన ప్రజలు, న్యాయవ్యవస్థపైన ఉన్న నమ్మకాన్ని కూడా కోల్పోతారని ప్రజాస్వామిక వాదులు ఆందోళన చెందుతున్నారు. 'హక్కుల కార్యకర్తలను' మావోయిస్టులుగా, టెర్రరిస్టులుగా ముద్రవేసి బెదిరించటం జరుగుతుందని వారు ఆందోళన చెందుతున్నారు. ప్రజలను రక్షణ కవచాలుగా ఉపయోగించుకొని మానవహక్కుల అతిక్రమణకు పాల్పడుతున్న వారి పట్ల ప్రజాస్వామిక వాదులు భయాలను వ్యక్తం చేస్తున్నారు. దేశ ప్రజలకు న్యాయాన్ని అందించవలసిన న్యాయవ్యవస్థ ఇంకా వలస పాలకుల చట్టాలతోనే కొనసాగటం పట్ల వారు సిగ్గుపడుతున్నారు. స్వతంత్ర భారతదేశంలో బ్రిటిష్ వలస పాలకుల నియమ నిబంధనలు ఇంకా ఎలా అమలు అవుతున్నాయని ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. కాలంచెల్లిన వలస పాలకులు 1894లో చేసిన భూ సేకరణ చట్టానికు అనుగుణంగానే నేటికి ప్రజల భూములను ప్రభుత్వం సేకరిస్తున్న కారణంగా భూసంబంధిత తిరుగుబాట్లు, ఆందోళనలు జరుగుతున్నాయని వారు భావిస్తున్నారు. మానవ హక్కులతో సహా ప్రజల జీవనరంగాలన్నింటిలోనూ కొనసాగుతున్న నిరాశాపూరిత చర్యలను చూసివారు దిగ్భ్రాంతి చెందుతున్నారు. భారతదేశంలో 'నాణ్యమైన ప్రజాస్వామ్యం' రోజురోజుకూ తగ్గిపోతూండటం పట్ల బాధను వ్యక్తం చేస్తూ, ఈ కొరతలను, లోపాలను అధిగమించి ప్రజాస్వామ్యం, ప్రజాస్వామిక వ్యవస్థల పట్ల ప్రజలలో విశ్వాసం పాదుకొల్పటానికి పార్లమెంటులో అర్ధవంతమైన చర్చ జరగాలనివారు కోరుతున్నారు. నిజమైన ప్రజాస్వామ్యం కొరకు వారు పడుతున్న తపనను అర్ధంచేసుకొని వారి ని అభినందించాలి. అయితే భారతదేశంలోని పార్లమెంటరీ విధానంపైన వారికున్న విశ్వాసాన్ని, ఈ వ్యవస్థలో కొరతలను, లోపాలను అధిగమించవచ్చునని వారికున్న విశ్వాసాన్ని చూసి మనం జాలిపడటం తప్ప ఏమీ చేయలేము.

వినాయక్‌సేన్ శిక్షకు సంబంధించి విశ్లేషణాత్మక చర్చ చేసేటప్పుడు రాజద్రోహ నేరానికి సంబంధించిన పూర్వచరిత్రను జ్ఞాపకం చేసుకోవలసిన అవసరం వుంది.

బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకతను వ్యక్తం చేసిన వారిపై రాజద్రోహనేరం మోపేవారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా అసమ్మతిని వ్యక్తం చేస్తూ రచనలు చేసిన రచయితలపై రాజద్రోహం మోపేవారు. ఆనందమఠ్ నవలలో పొందుపరచబడిన బకించంద్ర 'వందేమాతర' గీతం విప్లవకారులకు స్ఫూర్తి నిచ్చింది. దానిని రాజద్రోహంగా పరిగణించారు, నిషేధించారు. బ్రిటిష్ వారిపట్ల వ్యతిరేకతను పెంచుతుందనే నెపంతో శరత్‌చంద్ర నవల 'పథర్‌పాబీ'ని నిషేధించారు. భారత జాతీయోద్యమానికి స్ఫూర్తిదాయకమైన రచనలు చేసిన వివిధ భాషలకు చెందిన ప్రముఖ రచయితల రచనలను బ్రిటిష్ పాలకులు రాజద్రోహంగా పరిగణించి నిషేధించారు.

బ్రిటిష్ ప్రభుత్వం ఎం.కె. గాంధీపై సెక్షన్ 124–ఎ (రాజద్రోహం) క్రింద నేరారోపణచేసింది. పౌరుల స్వేచ్ఛను అణచివేయడానికి భారత శిక్షాస్మృతిలో ఉన్న సెక్షన్లన్నిటినిలోను ఈ సెక్షన్ రాజువంటిదని ఆయన విమర్శించారు. ప్రభుత్వంపైన అసమ్మతిని ప్రోదిచేయడం నేరంగా పరిగణింపబడుతోందని ఆయన అన్నారు.

మీరట్ కుట్రకేసు స్పష్టమైన ఉదాహరణ. రాజద్రోహం నేరం పేరుతో పీడిత ప్రజలను అణచి వేయటానికి ఈ కుట్రకేసును బ్రిటీష్ వలస ప్రభుత్వం ఉపయోగించుకొన్నది. కమ్యూనిస్టు అభిప్రాయాలతో కార్మిక సంఘాలను స్థాపించటాన్ని కూడా రాజద్రోహ నేరంగా పరిగణించి శిక్షించారు. ఈ చర్యలు అంతర్జాతీయంగా తీవ్ర విమర్శలనెదుర్కొన్నాయి.

బాలగంగాధర తిలక్, అరవిందఘోష్‌లను కుట్ర, రాజద్రోహం నేరాలపై విచారించారు.

బ్రిటిష్ పాలకులు భారతదేశం నుంచి వెళ్ళిపోయిన తరువాత, అధికార మార్పిడి తర్వాత అనేక స్వేచ్ఛలు దేశంలో ఉన్నాయని చెప్పిన తరువాత కూడా అదే రాజద్రోహం చట్టాన్ని రాజ్యానికి వ్యతిరేకంగా అసమ్మతి వ్యక్తంచేసిన వారి మీద ప్రయోగించటం ఈ 63 సంవత్సరాలుగా కొనసాగుతూనేవున్నది.

ఇటీవల కాలంలో ప్రభుత్వ విధానాలను విమర్శించిన వారిపై రాజద్రోహం నేరం మోపి శిక్షించారు. కర్నాటక పి.యు.సి.ఎల్. ఉపాధ్యక్షులు ఇ. రతిరావుకు 2010లో రాజద్రోహం నేరంపై నోటీసు ఇచ్చారు. రతీరావు ఒక ప్రైవేటు బులిటెన్ 2007 సెప్టెంబరు వరకు ప్రచురించారు. ఆ కారణంతో రాజద్రోహ నేరం మోపారు.

కాశ్మీర్ లోయలో చెలరేగిన అశాంతికి సంబంధిచిన ప్రశ్నలతో పరీక్షాపత్రాన్ని నింపాడని శ్రీనగర్‌లోని ఒక కళాశాల అధ్యాపకునిపై రాజద్రేహనేరం మోపి అరెస్టు చేశారు.

ప్రముఖ రచయిత్రి అరుంధతీరాయ్ హరియత్ నాయకుడు ఎస్.ఎ.పి. జిలానీలపై రాజద్రోహం నేరం మోపాలని ఢిల్లీసిటీ కోర్టు ఆదేశించింది. కాశ్మీర్‌లో ఒక సెమినార్‌లో వారు చేసిన ప్రసంగాల ఆధారంగా, అది దేశ ద్రోహంగా పరిగణించాలని కోరుతూ కాశ్మీరీ పండిట్లు కోర్టులో కేసు దాఖలు చేశారు. తరువాత ఒక ప్రజాప్రయోజన వ్యాజ్యంపై ఢిల్లీ హైకోర్టు కూడా అదే విధమైన నోటీసులు జారీ చేసింది.

2011 జనవరి 4న మహారాష్ట్ర, వార్ధాలోని గోండా పోలీసులు, దళిత కార్యకర్త, విరోధి పత్రిక సంపాదకుడు అయిన సుధీర్ ధావలేను అరెస్టు చేసి రాజద్రోహం నేరం మోపారు. గత 25 సంవత్సరాలుగా ప్రాథమిక స్థాయిలో పనిచేస్తున్న మానవ హక్కుల కార్యకర్త జాతి అంతాచి చార్వాల్ (కుల నిర్మూలనా సంఘం) వర్గానికి చెందిన రిపబ్లికన్ పాంథర్స్ కన్వీనర్లలో అతను ఒకడు. పోలీసులు అతని ఇంటిపై దాడిచేసి, మార్క్స్, ఏంగెల్స్, లెనిన్, మావోల గ్రంథాలతోపాటు సుధీర్ రాసిన గ్రంథాలను కొన్ని పత్రాలను తీసుకువెళ్ళారు. ఈ అరెస్టుకు వ్యతిరేకంగా 150 మంది మానవ హక్కుల కార్యకర్తలు, రచయితలు, జర్నలిస్టులు ముంబాయిలో ఒక నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఖైర్లాంజీ హంతకులనుకూడా ఇదేవిధంగా చేయగలరా? అని వారు పోలీసులను ప్రశ్నిస్తున్నారు.

వినాయక్‌సేన్‌కు శిక్షపడిన రోజునే రాయపూర్‌లోని మరో న్యాయస్థానంలో 'ఎ వరల్డ్ టు విన్' అను పత్రికా సంపాదకుడు, ప్రచురణకర్త, మేధావి అయిన అసిత్‌సేన్ గుప్తాకు రాజద్రోహం నేరంపై 8 సంవత్సరాల జైలుశిక్ష విధించారు.

గత 63 సంవత్సరాలలో రాజద్రోహనేరం ఆరోపించబడిన మేధావులు, హక్కుల కార్యకర్తలు, రాజకీయ నాయకుల పొడవైన జాబితాను మనం తయారు చేయవచ్చు. జాతీయోద్యమ నాయకులపైన , దేశభక్తులైన, స్వేచ్ఛా ప్రియులపైన బ్రిటిష్ వలస పాలకులు ఏ చట్టాన్నైతే ఉపయోగించారో మన 'స్వతంత్ర' భారతదేశంలో కూడా అదే చట్టాన్ని ఉపయోగించడం జరిగింది.

'పవిత్ర భారత రాజ్యాంగం' ప్రసాదించిన వాక్, సభా స్వాతంత్ర్యాలను ఉపయోగించుకొని రాజ్య విధానాలను విమర్శిస్తే వలస చట్టాలను అధారంగా చేసుకొని రాజద్రోహం ఎలా మోపుతున్నారనేది మన ప్రజాస్వామిక వాదులను గందరగోళంలోనికి నెడుతున్నది.

ఈ సందర్భంలో దేశంలోని రెండు ప్రధాన పాలక రాజకీయ పార్టీ వైఖరిని తెలుసుకోవటం అవసరం. విచారణ కోర్టు తీర్పు అసంతృప్తిని కలిగించేదైనప్పటికీ దీనిని సరిచేసుకోవటానికి న్యాయప్రక్రియను గౌరవించి హైకోర్టుకు వెళ్ళటమే మార్గమని న్యాయవాది, మంత్రి అయిన చిదంబరం చెబుతున్నారు. అంటే చట్టం అతి పవిత్రమైనదని, చట్టబద్ధ క్రియ ద్వారా మాత్రమే న్యాయం చేకూరుతుందని ఆయన అభిప్రాయం. కాని చట్టప్రక్రియ అనేదే ఒక శిక్ష అనే విషయంలో ఆయన పెదవి విప్పటంలేదు. వినాయక్‌సేన్‌కు బెయిల్ తీసుకోవటానికి 2 సంవత్సరాల కాలం పట్టింది. భారత న్యాయ సూత్రాలను, భారత్ ఈ 63 సంవత్సరాలుగా అనుసరిస్తున్న బ్రిటిష్ చట్టాలను గౌరవించనివారు ఆయన దృష్టిలో ద్రోహులు.

మరో ప్రధాన పాలక పక్షం భారతీయ జనతాపార్టీ అనేక రాష్ట్రాలలో అధికారంలో వుంది. మనది మౌలికంగా ప్రజాస్వామ్యదేశం కావున కేంద్రంలోను రాష్ట్రాలలోను అధికారంలో ఉన్నవారు నిర్ణీత కాలపరిమితి

మాత్రమే పాలించాలనే అభిప్రాయాన్ని ప్రజలలో వ్యాపింపచేస్తున్నది. న్యాయ ప్రక్రియ అమలులో అమాయికులు బలయ్యే అవకాశం కూడా ఉన్నదని అంగీకరిస్తూనే, సేన్‌ను బలహీనమైన సాక్ష్యంతో శిక్షించారనే దానిపైన న్యాయస్థానాలదే తుది తీర్పు అంటున్నది. వినాయక్‌సేన్‌కు రాయపూర్ హైకోర్టు బెయిల్ ఇచ్చింది కనుక భారతదేశంలోని న్యాయవ్యవస్థలో తప్పులేదనీ, దానిని విమర్శించరాదనీ బి.జె.పి. అంటున్నది. అమానవీయంగా ప్రవర్తించి నందుకు తప్పుడు నడవడిక కలిగియున్నందుకు అనేక మంది పోలీసులు శిక్షంపబడుతుండటమే, మన వ్యవస్థలో మానవ హక్కులు రక్షింపబడుతున్నా యనేందుకు ఋజువు అనీ కావున మానవ హక్కుల కార్యకర్తల, సంస్థల అవసరం లేదంటున్నది.

ఈ రెండు పార్టీలు కూడా భారతదేశం ప్రజాస్వామ్య దేశమని ప్రకటిస్తున్నాయి. భారత రాజ్యాంగాన్ని, భారత న్యాయవ్యవస్థను అతిపవిత్రమైనదిగా భావిస్తూ ప్రజలలో ప్రజాస్వామిక చైతన్యం పెంపొందించుటకు ప్రజాస్వామిక హక్కుల సంఘాల, కార్యకర్తల, మేధావుల అవసరం లేదనీ, మానవ హక్కుల కోసం పోరాడవలసిన అవసరం ఈ దేశంలో లేదనీ ఈ రెండు పార్టీలూ చెబుతుంటాయి. ప్రభుత్వ, పోలీసు యంత్రాంగంపట్ల రాజకీయ విమర్శను, అసమ్మతిని, ప్రజాస్వామిక వాదుల వాణిని అణచి వేసేందుకు; మావోయిస్టు భూతాన్ని ఓడించటం పేరుతో ఈ రెండు పార్టీలూ ఎత్తుగడలననుసరిస్తాయి. గతంలో నక్సలైట్ల పేరుతో ఆ అణచివేతకొసాగింది.

మరోవైపు మావోయిస్టులకు అధికార ప్రతినిధులుగా వ్యవహరిస్తున్న మేధావులు–హత్యలకు, అపహరణలకు, హింసకు, పేలుళ్ళకు పాల్పడుతూ, తాము ఎవరికోసమైతే పోరాడుతున్నామని చెబుతున్నారో ఆ గిరిజనులను, పేదలను తమను వ్యతిరేకిస్తున్నారని అంటే విప్లవాన్ని వ్యతిరేకిస్తున్నారనే పేరుతో, న్యాయం చేస్తున్నామంటూ అణచివేసే చర్యలను నిర్ద్వంద్వంగా సమర్థిస్తున్న మేధావులు – రాయపూర్ న్యాయస్థానం ఇచ్చిన తీర్పును 'గ్రీన్‌హంట్ ఆపరేషన్ తీర్పు'గా పేర్కొంటున్నారు. ఈ తీర్పును ఆపరేషన్ గ్రీన్‌హంట్‌లో భాగంగా పేర్కొనడం ద్వారా వారు మావోయిస్టులు మాత్రమే ఆపరేషన్ గ్రీన్‌హంట్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్నారనీ, ఆదివాసీలకు అడవిపైన, భూమిపైన, వాటి వనరులపైన గల సహజ హక్కును కాపాడటానికి మావోయిస్టులు మాత్రమే పోరాడుతున్నారనే అభిప్రాయాన్ని కలుగ చేస్తున్నారు. మావోయిస్టుల ప్రతిఘటన, పోరాటాలను అణచివేయటానికే భారత ప్రభుత్వం తన ప్రజలపైనే యుద్ధం ప్రకటించిందని ఈ మేధావులు చెబుతున్నారు. భారత ప్రభుత్వం ప్రకటించిన యుద్ధాన్ని మావోయిస్టులు ప్రజాయుద్ధ పంథాలో ఎదుర్కొంటున్నారని వారు చెప్పదలుచుకున్నారు. నక్సల్బరీ పోరాటపంథాని మావోయిస్టులు ముందుకు తీసుకు వెళ్తున్నారనీ, గ్రీన్‌హంట్‌ను వ్యతిరేకించడమంటే నక్సల్బరీ పంథాను అమలు చేస్తున్నారనీ, ప్రజల ప్రాథమిక చైతన్యం ఈ పంథా అమలు ద్వారా ఆచరణ రూపం దాల్చిందనీ వారు చెప్పాలనుకుంటున్నారు. ప్రభుత్వం అవలంబిస్తున్న సామ్రాజ్యవాద ప్రపంచీకరణ వ్యతిరేక ప్రతిఘటనా పోరాటాలను, ప్రజా విప్లవపంథాని ప్రారంభించి కొనసాగిస్తున్న పార్టీ మావోయిస్టు పార్టీయేనని, ప్రజలలో మౌలిక పోరాట చైతన్యాన్ని అభివృద్ధి చేసి, ప్రజలను ప్రగతిశీల ఆచరణవైపు నడిపించేది మావోయిస్టు పార్టీనేనని వారు అభిప్రాయపడుతున్నారు. ఈ దేశంలో నిజమైన విప్లవపోరాటం, అన్ని రంగాలలో విప్లవ చైతన్యం, ప్రజాస్వామిక చైతన్యం, ప్రతిఘటనా చైతన్యం, ప్రజాస్వామ్య హక్కుల ఉద్యమ చరిత్ర, విప్లవ రచయితల చైతన్యం, ఉద్యమం, కార్మికవర్గ ఉద్యమం అన్నీ మావోయిస్టులతోనే ప్రారంభమైనాయనేది ఈ మేధావుల సిద్ధాంతం. భారతదేశంలో ప్రగతిశీల ఉద్యమాల చరిత్ర వారితోనే ప్రారంభమైంది కాబట్టి, హక్కుల ఉద్యమ కార్యకర్తలను, మేధావులను, నాయకులను, మావోయిస్టు అనుకూలురుగా ముద్ర వేసి చంపుతున్నారు కనుక వినాయకసేన్‌తో సహా ఇతర ప్రజాస్వామిక వాదుల, హక్కుల కార్యకర్తల కృషి ఫలితాన్నంతా మావోయిస్టుల ఖాతాలో జమచేయటానికి వారు ప్రయత్నిస్తున్నారు.

భారతదేశ వ్యవస్థ యొక్క మౌలిక తత్వంతో విభేదించుటకు ఇష్టపడని పాలకవర్గాలు, పాలక పార్టీలు, భారతదేశ పాలనావ్యవస్థ స్వతంత్ర, ప్రజాస్వామిక స్వభావం కలిగియున్నదని ప్రజలను నమ్మిస్తూనే ఉన్నారు. అదేవిధంగా భారత రాజ్యాంగము, న్యాయవ్యవస్థ, చట్టము పవిత్రమైనవనే అభిప్రాయాన్ని కలుగజేస్తూ, వాటి సాయంతో రాజ్యంయొక్క విధానాలను ప్రశ్నిస్తూన్న, విమర్శిస్తున్న రాజకీయ అసమ్మతిని వ్యక్తంచేస్తున్న వారందరిపైనా మావోయిస్టులు, టెర్రరిస్టులు అని ముద్రవేస్తూ, ప్రజాస్వామిక హక్కుల ఉద్యమ కార్యకర్తలను అణచివేస్తున్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ ఎత్తుగడలే మావోయిస్టులు తమను తాము ఆదివాసీల కోసం, విస్తాపన చెందిన వారికోసం పోరాడే వారిగా చెప్పుకోవటానికి అవకాశమిస్తున్నాయి.

మావోయిస్టుల ప్రకటనలతోను, కాంగ్రెస్, బి.జె.పి.ల ఖండనలతోనూ ఎవరూ గందరగోళ పడనవసరం లేదు. అంతేకాదు ఒక స్వతంత్ర ప్రజాస్వామ్యదేశంలో 1860 నాటి బ్రిటిష్ వలస చట్టాల ఆధారంగా ప్రజాస్వామికవాదులను ఏ విధంగా శిక్షిస్తారనే విషయంపై ఆ రెండు పార్టీలూ ప్రశ్నించటం లేదు.

ఈ ప్రశ్నకు కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి నాలుగు దశాబ్దాల క్రితమే తన ప్రసిద్ధ కోర్టు ప్రకటన–**'తాకట్టులో భారతదేశం'** గ్రంథంలో జవాబిచ్చారు. భారతదేశంలో ప్రజల ప్రజాస్వామిక హక్కులను రక్షించాలనుకునే వారందరికీ, హక్కుల ఉద్యమ కార్యకర్తలకూ మార్గాన్ని చూపారు. తమ మెదళ్ళను తొలుస్తున్న ప్రశ్నలకు శాస్త్రీయ వివరాలు కోరుకునేవారికి, ఈ వివరణలు మానవ, పౌర, ప్రజాస్వామిక హక్కులను కాపాడాలనే ప్రయత్నంలో ఏంచేయాలో సరియైన మార్గాన్ని చూపుతాయి.

కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డిని 1969 డిసెంబరు 19న మద్రాసులో అరెస్టుచేశారు. ఆయనపై భారత శిక్షాస్మృతి 121–ఎ విభాగం క్రింద రాజద్రోహం, కుట్ర నేరాలు మోపారు. బ్రిటిష్ పాలనా కాలంలో ఆయన 3 సార్లు అరెస్టయ్యారు. అధికార మార్పిడి తర్వాత 6 సార్లు అరెస్టయ్యారు. అధికార మార్పిడి జరగటానికి ముందూ, ఆ తర్వాత అరెస్టు చేసిన అన్ని సందర్భాలలోను, అదే బ్రిటిష్ వలస వాదుల చట్టాల క్రింద నేరం మోపారు. అదే రాజద్రోహ నేరం. అదే పి.డి.చట్టం, భారత రక్షణ చట్టాలు, ప్రకాశం ఆర్డినెన్స్, మొదలైనవి. ప్రస్తుతం వినాయక్‌సేన్‌ను అరెస్టు చేసింది కూడా అదే చట్టాల ఆధారంగా.

హైదరాబాదు అడిషనల్ సెషన్స్ జడ్జి ముందు తరిమెల నాగిరెడ్డి తనవాదనలు ప్రారంభిస్తూ 1940లో తనను మొట్టమొదట అరెస్టుచేశారని, ప్రస్తుతం 1969లో ఈ కేసులో అరెస్టుచేశారని, రెండు సందర్భాలలోనూ 1860లో చేసిన ఒకే చట్టం క్రింద అరెస్టుచేశారని, అన్నారు.

**ఈ విషయంపై నాగిరెడ్డి ఇలా వ్యాఖ్యానించారు :**

"భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 25 సంవత్సరాల తరువాత కూడా 100 సంవత్సరాల క్రితం 1860లో చేసిన ఒక చట్టం ద్వారా నన్ను అరెస్టు చేయడంలో ఆశ్చర్యమేమీ లేదు" "మహాత్ముని" పర్యవేక్షణలో, భారతజాతీయ కాంగ్రెస్ నాయకత్వాన అహింసాయుతంగా నడిచిన విప్లవం ద్వారా సిద్ధించిన, ఆ మహాత్ముని అనుచరుడు జవహర్‌లాల్ నెహ్రూ 15 సంవత్సరాలు పరిపాలించిన ఈ భారతదేశంలో ఇంకా చట్టాలు పాతపేర్లతో ఎలా కొనసాగుతున్నాయి" అని ఆయన ప్రశ్నించారు.

ఈ క్రింది ప్రశ్నలు మనం వేసుకోలేకపోతే స్వతంత్ర ప్రజాస్వామ్య భారతదేశం 1860 నాటి బ్రిటీష్ వలస వాదుల రాజద్రోహ చట్టాన్ని ఎలా ఉపయోగించ గలుగుతుందనే విషయం మనకు అర్థం కాదు. ఆ ప్రశ్నలేమిటంటే ఎ) వలస పాలకులకు, భారత బూర్జువా వర్గానికీ మధ్య అధికార మార్పిడి ఎలా జరిగింది? బి) ఈ'శాంతియుత పరివర్తన'కు దారితీసిన అంశాలేమిటి? సి) బ్రిటిష్ వలస వాదులు, గాంధీ అతని సహచరుల పట్ల కృతజ్ఞతాభావం కలిగియుండటానికి దారితీసిన పరిస్థితులేమిటి? డి) భారత ప్రజల దృష్ట్యా అధికారమార్పిడి ప్రాధాన్యత ఏమిటి?

**ఆయన (టి.ఎన్.) ఇలా వివరించారు :**

"రెండవ ప్రపంచ యుద్ధానంతరం భారతదేశం ప్రజాందోళనలతో అట్టుడికిపోయింది. భారత నావికా దళంలో తిరుగుబాట్లు జరిగాయి. ఇది అన్ని వర్గాల, కులాల, సమూహాల ప్రజలు సంఘటితమై, భారతదేశంలో విముక్తి ఉద్యమం వేగంగా అభివృద్ధి చెందటానికి దారి తీసింది. ప్రజాఉద్యమం సాధారణ పౌరులలోనే కాక సాయుధ దళాలలోనికి కూడా విస్తరించింది. బ్రిటిష్ పాలకులు, భారత బూర్జువా వర్గమూ ఆందోళన చెందాయి. ఈ కవలలు రెండూ ఏకమై, వందేళ్ళ బానిసత్వాన్ని, సామ్రాజ్యవాదాన్ని తుదముట్టించడానికి సిద్ధమైన భారత ప్రజల, సాయుధ దళాల ఉద్యమాన్ని అణచి వేయడానికి, ధ్వంసం చేయడానికి పూను కొన్నాయి. ఆ అనూహ్య పరిణామాలకు భయపడిన భారత బూర్జువావర్గం విద్రోహానికి పాల్పడింది. సామ్రాజ్యవాదంపై బూర్జువావర్గం నిర్ణయాత్మక విజయాన్ని సాధించాలని కోరుకోలేదు. బ్రిటిష్ వలసవాదులు తమ వందేళ్ళ పాలనలో భారత కార్మిక వర్గాన్ని, రైతాంగాన్ని, అణచివేయడానికి ఉపయోగించిన పాలనా యంత్రాంగాన్ని, పోలీసు, సైనిక వ్యవస్థలను ధ్వంసం చేయడానికి భారత బూర్జువావర్గం ఇష్టపడక, సామ్రాజ్యవాదంతో రాజీకి సిద్ధమయింది. మరోవైపున, రెండవ ప్రపంచయుద్ధం తర్వాత అంతర్జాతీయ పరిణామాలతో బలహీనపడిన బ్రిటీష్ సామ్రాజ్యవాదులు, భారత దేశ ప్రజల తిరుగుబాట్లను చూసిన తర్వాత భారత బూర్జువా వర్గంతో రాజీకి ఉత్సాహం చూపింది. ఈ రాజీ, అధికార మార్పిడి ప్రక్రియను వేగవంతం చేసి 1935 భారత ప్రభుత్వ చట్టంద్వారా 1947 ఆగస్టు15న స్వాతంత్ర్యం ప్రకటించడానికి దారితీసింది. బ్రిటిష్ ప్రభుత్వం చాలా సుహృద్భావ వాతావరణంలో తన ప్రభుత్వ సంస్థల సేవలను భారత ప్రభుత్వానికి అందిస్తూ అధికార మార్పిడి ప్రక్రియను సాగించింది. సామ్రాజ్యవాదుల ప్రయోజనాల కోసం నిర్మించబడిన సైనిక వ్యవస్థ, భారత ప్రభుత్వానికి వారసత్వంగా సంక్రమించింది. ఈ సైన్యానికి భారత ప్రజలతో ఎటువంటి సంబంధాలూ లేవు. జాతీయ ఆశయాలు, రాజకీయ వాతావరణంతో సంబధం లేకుండా సైన్యం దూరంగా ఉంచబడింది. జాతి వ్యతిరేక స్వభావం కలిగిన ఈ సైన్య వ్యవస్థ భారత ప్రభుత్వానికి వారసత్వంగా సంక్రమించింది. బ్రిటిష్ సామ్రాజ్యవాదులు నిర్మించుకున్న పాలనాయంత్రాంగం, పాలనా సాధనాలు భారత ప్రభుత్వానికి సంక్రమించాయి. కొత్తరాజ్యం ఆ యంత్రాంగాన్ని మొత్తంగా, యథాతథంగా స్వీకరించింది. "విదేశీ పెట్టుబడికి, వాణిజ్యానికి పూర్తి స్వేచ్ఛ," అనే విధానాన్ని భారత ప్రభుత్వం ప్రకటించింది. సామ్రాజ్యవాదుల ద్రవ్యపెట్టుబడి ప్రయోజనాలనూ గుత్తసంస్థల ప్రయోజనాలనూ రక్షించింది. భారతదేశంలో సామ్రాజ్యవాదుల పాలననాటి సాంఘిక, ఆర్థిక వ్యవస్థను పదిలంగా ఉంచటానికి 1935 భారత ప్రభుత్వచట్టం ద్వారా ఏర్పడిన రాజ్యాంగాన్నే స్వతంత్ర భారతదేశం కొనసాగించింది. అందువలన స్వతంత్ర భారత రాజ్యాంగం– అప్పటి వరకు ఉనికిలో ఉన్న రాజ్యాంగానికి భిన్నమైనదేమీకాదు. పాలకవర్గాలు, వారి తైనీతీలు ఈ రాజ్యాంగం అతి పవిత్రమైనదని నమ్మిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారు. స్వతంత్ర భారత రాజ్యాంగం– వలసవాదుల పాలనా యంత్రాంగాన్ని, అన్ని చట్టాలను, న్యాయవ్యవస్థను బలపరిచే సాంఘిక, ఆర్థిక వ్యవస్థను కొనసాగించటానికి సామ్రాజ్యవాద పునాదులమీద జాగ్రత్తగా నిర్మింపబడిన, ఉపరితల నిర్మాణం మాత్రమే"

"ఆ విధంగా భారత బూర్జువా వర్గానికి, సామ్రాజ్యవాదానికి మధ్య భారతదేశంలోని దోపిడీని కొనసాగించేందుకు జరిగిన ఒప్పందమే అధికారబదిలీ. "స్వతంత్ర" భారత రాజ్యాంగం బూర్జువా వర్గానికి ప్రతినిధిగా వ్యవహరించిన భారత జాతీయ నాయకత్వం భారత ప్రజలకు చేసిన దుర్మార్గమైన ద్రోహం యిది. అనాటి నుంచి, అమలుకాని హామీలను గుప్పించిన పాలకులు, సామ్రాజ్యవాదుల, భూస్వాముల దోపిడీని కాపాడటానికి మాత్రం నిర్దిష్టమైన వాగ్దానాలను చేశారు.

"స్వాతంత్ర్య ప్రకటన జరిగిన 25 సంవత్సరాల తరువాత కూడా ఆర్థిక స్వాతంత్ర్యమనేది ఎండమావిగానే వుంది. భారతదేశం మౌలికంగా అర్ధవలస– అర్ధ భూస్వామ్య వ్యవస్థగానే నేటికీ కొనసాగుతున్న కారణంగా ఆర్థిక, సాంఘిక రాజకీయ ఒత్తిడి ప్రజలపై పెరుగుతున్నది. అది నేడు ఉన్నత స్థాయిలో ఉంది. కావున భారతదేశంలో శాంతి భద్రతలను పర్యవేక్షించే అధికార కేంద్రం బ్రిటిష్ పాలనా కాలంలో కంటె నేడు దమన నీతిని ఉపయోగించటానికి చాల సంతోషంగా ఉంది. అందువలననే నా పై వలసవాదులు 1860లో రూపొందించిన చట్టప్రకారం నేరారోపణ చేయబడింది. సామ్రాజ్యవాదుల ప్రయోజనాలదృష్ట్యా చూస్తే కొన్ని నిర్వహణా పద్ధతులు తప్ప అధికారమార్పిడి తర్వాత మార్పు ఏమీలేదు. సారం అదే కానీ రూపంలో మాత్రం కొన్ని మార్పులు వచ్చాయి. స్వతంత్ర భారత దేశంలో వచ్చిన నూతన ప్రభుత్వం యొక్క లక్షణాలన్నీ పాత పాలనకు కొనసాగింపు మాత్రమే. అదే సామాజిక ఆర్థిక నిర్మాణం, అదే సామ్రాజ్యవాద పాలనా యంత్రాంగం, అదే ఉద్యోగవర్గం, న్యాయ వ్యవస్థ, అదే పోలీసు వ్యవస్థ కొనసాగుతున్నాయి కాబట్టి 1860లో రూపొందించిన చట్ట ప్రకారం నన్ను అరెస్టు చేయడంలో ఆశ్చర్యంలేదు"

'స్వతంత్ర' భారత ప్రభుత్వం, బ్రిటీష్ వలస వాదులు 1860లో చేసిన చట్టాలనే ఏ విధంగా వినియోగించు కుంటున్నారో నాలుగు దశాబ్దాల క్రితమే కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి వివరించారు. అహింసా సిద్ధాంతం, శాంతియుత మార్గాల ద్వారా భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిందనే భ్రమను ఆయన బహిర్గతపరిచారు. భారత స్వాతంత్ర్యం యొక్క గుణాన్నీ , భారత రాజ్యాంగపు స్వభావాన్నీ, భారత పాలనా వ్యవస్థ, న్యాయవ్యవస్థలు ఏ విధంగా బూర్జువా వర్గ, భూస్వామ్యవర్గాల ప్రయోజనాలనూ దోపిడీనీ రక్షించటానికి ఏర్పడినాయో, అవి అసమ్మతిని ఏవిధంగా అణచివేస్తున్నాయో, రాజ్యం యొక్క విధానాలను విమర్శిస్తున్న ప్రజాస్వామిక వాదులను ఎంత నిర్దయగా అణచివేస్తున్నారో తరిమెల నాగిరెడ్డి వివరించారు.

భారతదేశంలో ఆదివాసులను ఏ విధంగా దారుణ మయిన దోపిడీకి గురిచేస్తున్నారో కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి తన కోర్టు ప్రకటనలో వివరించారు. వారు భూమినుంచి వేరు చేయబడటాన్ని, శ్రమ దోపిడీకి గురవటాన్ని, భూస్వాముల, పోలీసుల అణచివేత వారిపై పెరిగిపోవటాన్ని వివరించారు. ఆదివాసులలో గూడు కట్టుకున్న అసంతృప్తి నక్సల్బరీ–శ్రీకాకుళం సాయుధ పోరాటాలకు దారి తీసిందని తరిమెల నాగిరెడ్డి వివరించారు. రాజ్యం యొక్క అధికారం ఇస్తున్న సహకారంతో భూస్వాములు, పారిశ్రామిక వేత్తలు ఆదివాసీలను వారి భూములనుంచి, వారి నివాసాల నుంచి బలవంతంగా తరిమివేస్తున్న వైనాన్ని ఆయన అంకెలు, వాస్తవాలతో సహా వివరించారు.

గ్రామీణ ప్రాంతాలలో భూస్వాములు, వారి అనుచర ముఠాలు తెల్ల బీభత్సాన్ని సృష్టిస్తున్న విధానాన్ని కూడా ఆయన వెల్లడించారు. కేరళలో అధికారంలో ఉన్న (ఆనాడు) సి.పి.ఐ. ప్రభుత్వం; ఎ. వర్గీస్ ఎన్‌కౌంటర్ హత్య విచారణకు అంగీకరించక పోవటాన్ని ప్రస్తావిస్తూ తనకు అధికారంలో పెట్టిన పాలక వర్గాలకు తమ విధేయతను నిరూపించుకోవడానికి, ఎన్‌కౌంటర్లకు పాల్పడుతున్న ఇతరరాష్ట్రాలను కాపాడటానికి సి.పి.ఐ ప్రభుత్వం ఇలాచేసిందన్నారు.

దేశంలో విస్తరిస్తున్న విప్లవ వెల్లువను అడ్డుకోవటానికి రాజ్యాంగ నిబంధనలను ప్రభుత్వం ఏ విధంగా అతిక్రమించిందో కామ్రేడ్ నాగిరెడ్డి వెల్లడించారు. రాజకీయ, ప్రజాస్వామిక అసమ్మతిని అణచివేయటానికి, ప్రజాస్వామిక ఉద్యమాలను ధ్వంసం చేయుటకు న్యాయవాదులపైన, మేధావులపైన రాజ్యం చేస్తున్న దాడులను సోదాహరణంగా వివరించారు. పోలీసులు– భూస్వాముల, పెట్టుబడిదారుల ఏజెంట్లుగా వ్యవహరిస్తున్నారని ఆయన ప్రకటించాడు.

కాబట్టి దేశద్రోహ నేరం క్రింద వినాయక్‌సేన్‌పైన, సుధీర్ దాల్వాల్ మొదలైన అనేకమంది పైనా నేరారోపణ చేయడాన్ని చూసి ఆశ్చర్యపోవలసిన అవసరం కానీ, గందరగోళపడవలసిన అవసరం కానీ లేదు. ఆదివాసీల సమస్యల గురించి పట్టించుకోవటం, వారి కోసం పోరాడడం అనేది కొంతమంది చెప్పుకొంటున్నట్లుగా ఇటీవల కాలంలో ప్రారంభమయింది కాదు. చాలా సుదూర గతం నుంచీ గిరిజనుల సాయుధ తిరుగుబాట్లు కొనసాగుతున్నాయని కామ్రేడ్ నాగిరెడ్డి స్పష్టంగా వివరించారు. కాశ్మీర్‌లోను, ఈశాన్య రాష్ట్రాలలోను సైనిక అణచివేతకు వ్యతిరేకంగా ప్రజాస్వామికవాదులు, మానవ హక్కుల కార్యకర్తలు చాలా కాలం నుంచీ పోరాడు తున్నారు. ప్రజాస్వామిక చైతన్యం, హక్కుల రక్షణ కార్యక్రమాలకు సుదీర్ఘ చరిత్ర ఉన్నది. ప్రస్తుతం వినాయక్‌సేన్ ప్రయత్నం ఆ పోరాట సంప్రదాయానికి కొనసాగింపు మాత్రమే.

భారతదేశంలో నిజమైన ప్రజాస్వామ్యంలేదు. తత్ఫలితంగా ప్రజాస్వామిక ఆకాంక్షలు, డిమాండ్లు వివిధ రూపాలలో వ్యక్తమౌతున్నాయి. మెరుగైన జీవితం, మెరుగైన పనిపరిస్థితులు; వివిధ ప్రాంతాల, భాషల, జాతుల సంపూర్ణ అభివృద్ధి; కుల, మత, లింగ వివక్షను రూపుమాపటం అనేవి ఆ డిమాండ్లు. తరచుగా ఈ డిమాండ్లు సమరశీల ఉద్యమాలకు ఆస్కారమిస్తున్నాయి. ఈ ఉద్యమాలను అణచివేయటానికి పాలక వర్గాలు వీటి పైన ఉక్కు పాదాన్ని మోపుతున్నాయి. కొన్ని నామమాత్రపు సంస్కరణలను చేపడుతున్మాయి. భారత ప్రజలు ప్రస్తుత సామాజిక వ్యవస్థ ప్రజాస్వామిక వ్యవస్థగా పరివర్తన చెందాలని కోరుకుంటున్నారని ఈ ఉద్యమాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ ప్రజాస్వామిక చైతన్యం సరియైన పద్ధతిలో ఉన్నపుడు విప్లవ చైతన్యంగా అభివృద్ధి చెందుతుంది. ఈ రెండు చైతన్యాలూ పరస్పర సహకారులుగా ఉండి ఒకదానితో ఒకటి పెన వేసుకొని ఉంటాయి. విప్లవ పోరాటాన్ని ప్రారంభించాలంటే ప్రజలలో ప్రజాస్వామిక చైతన్యం అవసరం.

వలసపాలనకు వ్యతిరేకంగా సాగిన జాతీయోద్యమ కాలంలో, అన్ని జీవనరంగాలలో ప్రజాస్వామిక సంస్కరణల మేరకు సాగిన వివిధ ఉద్యమాలు దేశంలో ప్రజాస్వామిక చైతన్యాన్ని పెంపొందించుటకు తోడ్పడినాయి. వర్గపోరాట భావజాలాన్ని వ్యాపింప చేశాయి. అందువలననే భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమపు తొలినాళ్ళలో దేశంలోని ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షలన్నింటికీ నాయకత్వం వహించింది. అది కమ్యూనిస్టు ఉద్యమం బలపడటానికి సహాయపడింది. దేశంలో, ప్రజాస్వామిక చైతన్యాన్ని పెంపొందించడంలో భాగంగా వలస పాలనాకాలంలో ప్రారంభమయిన ప్రజాస్వామిక, మానవ హక్కుల ఉద్యమాలు అధికార మార్పిడి తర్వాత కూడా అనేక ఒడిదుడుకులతో కొనసాగుతున్నాయి. మావోయిస్టులు ప్రారంభించిన పోరాటం కారణంగానే, అదీ ఇటీవలి కాలంలోనే దేశంలో

(తరువాయి 11వ పేజీలో)

# దేశంలోని వివిధ ప్రాంతాల్లో ప్రజల నిరసన, ఆందోళనలు

## ఆంధ్రప్రదేశ్

### నెల్లూరులో ఉక్కు పరిశ్రమ విస్తరణకు ప్రజల వ్యతిరేకత:

నెల్లూరుజిల్లా-చిల్లకూరు మండలం అంకులపాటూరువద్ద యస్.బి.క్యు.కు చెందిన ఉక్కు కర్మాగార ఆవరణలో, ఉక్కు పరిశ్రమ విస్తరణకు సంబంధించిన అంశంపైన జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రజాభిప్రాయ సేకరణను నిర్వహించాడు. స్థానిక ప్రజలు, రాజకీయ పార్టీలు, రైతుకూలీసంఘంతో సహా వివిధ ప్రజా వేదికలు, సంఘాలు ఈ కార్యక్రమంలో పాల్గొని ఉక్కు పరిశ్రమ యాజమాన్యం యొక్క ఈ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించాయి. ఇప్పటికే ఈ పరిశ్రమ యాజమాన్యం కాలుష్య నియంత్రణ మండలి 'సహకారం'తో కాలుష్య నియంత్రణ పద్ధతులన్నింటినీ అతిక్రమిస్తున్నది. ఈ పరిశ్రమ స్థాపనకు ముందు యాజమాన్యం హామీ ఇచ్చిన విధంగా ఈ పరిశ్రమలో స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించటంలో విఫలమైంది. స్థానిక రైతాంగాన్ని నష్టపరుస్తూ ఈ పరిశ్రమ అవసరాలకు ఏరేరు రిజర్వాయర్‌నుండి అక్రమంగా నీటిని వాడుకుంటున్నది. పరిశ్రమ విస్తరణ పథకాలను వీరంతా తీవ్రంగా వ్యతిరేకించారు.

### 'ఆశ' వర్కర్ల సమ్మె :

ఆంధ్రప్రదేశ్‌లో పనిచేస్తున్న 70,700మంది స్వచ్ఛంద ఆరోగ్య కార్యకర్తలు తమకు కనీస వేతనాలను డిమాండ్‌చేస్తూ డిసెంబర్ 13నుండి నిరవధిక సమ్మె చేపట్టారు. రాష్ట్రవ్యాపితంగా వివిధ ప్రాంతాల్లో వారు అనేక నిరసన కార్యక్రమాలను నిర్వహించారు. వివిధ రూపాల్లో పోలీసుల అణచివేత, దాడులకు గురయ్యారు. పోలీసుల అణచివేతను లెక్కచేయకుండా వారు ఆందోళనను ఉధృతం చేశారు. చివరికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం వారి డిమాండ్లకు తలొగ్గటంతో జనవరి 4వ తేదీన వారు సమ్మెను విరమించారు.

### విశాఖ 'బ్రాండిక్స్ అపెరల్ సిటి' కార్మికులకు సంఘీభావంగా గ్రామస్థులు:

విశాఖపట్నం శివారు పూడిమడక గ్రామస్థులు విశాఖపట్నం 'బ్రాండిక్స్ అపెరల్ సిటీ' ప్రధాన ద్వారం ఎదుట ఒక నిరసన ధర్నా నిర్వహించారు. అచ్యుతాపురంలో 'ప్రత్యేక ఆర్థిక మండలి' ఏర్పాటు సమయంలో, పూడిమడకకు చెందిన - ప్రధానంగా మత్స్యకారులైన ఆ గ్రామస్థులు వారి భూములన్నీ కోల్పోయారు. ఈ సెజ్‌లో నిర్మాణం గావించిన 'బ్రాండిక్స్ అపెరల్ సిటీ'లో ఆరు విభాగాల్లో 6వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరిలో ఎక్కువమంది మహిళలు. ఈ కార్మికులలో 300 మంది ఒక సం॥కాలంగా పూడిమడకనుండి ఈ కంపెనీలో పనిచేస్తున్నారు. జనవరి 6వ తేదీన అపెరల్ సిటి భద్రతా సిబ్బంది పూడిమడకకు చెందిన కొందరు కార్మికులపై దాడిచేశారు. దీనిని నిరసిస్తూ పూడిమడక గ్రామానికి చెందిన 2000 మంది 'అపెరల్ సిటి' ప్రధానద్వారం ఎదుట బైఠాయించి ధర్నా చేశారు. ఈ దాడికి పరిశ్రమ యాజమాన్యం బాధ్యత వహించి క్షమాపణ చెప్పాలని,తమ వేతనాలను పెంచాలని వారు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. అపెరల్ సిటీకి దోవతీసే రహదారులన్నింటినీ వారు దిగ్బంధనం చేశారు. పరిశ్రమలోనికి ఒక్క వాహనాన్ని కానీ, ఒక్క వ్యక్తిని కానీ వెళ్ళనీయకుండా అడ్డుకున్నారు. పోలీసులు వీరిపై లాఠీఛార్జీ జరిపి ఆరుగురు ఆందోళన కారులను గాయపరిచారు. ఈ సంక్షోభ నివారణకు యాజమాన్యం స్థానిక యూనియన్లతోనూ, ఇతర రాజకీయ పక్షాలతోనూ సంప్రదింపులు ప్రారంభించారు.

### విశాఖ 'అన్‌రాక్' పరిశ్రమ కార్మికుని అనుమానాస్పద మృతికి నిరసన:

విశాఖపట్నం-మాకవారిపాలెం 'అన్‌రాక్' కంపెనీ కార్మికుడు జనవరి 15న విధులకువెళ్ళి, అదే ప్రదేశంలో అనుమానాస్పద పరిస్థితుల్లో మృతుడిగా కన్పించాడు. పోలీసు జాగిలాలు మృతుని శరీరంవద్దనుండి భద్రతా సిబ్బంది విధులు నిర్వర్తించే గదులవద్దకు వచ్చి ఆగిపోవటాన్ని బట్టి, ఆ కార్మికుడు చంపబడ్డాడని స్పష్టమౌతున్నది. పరిశ్రమలో కార్మికులకు తగిన భద్రత లేకపోవటాన్ని, కార్మికుని మృతిపట్ల యాజమాన్యంయొక్క నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ కార్మికులు, గ్రామస్తులు, పరిశ్రమ కారణంగా నిర్వాసితులైన ప్రజలు, స్త్రీలు జనవరి 16న కంపెనీ ప్రధానద్వారం ఎదుట ఆందోళన జరిపి, తమ ఆగ్రహాన్ని వ్యక్తంచేశారు. పరిశ్రమ యాజమాన్యం దిగివచ్చి, ఆందోళన సాగిస్తున్న వారితో చర్చలు జరిపి, చనిపోయిన కార్మికుడు రాజబాబు(55) మృతికి పరిహారంగా 5 లక్షల రూపాయలు చెల్లించేందుకు అంగీకరించింది.

### ప్రభుత్వోద్యోగుల 'పెన్‌డౌన్' సమ్మె:

9వ వేతన సవరణ సంఘ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్‌చేస్తూ జనవరి 19న పదిలక్షలమంది ప్రభుత్వ ఉద్యోగులూ, ఉపాధ్యాయులూ ప్రభుత్వ కార్యకలాపాలన్నింటినీ స్థంభింపజేస్తూ 'పెన్‌డౌన్' సమ్మె చేపట్టారు. జనవరి 23 నాటికి ప్రభుత్వం దిగివచ్చి ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ నాయకత్వంతో చర్చలు జరిపి, వారి ప్రధాన డిమాండ్ల పరిష్కారానికి అంగీకరించింది.

## కర్ణాటక

### మోసపూరిత ప్రకటనలను నిరసిస్తూ రైతుల ధర్నా:

కర్ణాటక రాష్ట్ర బిజెపి ప్రభుత్వం రానున్న జిల్లా, తాలూకా ఎన్నికల ప్రచారంలో భాగంగా దిన పత్రికలకు ఒక ప్రకటనను విడుదలచేసింది. ఆ ప్రకటనలో ఆనందంగా ఉన్న ఒక చెరకు రైతు, మరొక రైతు ట్రాక్టరు నడుపుతూ వుంటారు. బిజెపి అధికారంలోకి వచ్చాక వారి అదృష్ట ద్వారాలు తెరుచుకున్నాయనేది ఆ ప్రకటన సారాంశం.

ప్రభుత్వం ప్రకటనలో చూపెట్టిన రైతుకు చెందిన గ్రామంలోని ప్రజలు ఈ ప్రకటనచూసి తీవ్ర ఆగ్రహావేశాలను వ్యక్తంచేశారు. ఎందుకంటే, 18 నెలలక్రితం తాను చేసిన వ్యవసాయ రుణాలు తీర్చలేక ఆ రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వాస్తవానికి అతను స్వంత భూమివున్న రైతుకూడా కాదు. నాగరాజు(32) అనే ఆ వ్యవసాయ కూలీ మాన్యా జిల్లా-శ్రీరాయపట్న తాలూకా-బాబూరాయన కొప్పలు గ్రామానికి చెందినవాడు.

బిజెపి ప్రభుత్వం ఇచ్చిన తప్పుడు ప్రకటనను నిరసిస్తూ డిసెంబర్ 20న మైసూరు-బెంగుళూరు జాతీయ రహదారిపై రైతులు బైఠాయించి బిజెపి క్షమాపణలు చెప్పాలని, ముఖ్యమంత్రి రైతులను బహిరంగ క్షమాపణ కోరాలనీ డిమాండ్ చేశారు. ఈ రైతులంతా ప్రత్యేకంగా ఏ ఒక రాజకీయపార్టీకి చెందిన వారు కాదు.

## బీహార్

### భూమిహీనులు భూసంస్కరణలను డిమాండ్‌చేస్తూ భూయాత్ర :

'భూమి అధికార్ ఆందోళన్' నాయకత్వంలో డిసెంబర్ 18వ తేదీన వందలాదిమంది నిరుపేద, చిన్నకారు రైతులు, ప్రజలు, స్త్రీ పురుషులు బుద్ధగయ నుండి పాట్నా దిశగా భూయాత్రను ప్రారంభించారు. తీవ్రమైన చలిగాలులను లెక్క చేయకుండా భూసంస్కరణలను వారు డిమాండ్‌చేస్తూ ముందుకు సాగారు. 5వేల మంది ప్రజలు హాజరైన బహిరంగసభ అనంతరం బుద్ధగయనుండి ఈ ప్రదర్శన సాగింది. భూసంస్కరణలపై డి.బందోపాధ్యాయ కమీషన్ సూచనలు తక్షణం అమలుచేయవలసిందిగా వారు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. భూమికోసం యుద్ధాలు, హత్యాకాండ జరిగిన ప్రాంతాలగుండా సాగిన ఈ యాత్ర డిసెంబర్ 28వ తేదీన పాట్నా చేరుకుంది.

### తగిన నష్టపరిహారంకోసం రైతుల ధర్నా:

బీహార్ రాష్ట్ర, విద్యుత్ బోర్డు మరియు జాతీయ ధర్మల్ విద్యుత్ కార్పొరేషనులు సంయుక్తంగా, 3,300 మెగావాట్ల సామర్థ్యంతో విద్యుత్ కేంద్ర నిర్మాణాన్ని తలపెట్టాయి. దీనికోసం నబీనగర్ ప్రాంతంలో 1871 ఎకరాల ప్రైవేటు భూముల సేకరణకు ప్రభుత్వం పూనుకుంది. ఆ ప్రాంతం మొత్తాన్ని ఒక పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దుతామని ప్రకటించింది. తమ భూములకు తగిన నష్టపరిహారాన్ని చెల్లించాలని డిమాండ్‌చేస్తూ రైతులు ఆందోళన ప్రారంభించారు. పోలీసుల అణచివేత చర్యలతో ఆందోళనకారులు రెచ్చిపోయి అంకోరా గ్రామ సమీపంలో జీవోఎమ్‌ఓ-బారాకాకనా ఎక్స్‌ప్రెస్‌లోని రెండు ఖాళీబోగీలకు, ఇంజనుకు నిప్పంటించారు.

## మధ్యప్రదేశ్

### రైతులచే భోపాల్ దిగ్బంధం:

మధ్యప్రదేశ్‌కు చెందిన వేలాదిమంది రైతులు భారతీయ కిసాన్ సంఘ్ నాయకత్వంలో మధ్యప్రదేశ్ రాజధానీ నగరం భోపాల్ నగరం చేరుకొని 48 గంటలు దిగ్బంధనం గావించారు. 'కిసాన్ పంచాయితీ' ల సందర్భంగా ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను నెరవేర్చనందుకే ఈ నిరసన చేపట్టామని వారు ప్రకటించారు. ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ఇంటిని వారు చుట్టుముట్టారు.

ట్రాక్టరు ట్రాలీలపై డిసెంబర్ 19 రాత్రికి రైతులు భోపాలు చేరుకుని 15 రోజులపాటు తమ ఆందోళనను కొనసాగించేందుకు సంసిద్ధులై వచ్చారు. ఆహార పదార్థాలు, సరుకులు, వంటచెరుకు తదితర అవసరాలను 15 రోజులకు సరిపడా తమతో తెచ్చుకున్నారు. గడ్డకట్టించే చలిగాలుల నడుమ రెండు రాత్రులు, రెండు పగళ్ళు బహిరంగ ప్రదేశంలోనే వారు తమ దీక్ష కొనసాగించారు. రోడ్లపైనే భోజనాలను వండుకొని, తిని, అక్కడనే నిద్రించారు. వారు రోడ్లను ఆక్రమించుకొని వాటిని దిగ్బంధనం చేశారు.

ముఖ్యమంత్రి ఆందోళన సాగిస్తున్న రైతుల నుద్దేశించి వారి డిమాండ్లను నెరవేరుస్తానని హామీ నిచ్చాడు. నిరంతరాయ విద్యుత్ సరఫరా, సులభ రుణపరపతి సౌకర్యం, పంటల బీమా, అవసరమైన ఎరువుల సరఫరాకు హామీ వంటివి రైతులు ప్రభుత్వం ముందుంచిన 181 డిమాండ్లలో ముఖ్యమైనవి. ఆర్.యస్.యస్. అనుబంధ బి.కె.యస్. ఆధ్వర్యంలో తమ మిత్ర పక్షమైన బిజెపి ఆధ్వర్యంలోని ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈ ఆందోళన నిర్వహించబడినప్పటికీ, 1956 తదనంతర కాలంలో మధ్యప్రదేశ్‌లో నిర్వహించబడిన అతిపెద్ద రైతుల నిరసన కార్యక్రమం ఇదేనని నిరాకరించవీలులేని విషయం. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వాలపట్ల వ్యక్తమయ్యే అసంతృప్తి వ్యతిరేకతలను ఆర్.యస్.యస్.బాగా ఉపయోగించుకుంటుండగా, పార్లమెంటరీ ప్రతిపక్ష పార్టీలలో ఈ చొరవ లోపించింది. పాలకులు ఏమి మాట్లాడినా, ఏమిచేసినా ప్రజలు మౌన ప్రేక్షకులుగా వుండరని, ఈ ఆందోళన పాలకులను హెచ్చరిస్తున్నది.

### నర్సుల ఆందోళన

2011 ఫిబ్రవరి 3న మధ్యప్రదేశ్ ప్రభుత్వం 200 మందికి పైగా నర్సులను అరెస్టుచేసింది. గత కొంతకాలంగా కొనసాగుతున్న వారి ఆందోళనను అణచివేసే ప్రయత్నాలను తీవ్రం చేసింది. అత్యవసర సేవల నిర్వహణా చట్టం (ఇ.యస్.ఎమ్.ఏ) ప్రయోగించేందుకు కావలసిన సన్నాహాలు చేస్తున్నది. కానీ రాష్ట్రంలోని రేవా, గ్వాలియర్, జబల్‌పూర్, ఇండోర్, భోపాల్ తదితర ప్రాంతాలలో వివిధ ఆసుపత్రులలో ఆందోళన సాగిస్తున్న 3500మంది నర్సులు ఈ బెదిరింపులను ఖాతరు చేయలేదు. నర్సులు తమ వేతనాలపెంపు, పదవీ విరమణ వయసును 65కు పెంపు డిమాండ్లను ప్రభుత్వం ముందుంచారు. రాష్ట్రప్రభుత్వ ప్రజారోగ్యం మరియు కుటుంబ సంక్షేమశాఖలోని తమ సహ ఉద్యోగులకు చెల్లించిన విధంగానే తమకూ వేతనాలు చెల్లించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ నర్సులంతా రాష్ట్రప్రభుత్వ వైద్య విద్యాశాఖ పరిధిలోకి రావటంతో ఆరవ వేతన సంఘ సిఫార్సుల ప్రకారం వీరు వేతనాలు పొందలేకపోయారు.

జబల్‌పూర్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాల, ప్రభుత్వ ఆసుపత్రులలో ఆందోళన చేస్తున్న నర్సులను తక్షణం పనిలోకి వెళ్ళవలసిందిగానూ, లేకుంటే ఉద్యోగంనుండి తొలగిస్తామని రాష్ట్రప్రభుత్వం హెచ్చరించింది.

## పంజాబ్

### విద్యుత్ కార్మికుల సమ్మె:

2010 డిసెంబర్ 7,8 తేదీలలో పంజాబ్ విద్యుత్ బోర్డులో పనిచేసే 60వేలమంది కార్మికులు రెండురోజుల సమ్మె చేపట్టారు. వారి జీత భత్యాల చెల్లింపుల మెరుగుదలకై చేపట్టిన ఈ సమ్మె రాష్ట్రప్రభుత్వం హామీ ఇవ్వటంతో ముగిసింది.

### నిర్బంధ చట్టాలకు పెద్దఎత్తున సామూహిక నిరసన:

పంజాబ్ రాష్ట్ర శాసనసభ ఇటీవలి సమావేశాల్లో ప్రజావ్యతిరేక, ఫాసిస్టు చట్టాలను ఆమోదించటాన్ని నిరసిస్తూ 2011 జనవరి 20వ తేదీన లూధియానా పట్టణంలో పెద్దఎత్తున నిరసన ప్రదర్శన జరిగింది. 40 సంస్థలకు చెందిన కార్మికులు, రైతులు, ప్రభుత్వ ఉద్యోగులు-టెర్రరిజాన్ని అణచే పేరిట శాసనసభ ఆమోదించిన నల్లచట్టాలను ఆమోదించటాన్ని నిరసిస్తూ వీధులలో కవాతు చేశారు. వాస్తవానికి ఈ చట్టాలు ఆందోళనలు సాగించే కార్మికులకు, రైతులకు వ్యతిరేకంగా ఉద్దేశించబడినవనేది స్పష్టమే.

లూధియానాతోపాటుగా ఇదే విధమైన ప్రదర్శనలు రాష్ట్ర వ్యాపితంగా ఇతర అన్ని జిల్లా కేంద్రాలలోనూ జరిగాయి. జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదురుగా కార్మికులు ధర్నా నిర్వహించారు. 'పంజాబ్ (ప్రివెన్షన్ ఆఫ్ డ్యామేజి టు పబ్లిక్ అండ్ ప్రైవేట్ ప్రాపర్టి) యాక్టు-2010' అనేది పంజాబ్ శాసనసభ ఆమోదించిన చట్టాలలో ఒకటి. కార్మికులు, రైతులు కనీసపాటి నిరసనలు తెలియజేయకుండా నిరోధించే ఫాశిస్టు చట్టమిది. ఈ చట్టం ప్రకారం-నిరసన ప్రదర్శనలు, ధర్నాలు మొదలైనవేవైనా జిల్లా మాజిస్ట్రేట్ లేదా పోలీసు కమీషనర్‌యొక్క ముందస్తు అనుమతి లేకుండా పూర్తిగా నిషేదించబడ్డాయి. ఒకవేళ అనుమతి ఇచ్చినప్పటికీ కూడా, కార్యక్రమ నిర్వాహకులు సంబంధిత పోలీసు అధికారికి హామీ పత్రాన్ని అందజేయాలి. దీనిని ఉల్లంఘిస్తే 2 సంవత్సరాల శిక్షతోపాటు జరిమానా విధించే అవకాశంవుంది. ప్రదర్శనమార్గం, ప్రదర్శనలో ఇచ్చే నినాదాలు కూడా పోలీసుల ఆమోదం పొందాలి. జెండాలు, బ్యానర్లు తగిలించుకునే కర్రలు కూడా ప్రదర్శనల్లో నిషిద్ధం. ప్రదర్శన, ధర్నాలను పోలీసులు వీడియో తీసుకునే అధికారం పొందటమేగాక, పత్రికా విలేఖరులనుండి ఫోటోలను, వీడియోలను పొందే అధికారం ఈ చట్టాల ప్రకారం సంక్రమిస్తుంది. ఈలాంటి ప్రదర్శనల సందర్భంగా ఏదైనా ఆస్తినష్టం జరిగినట్లుగా పోలీసులు ప్రకటిస్తే కార్యక్రమ నిర్వాహకులు ఆ పరిహారాన్ని చెల్లించాలి. చెల్లించలేకపోతే లేదా నిరాకరిస్తే హామీ పత్రం రాసి ఇచ్చినవారి ఆస్తులను వేలంవేసి ఆ నష్టపరిహారాన్ని పొందే ఏర్పాటు చేశారు. ఈ చట్టం క్రింద నేరాలన్నీ బెయిల్ నిరాకరించదగినవే. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు తామేమీ నష్టం కలిగించలేదని నిరూపించుకొనే బాధ్యత నిరసనకారుల పైనే మోపారు.

దీనితోపాటుగా పంజాబ్ శాసనసభ ఆమోదించిన 'పంజాబ్ స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ యాక్టు-2010'ను కూడా కార్మిక ప్రజానీకం వ్యతిరేకించారు. 'జాతి వ్యతిరేకశక్తుల అణచివేత పేరిట సుశిక్షిత సాయుధ సైనిక బలగాలను సమకూర్చుకునేందుకు ప్రభుత్వానికి ఈ చట్టం అధికారాలను కల్పిస్తున్నది.

## హర్యానా

### మనేసర్‌లో హోండా మోటార్‌బైక్ పరిశ్రమలో సమ్మె:

హర్యానాలోని మనేసర్‌లోని హోండామోటార్ సైకిల్, స్కూటర్ల పరిశ్రమలోని 2,500మంది రోజువారీ కార్మికులు-తమ సహ కార్మికుడొకరిని సెక్యూరిటీ సిబ్బంది చావబాదటాన్ని నిరసిస్తూ మెరుపు సమ్మె చేశారు. పరిశ్రమలో పనిచేసే ఇతర కార్మికులంతా ఈ ఆందోళనకు సంఘీభావం తెలిపారు.

2005లో కూడా ఇదేవిధంగా ఇదే పరిశ్రమలో కార్మికుడొకరిని గూండాలు తీవ్రంగా కొట్టడాన్ని నిరసిస్తే, గూండాలపై చర్య తీసుకోకపోగా యాజమాన్యం పోలీసులతో కార్మికుల ఆందోళనలను తీవ్రంగా అణచివేసింది.

ఈ విడత డిసెంబర్ 17,18 తేదీల్లో రెండురోజుల కార్మికుల సమ్మె అనంతరం యాజమాన్యం దిగివచ్చి కార్మికునిపై దాడిచేసిన సెక్యూరిటీ గార్డును విధులనుండి తొలగించి, సంఘటనను విచారించేందుకు పూనుకుంది.

---

### టక్సాన్...

(5వ పేజీ తరువాయి)

పన్నులను తగ్గించటంద్వారా వారి అత్యధిక వ్యక్తిగత సౌభాగ్యాలు పోగుపడేందుకు తోడ్పడింది.

కానీ అనివార్యంగా అంతులేకుండా పెరుగుతున్న అసంతృప్తి బయటపడే మార్గం అవసరమైంది. సమిష్టిగా, నిర్మాణయుతమైన వర్గపోరాట రూపంలో ప్రగతిశీల ఆశాజనకమైన రూపంలో అది వ్యక్తీకరింపబడలేని స్థితిలో, అది-తెగింపుతో వ్యక్తులపై ద్వేషపూరితంగా బ్రద్దలయ్యే రూపాన్ని తీసుకుంది. సామాజికంగా ఆలోచనలరీత్యా ఆందోళన చెందిన విభాగాలేకాక కార్పొరేట్ నిధులు, పెద్దఎత్తున ప్రచారం సమకూరుతూన్న అతి 'మిత' వాదులకు తలొగ్గే స్థితి ఏర్పడుతున్నది.

టస్కాన్‌లో జరిగిన సంఘటనలు ఓ హెచ్చరిక! పెరుగుతున్న సామాజిక అసంతృప్తి నూతనమైన, ప్రగతిశీలమైన వ్యక్తీకరణ రూపాన్ని ఎంచుకోవాలి. సోషలిజంకోసం పోరాటం చేయటంద్వారానూ కార్మికవర్గ నూతన విప్లవోద్యమ నిర్మాణం ద్వారానే ఈ మార్గం సుగమమౌతుంది. 11 జనవరి 2011

( *డేవిడ్ నార్త్ అమెరికా, సోషలిస్టు ఈక్వాలిటీ పార్టీ సభ్యులు)

# నవల్‌గఢ్ ప్రాంతంలో ప్రభుత్వ నిర్బంధ భూముల సేకరణకు వ్యతిరేకంగా తీవ్రమౌతున్న రైతాంగ ఆందోళనలు

**నవల్‌గఢ్** సబ్‌కలెక్టర్ ఆఫీసు ఎదుట భూముల స్వాధీనానికి వ్యతిరేకంగా రైతుల ధర్నా కొనసాగుతున్న సమయంలోనే ఆందోళనను తీవ్రతరం చేయాలనే ఉద్దేశ్యంతో ధర్నా కార్యక్రమం చేపట్టిన ప్రాంతంలోనే ఒక భారీ బహిరంగ సభ నిర్వహించబడింది. ఈ సభలో జిల్లాకు చెందిన వివిధ పార్టీల, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆ సభకు మాజీ పంచాయితీ సమితి సభ్యులు బోయత్‌సింగ్ అధ్యక్షత వహించారు. మొదటగా మాట్లాడిన పోరాట సమితి అధ్యక్షుడు దీపాసింగ్ షెఖావత్ భూముల స్వాధీనాన్ని వ్యతిరేకిస్తూ జరుగుతున్న రైతాంగ ఉద్యమ తీరు తెన్నులను వివరించారు. ఆయన తన ప్రసంగంలో ఎన్నికల ముందు రైతుల భూములు కోల్పోకుండా చూస్తామని హామీలిచ్చిన నేతలంతా ఎన్నికల తర్వాత వారి గోడు పట్టించుకోవడంలేదని, రైతులు భూములు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులతో సంప్రదించకుండా, ప్రభుత్వం, బహుళజాతి కంపెనీలతో కుమ్మక్కై రైతుల భూముల్ని బలవంతంగా స్వాధీనం చేసుకుంటోందని ఆరోపించారు. రైతులకు భూమి అంటే కేవలం మట్టి మాత్రమే కాదని, మన దేశంలో రైతు భూమిని తన ప్రాణం కన్నా మిన్నగా భావిస్తాడని ఆయన చెప్పారు. అలాంటి ఈ భూమిని మనం ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోవద్దని ఆయన రైతులకు పిలుపునిచ్చారు. అదే విధంగా ఈ వేదిక కమ్యూనిస్టు పార్టీ వేదిక కాదు; రైతు పోరాట సమితి యొక్క వేదిక కనుక ఇందులో అందరి భాగస్వామ్యం ఉంది అనికూడా షెఖావత్ స్పష్టం చేశారు. షెఖావత్ రైతు వేదిక కార్యదర్శి శ్రీరామదూత్ రైతులందర్నీ కలుపుకొని ఆందోళనను తీవ్రతరం చేయాలని, అందుకు తమ సంస్థ పూర్తి సహాయ, సహకారాల్ని అందిస్తుందని చెప్పారు.

రాష్ట్ర బిజిలీ రైతు సంఘానికి చెందిన శ్రీ చంద్‌డుడీ సంఘాలన్నీ కలసి పోరాటాన్ని తీవ్రం చేయాలని, భూ స్వాధీనతా చట్టం రైతుల, రైతు కూలీల జీవితాలను ఛిద్రం చేసే చట్టం కనుక తక్షణమే ఈ చట్టాన్ని రద్దు చేసేందుకు పోరాటం సాగించాలని పిలుపునిచ్చారు.

సి.పి.ఐ.(ఎం.ఎల్) జిల్లా అధ్యక్షులు ఫూల్ చంద్ దేవా నవల్‌గడ్ భూముల స్వాధీన వ్యతిరేక ఉద్యమానికి తామరతంపరగా నేతలు పుట్టుకొస్తున్నారని, ఫలితంగా ప్రజలకు ఎవరిమీద విశ్వాసముంచాలో తెలియని అయోమయ పరిస్థితి నెలకొని ఉందని చెప్పారు. కొందరు నాయకులు రైతులను మోసం చేస్తున్నారని, వారి మాటలు నమ్మొద్దని చెప్పారు. భూములు స్వాధీనానికి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలు తీవ్రంగా కొనసాగుతున్న ప్రాంతాలలో ప్రభుత్వాలు, కంపెనీలు వెనుకకు తగ్గాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని చెప్పారు. రైతులు ప్రస్తుతం పాలక నాయకుల మాటల్ని నమ్మడం లేదని చెప్పారు. భూముల స్వాధీనానికి వ్యతిరేకంగా ఐక్య సంఘటనను ఏర్పరచి ఆందోళనను ముందుకు నడిపించాలని కోరారు.

అన్ని పార్టీలు, ప్రజాసంఘాలు కలసి "భూమి బచావో" పేరుతో ఒక రైతుల ఐక్య పోరాట సమితిగా ఏర్పడి, ఆ సమితి ఆధ్వర్యంలో ప్రజా పోరాటం కొనసాగించాలని షహీద్ భగత్‌సింగ్ ఆలోచనా వేదికకు చెందిన బజరంగ్‌లాల్ అడ్వకేట్ పిలుపునిచ్చారు.

ప్రజా పోరాటాన్ని బలోపేతం చేయాలంటే గ్రామగ్రామానా సభలు నిర్వహించి, ప్రతి గ్రామంలోనూ ప్రజా పోరాట కమిటీలను ఏర్పరచాలి. ప్రజల్లో చైతన్యాన్ని కలిగించి, రైతులను కదిలించడం ద్వారా మాత్రమే రైతుల భూములు రక్షింపబడతాయి. ఇందుకు ప్రజా ఉద్యమాలే ఏకైక మార్గం. దేశ వ్యాప్తంగా మనం పరిశీలించినట్లయితే సంఘటిత పోరాటాల ద్వారా ప్రజలు మాత్రమే ప్రభుత్వాలకు ఎదురొడ్డి, కంపెనీలను తరిమికొట్టి, తమ భూముల్ని రక్షించుకోగలుగుతున్నారు. ఆస్ఫూర్తితోనే ఇక్కడ కూడా ఉద్యమాన్ని తీవ్రతరం చేయాల్సినవసరం వుంది. రైతుల ఆందోళనకు మద్దతునిస్తున్నాం బనుపా నేత గులామ్‌నబీ మాట్లాడుతూ రైతాంగ ఉద్యమాలు కేవలం కమ్యూనిస్టులకు మాత్రమే పరిమితమైన ఉద్యమాలుగా మిగిలిపోకూడదు; మనమంతా కలిసి పోరాడలని అని పిలుపునిచ్చారు. రాష్ట్ర వికాస పార్టీకి చెందిన యేదేష్ మాట్లాడుతూ మన ఆందోళనలో ఏ అవసరాలెదురైనా తాము సహాయమందిస్తామని మాట ఇచ్చారు.

యస్.యు.సి.ఐ. పార్టీ తరపున పిలానీ నుండి వచ్చిన రోహిత్ శర్మరైతుల భూముల స్వాధీనానికి వ్యతిరేకంగా కొనసాగుతున్న ప్రజా ఉద్యమాన్ని ఇంకా తీవ్రతరం చేయాలని పిలుపునిచ్చారు. అంతేకాక, ఈ ప్రజా పోరాటాలలోకి మహిళలు కూడ ముందుకు రావడం తక్షణ ఆవశ్యకతగా పేర్కొన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రైతుల చేతుల నుండి భూమిని వదులుకోవద్దని పిలుపునిచ్చారు. భారతీయ గ్రామీణ్ సంఘటన్ గోటడాకు చెందిన కెప్టెన్ కిషన్ సింగ్ మాట్లాడుతూ కేవల్ ప్రాంతంలో రైతులు ఇప్పటి వరకు 60 బీగాల భూమిని కూడా అమ్మలేదని; మిగతా రైతులూ తమ భూమిని కోల్పోవడానికి సిద్ధంగా లేరనీ చెప్పారు. నవల్‌గఢ్ బి.జె.పి.కి చెందిన ఖ్యాలీ రామ్‌గుజార్ మాట్లాడుతూ పార్టీలతో నిమిత్తం లేకుండా ఈ సమయంలో రైతుల సమస్యలపై ఆలోచించాల్సిన అవసరం ఉందని చెప్పారు. నవల్‌గఢ్ కార్పొరేషన్‌కు చెందిన పార్షద్‌పూర్ణ ఆజాద్ మాట్లాడుతూ పెట్టుబడిదారులతో ప్రభుత్వంతో రైతులు ఈ సంఘర్షణ కొనసాగిస్తున్నారని; వారంతా ఐక్యంగా కలసి కట్టుగా ఉండాలని పిలుపు ఇచ్చారు. గుజ్జర్ మహాసభ జిల్లా అధ్యక్షులు మూల్‌సింగ్ ధాబాయీ మాట్లాడుతూ భూ స్వాధీనతా చట్టం 1894ను రైతులకు వ్యతిరేక చట్టంగా పేర్కొంటూ, దానిని రద్దు చేయించడానికై రైతులంతా పోరాడాలని చెప్పారు.

భారతీయ కిసాన్ సంఘ్‌కు చెందిన పన్నాలాల్ సైనీ మాట్లాడుతూ ప్రస్తుతం రైతులకు తింటానికి తిండి గింజలు లేక అల్లాడుతున్నారని, దానికోసం పరిస్థితులను మెరుగు పరచుకోవాలంటే ఆందోళనే మార్గమని; అందుకు గ్రామ గ్రామాన క్షేత్రస్థాయిలో సమావేశాలు నిర్వహించి రైతులను చైతన్య పరచాలని పిలుపునిచ్చారు. అఖిల భారత కిసాన్ మహాసభ జిల్లా అధ్యక్షులు ఓమ్ ప్రకాష్ ఝూరోడా మాట్లాడుతూ భగత్‌సింగ్ కలలుగన్న స్వాతంత్ర్యం భారతీయులకు ఇంకా రాలేదని, ఫలితంగానే నేటికీ రైతుల జీవితం దుర్భరంగానే ఉందని చెప్పారు. రైతులు నేడు కూలీలయ్యారు. "దున్నేవానికే భూమి" అనే నినాదం నేడు అందని పండయ్యింది. దానికి బదులుగా రైతుల చేతుల్లోని భూమి కూడా లాగి వేయబడుతోంది. రైతుల సంక్షేమాన్ని కోరుకునే నాయకులు నేడున్న ఈ క్లిష్టపరిస్థితుల్లో ఎక్కడున్నారని ఆయన ప్రశ్నించారు.

రైతులు తమ నేలను ఎట్టిపరిస్థితుల్లోనూ వదులుకోరు. మనం రైతులను చైతన్యపరచాలి. అయితే కష్టమేమంటే చాలా రగ్ పుట్టుకొచ్చాయి. అంతా కలసి సమిష్టిగా రైతుల వద్దకు వెళ్ళాల్సిన అవసరం వుంది. భారతీయ కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి ఫుల్‌చంద్ బర్బర్ మాట్లాడుతూ భూమిని స్వాధీనం చేసుకోవడం అన్నది అంత తేలికైన విషయం కాదని ఆందోళనను తీవ్రతరం చెయ్యాల్సిన అవసరం నేడెంతైనాఉందని. పెద్దపెద్ద గ్రామాల్లో జనజ్యోతి సమావేశాలు నిర్వహిస్తూ చైతన్యవంతం చేయాలని బహుళజాతి కంపెనీలతో చర్చలు జరపకుండా; ప్రభుత్వంతో మాత్రమే చర్చలకు తలుపులు తెరచి ఉంచాలని అన్నారు. షెఖావతి కిసాన్ మంచ్‌కు చెందిన రామవిలాస్ మాట్లాడుతూ రైతుల స్థితి గతుల్ని ప్రజలకు అన్ని భ్రమలను తొలగించి వివరించాల్సిన అవసరం వుందని, వారిలో విశ్వాసాన్ని కలిగించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ సభ నవల్‌గఢ్‌కు చెందిన భజరంగ్‌లాల్‌ముండ్ అడ్వొకేట్ ఆధ్వర్యంలో నిర్వహించబడింది.

సభ తర్వాత, భూ స్వాధీనతను వ్యతిరేకిస్తూ గ్రామాల్లో సభలు నిర్వహించాలని, జనజాగృతి కార్యక్రమాలతో ప్రజలను చైతన్యవంతం చేస్తూ ప్రజా ఆందోళనలను తీవ్రం చేయాలని, గ్రామ కమిటీలను నిర్మించి నవల్‌గఢ్‌లో ఒక ప్రభావాన్ని చూపే ర్యాలీని లేదా సభను నిర్వహించాలని; రాబోయే కాలంలో అనుసరించాల్సిన ఎత్తుగడలను సిద్ధం చేసుకోవాలని, ర్యాలీ తయారీకోసం గ్రామ గ్రామాన సభలు నిర్వహించాలని, నవంబర్ 12న నవల్‌గఢ్‌లో రామ్‌దేవరా నుండి ర్యాలీ ప్రారంభమై నవల్‌గఢ్ సబ్ కలెక్టర్ కార్యాలయం వరకూ కొనసాగి, అక్కడే బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయాలు తీసుకొన్నారు.

**('భగత్ సింగ్‌కే సపనే' 15-11-10 సంచిక నుండి)**

## కర్ణాటక: ప్రజల ఆందోళనతో ఎండోసల్ఫాన్‌పై తాత్కాలిక నిషేధం

**'ఎండోసల్ఫాన్'** అనే క్రిమి సంహారకం అనేక సంవత్సరాలుగా దేశవ్యాపితంగా వుపయోగిస్తున్నారు. దీర్ఘకాలంపాటు దీని వినియోగం రైతుకు, వ్యవసాయ కూలీలకు, ప్రజలకు తీవ్రంగా హానిచేస్తున్నది.

కేరళ రాష్ట్రంలోని కాసరగడ్ జిల్లా ఈ విధంగా తీవ్రహాని జరిగిన ఎండోసల్ఫాన్ బాధిత ప్రాంతాలకు ఓ ఉదాహరణ. దీర్ఘకాలంగా ఎండోసల్ఫాన్ వాడకం ఆ ప్రాంతాన్ని ఒక 'మినీ భోపాల్' గా మార్చివేసింది. దేశంలోని మరికొన్ని ప్రాంతాలలో కూడా ఈ రసాయన వాడకం అనేక ఆరోగ్య సమస్యలను సృష్టించింది.

ప్రభుత్వ ఆధ్వర్యంలోని 'ప్లాంటేషన్ కార్పొరేషన్ ఆఫ్ కేరళ' కాసరగడ్‌లో జీడి తోటలపై 1970లలో ఎండోసల్ఫాన్‌ను పెద్దస్థాయిలో వినియోగించింది. హెలీకాప్టర్ల సహాయంతో ఈ ప్రాంతమంతా ఎండోసల్ఫాన్‌ను జీడితోటలపై వెదజల్లారు. తత్ఫలితంగా నదులు, వాగులు, తాగునీరు కూడా కలుషితమైంది. దీని దుష్పరిణామాలు కొన్ని సంవత్సరాల తర్వాత మరింతగా వెలుగులోకి వచ్చాయి. కాసరగడ్ జిల్లాలోని 11 గ్రామాలలో నివసిస్తున్న ప్రజలను–ఎండోసల్ఫాన్‌లోని విషం తీవ్రంగా ప్రభావితంచేసింది. వేలాదిమంది దీని బాధితులుగా మిగిలారు. అనేకమంది పిల్లలు మానసిక రుగ్మతలతో జన్మించారు. నాడీమండల వ్యవస్థ లోపాలతో మరికొందరు శిశువులు జన్మించారు. కాన్సర్, మూర్ఛవ్యాధి, నపుంసకత్వం తదితర సమస్యలను ఎదుర్కొన్నారు. బాధితుల్లో అనేకమంది శాశ్వత అంగవికలురుగా మిగిలారు. అధికారికంగా దాదాపు 500మంది ఈ విషప్రభావంవలన మరణించారని ప్రకటిస్తుండగా, అనధికార మరణాలు 4వేలకు పైగా వున్నాయి.

2001లో కాంగ్రెస్ ప్రభుత్వం ఎండోసల్ఫాన్ వాడకాన్ని నిషేధించింది. కానీ బహుళజాతి కంపెనీల వత్తిడితో 2004లో తిరిగి ఆ నిషేధాన్ని తొలగించింది. గత 20 సం॥కాలంలో ప్రభుత్వం దీనిపై పరిశోధనకు 17 కమిటీలు లేదా కమిషన్లను ఏర్పాటుచేసింది. ఈ బృందాలన్నీ ఎండోసల్ఫాన్ బాధిత ప్రాంతాలన్నింటా విస్తృతంగా తిరిగి పరిశోధన చేశాయి. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలముందు తమ నివేదికలను వుంచాయి. ఎండోసల్ఫాన్ వాడకమే ఈ దుష్పరిణామాలకు హేతువని అన్ని నివేదికలూ స్పష్టంచేశాయి. కేంద్ర ప్రభుత్వం నియమించిన ఒకే ఒక్క కమిటీ మాత్రమే ఎండోసల్ఫాన్ వినియోగం కారణంగా ఏ విధంగాను ప్రజలు, పర్యావరణం విషపూరితంగావటాన్ని గుర్తించలేదు!

రైతుల, ప్రజల తీవ్ర ఆందోళన ఫలితంగా కేరళలోని ఎల్.డి.ఎఫ్.ప్రభుత్వం రాష్ట్రవ్యాపితంగా ఎండోసల్ఫాన్ వాడకాన్ని నిషేధిస్తూ ప్రకటించింది. ఎండోసల్ఫాన్‌ను దేశవ్యాపితంగా నిషేధించవలసిందిగా కూడా అది కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తిచేసింది. ఈ విధమైన చర్యలకు బదులుగా కేంద్రప్రభుత్వం దీనిపై మరింత లోతైన పరిశోధనకు మరో కమిటీని ఏర్పరచింది.

కాగా ఇటీవల ఫిబ్రవరి 17న కర్ణాటక రాష్ట్రప్రభుత్వం ఆరోగ్యకరమైన సమస్యలు ఉత్పన్నమవుతున్నాయనే కారణంతో ఎండోసల్ఫాన్ వాడకాన్ని తమ రాష్ట్రంలో నిషేధించింది. రాష్ట్రంలోని బెల్తంగడి, పుత్తూరు, ఒన్ట్వాల్ తాలూకాల్లో పెద్దఎత్తున ఎండోసల్ఫాన్ వాడకం, తదనంతర దుష్పరిణామాల నేపథ్యంలో ప్రజలనుండి వచ్చిన వత్తిడి, నిరసన ఆందోళనల ఫలితంగా ప్రభుత్వం తాత్కాలికంగా ఎండోసల్ఫాన్ వాడకాన్ని 60రోజులపాటు నిషేధిస్తున్నట్లుగా ప్రకటించింది.

ప్రపంచంలోనే పురుగుమందుల అధిక వాడకంలో భారతదేశం ఒకటిగా వుంది. పురుగుమందుల తయారీదారులైన ప్రధానంగా బహుళజాతి పరిశ్రమల వారు తాము తయారుచేసే పురుగుమందులకు మన దేశాన్ని ప్రధాన లాభదాయక మార్కెట్‌గా భావిస్తున్నారు. వీటిలో మోన్‌శాంటో ప్రముఖమైనది. మన దేశంలో ఉత్పత్తయ్యే వ్యవసాయ పంటల్లో అధికశాతం పురుగుమందుల అవశేషాలుంటున్నాయి. ఇప్పటికే ఎండోసల్ఫాన్‌ను అమెరికాతో సహా ప్రపంచంలోని 65 దేశాలలో నిషేధించారు. 2010 అక్టోబర్‌లో ఈ పురుగుమందుల వినియోగం మానవ శరీరనిర్మాణంపై ఏ విధమైన ప్రభావం చూపుతుందనే అంశంపై జనీవాలో ఒక ప్రపంచస్థాయి సదస్సు జరిగింది. అందులో పాల్గొన్న 29 దేశాలలో 26 దేశాలు ఎండోసల్ఫాన్‌ను సంపూర్ణంగా నిషేదించాలని వాదించాయి. దురదృష్టమేమంటే, భారతదేశం మాత్రం ఎండోసల్ఫాన్‌ను నిషేధించాల్సిన అవసరంలేదనీ, ఎందువల్లనంటే, అది మానవ ఆరోగ్యాలకు ఏమంత ప్రమాదకరమైనది కాదనీ వాదించింది. భారత ప్రజలను, రైతాంగాన్ని బలిపెట్టటంద్వారా భారత ప్రభుత్వం బడా అగ్రిబిజినెస్ పరిశ్రమల, బహుళజాతి పురుగుమందుల పరిశ్రమల ప్రయోజనాల పరిరక్షణకు పూనుకుందని స్పష్టమైంది.

## ఉత్తరప్రదేశ్: భూములకు సరైన పరిహారానికై ఆందోళన చేస్తున్న రైతులపై కాల్పులు

**ఉత్తరప్రదేశ్** రాష్ట్రం–అలహాబాద్ జిల్లా, కర్చనా శాసన సభా నియోజకవర్గ పరిధిలోని కబారిగ్రామంలో ఆందోళన చేస్తున్న రైతులపై రాష్ట్ర ప్రభుత్వ పోలీసులు కాల్పులు జరిపి ఒకరైతును బలిగొన్నారు. 12 మంది రైతులు ఈ సందర్భంగా తీవ్రంగా గాయపడ్డారు.

ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ప్రైవేటురంగంలో జె.పి. గ్రూపుకు ధర్మల్ విద్యుత్ కేంద్ర నిర్మాణానికి అనుమతినిచ్చింది. 9వేలకోట్ల రూపాయల వ్యయంతో నిర్మించబోయే ఈ ప్రాజెక్టు నిర్మాణంకోసం ప్రభుత్వం నాలుగుజిల్లాల పరిధిలో భూసేకరణకు పూనుకొంది. విస్తాపనకు గురయ్యే 8 గ్రామాల్లోని ప్రతీ కుటుంబంలో ఒక్కరికి ఉద్యోగం, బీఘా భూమికి(12,400 చ॥మీ) పెద్దస్థాయిలో నష్టపరిహారం అందిస్తామని వాగ్దానం చేసింది. కానీ వాటి అమలుకు సిద్ధంకాలేదు. బీఘా భూమికి 3 లక్షల చొ॥న పరిహారం అందజేసి చేతులు దులుపుకునే ప్రయత్నం చేసింది. తమ జీవనోపాధిని దెబ్బతీస్తూ, అభివృద్ధి–ప్రాజెక్టుల నిర్మాణం పేరుతో తమను నిర్వాసితులను చేస్తూ పైగా కనీస పరిహారాన్ని కూడా అందిచకపోవటాన్ని నిరసిస్తూ రైతులు ఆందోళన ప్రారంభించారు. తమకు 'భూమికి–భూమి' పరిహారంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. దళిత ఉద్ధారక ప్రభుత్వంగా ప్రకటించుకుంటున్న మాయావతి నాయకత్వంలోని రాష్ట్ర బి.యస్.పి. సామాన్య రైతులను పణంగాపెట్టి ప్రభుత్వం బడా ప్రైవేటు కంపెనీల ప్రయాజనాలను కాపాడేందుకు సిద్ధమైందని వారు నిర్ధారించుకొని, ఆందోళనా మార్గాన్నెంచుకున్నారు. దీర్ఘకాలంగా శాంతియుతంగా ఆందోళన సాగిస్తున్నా ప్రభుత్వం వారి డిమాండ్లను పరిష్కరించేందుకు ఏమాత్రం శ్రద్ధ వహించలేదు. గత సంవత్సరం నొయిడా–ఆగ్రాల నడుమ యమునా ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణంకోసం సేకరించిన తమ భూములకు తగిన నష్టపరిహారం ఇవ్వాలని ఆ ప్రాంత రైతులు మిలిటెంట్ ఆందోళనలు సాగించి తమ డిమాండ్లు సాధించుకున్నారు. బారా–కర్చనా ధర్మల్ విద్యుత్ కేంద్ర నిర్వాసితులుకూడా ఆ స్ఫూర్తితో ఆందోళనను ఉధృతంచేశారు. ఈ ఆందోళనలపై జనవరి 21న కబారి గ్రామంలో పోలీసులు జరిపిన కాల్పులలో ఒక రైతు మరణించగా, 12 మంది గాయపడ్డారు. కర్చనాతో పాటుగా ఆలీఘడ్‌లోని టప్పల్ పట్టణంలోనూ రైతులు పోలీసులతో తలపడ్డారు. బీఘాకు రు.5 లక్షల పరిహారం, లేదా 'భూమికి భూమి' ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తున్నారు. బారా–కర్చానా విద్యుత్ కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలోకి తీసుకుని 'యుపి పవర్ ఉత్పాదక నిగమ్'కు అప్పగించాలని యుపి విద్యుత్ కార్మికుల సంయుక్త మోర్చా డిమాండ్ చేస్తున్నది.


తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ప్రచురణ

కాంతి కేంద్రాలా మృత్యు మందిరాలా ?

పరమాణు విద్యుత్ శక్తి గురించిన శాస్త్ర, సాంకేతిక, జీవావరణ, ఆర్థిక, రాజకీయ విశ్లేషణ

ఓ. పి. డి. ఆర్. అధ్యయన బృందం నివేదిక

వెల: రు. 15/-

మైత్రి బుక్ హౌస్

28-9-1, జలీల్‌వీధి, ఏలూరురోడ్, విజయవాడ

# ప్రకాశం-నెల్లూరు జిల్లా తీరాలను ముంచెత్తనున్న థర్మల్ విద్యుత్ కేంద్రాలు

## కనపర్తిలో కొనసాగుతున్న థర్మల్ విద్యుత్ కేంద్ర స్థాపన వ్యతిరేక ఆందోళన

**ప్రకాశంజిల్లా** - నాగులుప్పలపాడు మండలం కనపర్తిలో ఏపిజెన్‌కో ఆధ్వర్యంలో ప్రభుత్వం నిర్మాణంచేయ తలపెట్టిన నాలుగువేల మెగావాట్ల సామర్థ్యంకల థర్మల్ విద్యుత్ కేంద్రానికి వ్యతిరేకంగా బాధిత గ్రామాల ప్రజల ఆందోళన నిరంతరాయంగా, సమరశీలంగా కొనసాగుతున్నది.

వివిధపాలక, ప్రతిపక్ష పార్టీలు, ప్రజాసంఘాల మద్దతుతో సాగుతున్న ఈ ఆందోళన ఫలితంగా ప్రభుత్వం ప్రజాభిప్రాయసేకరణ జరుపుతామని ప్రకటించింది. అధిక జనసాంద్రత గల ప్రాంతంలో 2,600 ఎకరాల మంచి సాగుభూముల్నీ తమ ప్రాంతాలనూ విడిచి పెట్టేందుకు రైతులు, ప్రజలు ఎవరూ సిద్ధంగా లేరు. బాధిత గ్రామాల ప్రజలందరికీ ప్రత్యామ్నాయ నివేశన స్థలాలు ఏర్పాటు చేస్తామనీ, నిర్మాణం పూర్తయ్యాక అర్హులైనవారికి థర్మల్ విద్యుత్ కేంద్రాలలో ఉద్యోగాలు ఇప్పిస్తామని ప్రభుత్వం మభ్యపరిచే ప్రయత్నం చేస్తున్నది.

ఫిబ్రవరి 14వ తేదీన వినోదరాయునిపాలెం, కనపర్తిలలో రెవిన్యూ అధికారులను వందలాది మంది గ్రామ ప్రజలు, రైతులు చుట్టుముట్టి విద్యుత్ కేంద్ర ప్రతిపాదనను విరమించాలని డిమాండ్ చేస్తూ ఘెరావ్ చేశారు. ఒంగోలు రూరల్ పోలీసులు అక్కడికి చేరుకుని ఆందోళనకారులపై లాఠీఛార్జీ చేశారు. రెవిన్యూ అధికారులకు రక్షణగా నిలిచి ఆ వలయం నుండి బయటకు తీసుకెళ్లారు. 'జెన్‌కో వ్యతిరేక పోరాట సమితి' ఆధ్వర్యంలో ప్రజలు సాగిస్తున్న ఈ ఆందోళన ఫలితంగా స్థానిక కాంగ్రెస్ ఎం.ఎల్.ఏ. ఆమంచి కృష్ణమోహన్ ఈ విద్యుత్ కేంద్ర స్థాపనను అడ్డుకుంటామని ప్రకటించక తప్పలేదు.

## చీరాల వద్ద మెగా విద్యుత్ కేంద్ర నిర్మాణానికి నిరసన

ప్రకాశం జిల్లా, వేటపాలెం పరిసరగ్రామమైన నాయినపల్లిలో ఏ.పి.జెన్‌కో ఆధ్వర్యంలో ప్రభుత్వం నాలుగువేల మెగావాట్ల సామర్థ్యంతో ఒక అల్ట్రామెగా థర్మల్ విద్యుత్ కేంద్ర నిర్మాణానికి పూనుకుంది. ప్రతిపాదిత విద్యుత్ కేంద్ర ఫలితంగా మండలంలోని నాయినపల్లి, కఠారిపాలెం, పొట్టిసుబ్బయ్యపాలెం, కొత్తపాలెం, చల్లారెడ్డిపాలెం గ్రామాల ప్రజలు తమ సాగు భూములను కోల్పోతారు.

మత్స్యకారులతో సహా, సన్న చిన్నకారు రైతులే వీరిలో అధికంగా వున్నారు. ఈ ప్రాంతలో థర్మల్ విద్యుత్ కేంద్ర స్థాపన ఫలితంగా మత్స్యకారులు తమ జీవనోపాధిని సైతం కోల్పోతారు. ఈ థర్మల్ విద్యుత్ కేంద్రానికి 1600 ఎకరాల భూములు అవసర మౌతాయంటూ 726 ఎకరాలకు నోటీసులు కూడా ఇచ్చారు.

ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలంలో ఏపిజెన్‌కో ఆధ్వర్యంలో నిర్మించనున్న కనపర్తి థర్మల్ విద్యుత్ కేంద్రానికి వ్యతిరేకంగా ప్రజలు నిరంతరాయంగా సాగిస్తున్న ఆందోళన స్ఫూర్తితో ఈ ప్రాంతంలో ప్రజలు కూడా తమ భూములను వదలబోమని ప్రతిన బూని ఆందోళనలో వున్నారు.

## నెల్లూరును కబళించనున్న థర్మల్ విద్యుత్ కేంద్రాల కాలుష్యం - ప్రజల ఆందోళన

నెల్లూరు జిల్లాను కాలుష్య భూతం కబళించనుంది. డిసెంబరు మొదటివారంలో నెల్లూరు జిల్లాలో ప్రతిపాదిత థర్మల్ విద్యుత్ కేంద్రాల ప్రాంతాల్లో, గ్రామాల్లో మానవ హక్కులవేదిక (హెచ్.ఆర్.ఎఫ్.) పర్యటించింది. నెల్లత్తూరు, ముసునూరువారిపాలెం పాయికాపురం. దేవరదిబ్బ ఎస్టీ కాలనీ, నెల్లత్తూరుపాలెం గ్రామాల రైతులు, మత్స్యకారులు, రైతుకూలీలతో కలసి ఈ బృందం చర్చించింది. మత్తుకూరు-చిల్లకూరు కోస్తాతీర ప్రాంతంలో పెద్దఎత్తున రానున్న థర్మల్ విద్యుత్ కేంద్రాల ఫలితంగా భూమి, ప్రజల జీవనం, పర్యావరణం, నీటి వనరులు, సముద్రం, ప్రజల ఆరోగ్యాలపై అవి కలిగించే దుష్ప్రభావాలను ఈ బృంద సభ్యులు అధ్యయనం చేశారు. కేవలం 10-15 కి.మీ. పరిధిలోనే ప్రతిపాదించిన థర్మల్ విద్యుత్ కేంద్రాల సామర్థ్యం 25,540 మెగా వాట్లు అంటేనే ఏ స్థాయిలో థర్మల్ విద్యుత్‌కేంద్రాల స్థాపన జరగనుందో, వీటన్నింటికీ అనుమతులు ఏ ప్రయోజనాలను ఆశించి మంజూరు చేశారననేది గమనార్హమైనదిగా పేర్కొన్నారు. ప్రతిరోజూ నాలుగు లక్షల టన్నుల బొగ్గును కాల్చటం ద్వారా 1 లక్షా 45 వేల టన్నుల బూడిద వెదజల్లబడుతుంది. వీటి ద్వారా గంధకం, జింకు, పాదరసం మరి ఇతర మూలకాలు పర్యావరణంలో పెద్దస్థాయిలో కలుస్తాయి. వీటన్నిటికంటే కూడా 79 లక్షల క్యూబిక్ మీటర్ల నీటి వినియోగం అవసరమౌతుంది. విద్యుత్ కేంద్రాలలో ఉపయోగించిన నీరు అధిక ఉష్ణోగ్రతతో వెనక్కు సముద్రంలో కలుస్తుంది. సముద్రంపై ఆధారపడి జీవనం సాగించే యానాది, మత్యకార కుటుంబాలు, మత్స్య పరిశ్రమ వీటి ఫలితంగా తీవ్రంగా నష్టపోతాయి. ఈ విద్యుత్ కేంద్రాల నుండి వెలువడే బూడిద మానవుల ఆరోగ్యానికి, వ్యవసాయానికి, భూగర్భ జలాలకు తీవ్ర విఘాతం కల్గిస్తాయని వారి నివేదికలో పేర్కొన్నారు.

పొదలకూరు మండలం, సూరాయపాలెం గ్రామ సమీపంలో ఇప్పటికే నిర్మాణమైన బొల్లినేని విద్యుత్ కేంద్రం విడుదల చేసే పొగ, ధూళి, కాలుష్యాల ఫలితంగా పరిసర గ్రామస్థులు తీవ్ర సమస్యలనెదుర్కొంటున్నారు. దీనినుండి వెలువడే బూడిద కారణంగా అనేకమంది కళ్ళు దెబ్బతిన్నాయి. శ్వాసకోశ సంబంధ వ్యాధులు సంక్రమించాయి. పంటపొలాలకు కాలుష్యకారణంగా నష్టం జరిగింది. సూరాయపాలెం పరిసర గ్రామాల నుండి ఆరువేలమంది ప్రజలు ఆందోళనలు, రాస్తారోకోలు నిర్వహించటంతో మేల్కొన్న ప్రభుత్వం సిఆర్‌పిసి 133 సెక్షన్ ప్రకారం ఈ విద్యుత్ కేంద్రాన్ని మూసివేయాలని ఉత్తర్వులు జారీచేసింది. బూడిద కారణంగా కళ్ళు దెబ్బతిన్న బాధితులకు వైద్య సహాయం అందించాలని ప్రభుత్వాధికారులను ఆదేశించింది.

7.5 మెగావాట్ల సామర్థ్యంతో 9 సం॥ క్రితం 80 ఎకరాల స్థలంలో ఈ విద్యుత్ కేంద్రం నిర్మించారు. తుమ్మకర్ర, వంట చెరకు, వరిపొట్టు, కందిపొట్టు, కందికట్టె తదితరాలను దీనిలో మండించి విద్యుదుత్పత్తి చేస్తారు. దీనిలో నుండి వెలువడే కాలుష్య తీవ్రతే ఈ విధంగా వుంటే, వేల మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యంతో ప్రతిరోజూ ఒక లక్షా 25 వేల టన్నుల బొగ్గును (మత్తుకూరు-చిల్లకూరు నడుమ పెట్టబోయే పరిశ్రమలలో మాత్రమే) మండించటం ద్వారా వెలువడే కాలుష్యం తీర ప్రాంత ప్రజలను ముంచెత్తబోతుంది. దీనికి వ్యతిరేకంగా ఆందోళనకూడా ప్రారంభమై కొనసాగుతోంది.

నెల్లూరు జిల్లాలో కుప్పలు తెప్పలుగా నిర్మాణం కానున్న థర్మల్ కేంద్రాలవల్ల ముంచుకు వచ్చే ప్రమాదాన్ని దృష్టిలో వుంచుకొని 'థర్మల్ కాలుష్య వ్యతిరేక పోరాట కమిటీ' ఏర్పడి ఆందోళన సాగిస్తున్నది. నెల్లూరు జిల్లాలో ప్రతిపాదించిన 26 థర్మల్ విద్యుత్ కేంద్రాల జాబితాను, వాటివలన ఏటా విడుదలయ్యే 5 కోట్ల టన్నుల బూడిద ప్రభావాన్ని , ఇతర పర్యావరణ ప్రమాదాలను వివరిస్తూ పోరాట కమిటీ నాయకత్వం గత ముఖ్యమంత్రి రోశయ్యకు ఒక విజ్ఞాపన పత్రాన్ని అందజేశారు వారి ఆందోళన కొనసాగుతున్నది. ✡

# స్వాతంత్ర్య ఉషోదయం

ఫైజ్ అహ్మద్ ఫైజ్

**మనం** నిరీక్షించింది
కాళరాత్రి కోరలలో నలిగిపోయిన
ఈ కాంతివిహీన ఉషోదయం కోసం కానేకాదు-
దోవ తెలియని ఆకాశపుటెడారులలో
దిగంతాల అంతిమ నక్షత్రాన్ని అందుకోవాలనీ
నిశీథికల్లోల జలధి తరంగం విశ్రమిస్తుందనీ
అశ్రుభరిత హృదయనౌక తీరాన్ని తాకుతుందనీ

మనం ప్రయాణం మొదలు పెట్టింది
దీని కోసం కానేకాదు-
ఎన్నెన్ని యవ్వనోద్వేగాలు
కాంక్షాభరిత బాహువుల ఆహ్వానాలు
వలపులకి వీడ్కోలు పలికిన
విషాద వీక్షణాలు-
చేరువలో - వలపుల మధుపాత్రలు,
సౌందర్య రహస్యాలు
కానీ ఉషఃకాంతిశోభ నిలువనీయలేదు
వాంఛాతప్త హృదయాలు
అలసి సొలసిన దేహాలు
చీకటితెరలు తొలగి వెలుగురేఖలు
విచ్చుకున్నాయని వాళ్ళు చెబుతున్నారు
గమ్యం చేరుకున్నామని వాళ్ళు ప్రకటిస్తున్నారు
విషాదమేఘాలు విడివడి
ఎడబాటు వేదన ముగిసి
కలయికల
ఉల్లాసవేడుకలొచ్చాయంటూ చెబుతున్నారు
చెల్లాచెదురైన స్వప్న శకలాలు
మసకబారిన కళ్ళు
చితిపై తగలబడుతున్న హృదయం
ఈ ఎడబాటుకు ఓదార్పేలేదు-
ఉషోదయ మలయమారుతం వచ్చిందెక్కడ?
వీచిందెటువైపు?
వెలుగుతున్న దీపానికి జాడే తెలియడం లేదు
రాత్రి చీకటినీడలింకా ముసురుకొనే వున్నాయి
హృదయానికింకా సంకెళ్ళు తొలగనేలేదు
ఈ కఠోర ప్రయాణాన్ని ఆపొద్దు
మనం గమ్యాన్నింకా చేరుకోనేలేదు

**అనువాదం : సుధాకిరణ్**
**(రచనాకాలం: 1947 ఆగస్టు)**

# మాస్కోలో ఘనంగా కా॥స్టాలిన్ జన్మదిన సందర్భం

2010 డిసెంబర్ 23న కా॥స్టాలిన్ 131వ జన్మదినాన్ని మాస్కోలోని రెడ్‌స్క్వేర్‌లో ప్రజలు పెద్దఎత్తున నిర్వహించారు. కా॥స్టాలిన్ సమాధివద్ద పుష్పగుచ్ఛాలనుంచి ఆయనను ఘనంగా సంస్మరించుకున్నారు. అనేకమంది పెద్దవయస్సువారు కమ్యూనిస్టు పార్టీ పతాకాలను చేబూని తమ అమిత సంతోషాన్ని వ్యక్తంచేశారు.

ప్రదర్శన కారులు సోవియట్ సైన్యంయొక్క కవాతు గీతాన్ని ఆలపించారు. వారు స్టాలిన్ చిత్రపటాలతో కూడిన బ్యానర్లను ప్రదర్శించారు. కామ్రేడ్ స్టాలిన్ 'మాసోలియం' వద్దను, సమాధివద్దను వారు ఎర్రపూలతో నివాళులర్పించారు.

సోవియట్ యూనియన్ అంతరిక్ష పరిశోధన రంగంలో పనిచేసిన డా॥వ్లదమీర్ మాల్కోవ్ ఈ సందర్భాన్ని పురస్కరించుకొని మాట్లాడుతూ 'స్టాలిన్ మా శక్తి- మా ప్రపంచం-మమ్మల్ని అత్యున్నతంగా నిలిపే మా మార్గం-మా తరంలో ఇంకా ఆ రక్తం ప్రవహిస్తూనే వుంది. ఆ తరానికి చెందిన ధైర్యమైన, శక్తివంతమైన వృద్ధులైన వారి ముఖాలను చూడండి' అని పేర్కొన్నారు. కామ్రేడ్ స్టాలిన్‌ను క్రూరునిగా చిత్రీకరిస్తూ ఆయన ప్రతిష్టను దిగజార్చేందుకు క్రెమ్లిన్ సాగిస్తున్న ప్రయత్నాలను ఈ సందర్భంగా ప్రసంగించిన వక్తలు తీవ్రంగా ఖండించారు.

రష్యా అధ్యక్షుడు డిమిత్రి మెద్వదేవ్ 2011 జనవరిలో స్టాలిన్ ప్రతిష్టను మసకబార్చి, దిగజార్చేందుకు ఒక కార్యక్రమాన్ని ప్రారంభించ సంకల్పించాడు. ఈ ప్రయత్నాన్ని తీవ్రంగా నిరసిస్తూ రష్యా వ్యాపితంగా నిరసనలు వ్యక్తమయ్యాయి.

# పోర్టు పేరిట వేల ఎకరాల భూముల సేకరణకు నిరసన

**బందరు, 24-1-11:**
మచిలీపట్నం పోర్టు నిర్మాణం కోసమని ప్రజల జీవనాధారమైన వేలాది ఎకరాల భూములను గుంజుకునే ప్రభుత్వ ప్రయత్నాలను నిరసిస్తూ గోపువానిపాలెం, మంగినపూడి, చిన్నాపురం గ్రామాల రైతులు సమైక్యంగా ఆందోళన చేస్తున్నారు. చినకరగ్రహారం, మేనేవారిపాలెం, గోపువానిపాలెం, తవిసపూడి, మంగినపూడిలలో సుమారు 4500 ఎకరాలు; గుండుపాలెం, చిన్నాపురం, మన్నాలి చెరువు గ్రామాలలో 1200 ఎకరాల భూమిని సేకరించేందుకు రెవెన్యూ ఉన్నతాధికారులు ఆదేశించిన పరిస్థితుల్లో ఈ గ్రామాల రైతాంగం ఆందోళనకు పూనుకొన్నారు. గోపువానిపాలెం, మంగినపూడి, తవిసపూడి, చినకరగ్రహారం రైతులు, తమ జీవనాధారమైన భూములను పోర్టుకు ఇవ్వబోమని కలక్టర్‌కు మెమోరాండం ఇచ్చి తమ అభ్యంతరాలను ఖచ్చితంగా తెలియజేశారు. భూసేకరణకు పూనుకొంటే ప్రాణాలైనా అర్పిస్తామని, భూములను మాత్రం వదలబోమని స్పష్టంచేశారు.

31.1.2011 తేదీన తవిసపూడి, మంగినపూడి, గోపువానిపాలెం రైతులు మంగినపూడి బీచ్‌రోడ్డుపై బైఠాయించి తమ నిరసనను తెలియజేశారు. 4.2.2011వ తేదీన రచ్చబండ కార్యక్రమం సందర్భంగా గోపువానిపాలెం రైతులు, కూలీలు, స్త్రీలు, యువకులు సమైక్యంగా రచ్చబండ కార్యక్రమాన్ని బహిష్కరించారు. రెవెన్యూ ఉన్నతాధికారులు గ్రామస్తులకు నచ్చచెప్పబోగా రైతులు ఎదురు తిరిగారు. రచ్చబండ కార్యక్రమాన్ని జరగనీయబోమని, గ్రామం నుండి అధికారులు వెళ్ళిపోవాలని హెచ్చరించారు. అధికారులు రచ్చబండను నిర్వహించడానికి ప్రయత్నించేసరికి గోపువానిపాలెం గ్రామస్థుల ఆగ్రహం కట్టలు తెగింది. మూకుమ్మడిగా అడ్డుకున్నారు. అధికారుల వాహనాలను గ్రామం పొలిమేరలు దాటేవరకు వెంబడించారు. మా జీవనాన్ని నాశనం చేసే, మా భూముల్ని లాక్కుకొని నిరాశ్రయులను చేసే పోర్టు తమకొద్దని నినదించారు. ఈ నిరసనాందోళనకు గోపువానిపాలెం సర్పంచ్ శ్రీమతి వాలిశెట్టి సురేఖ, కాంగ్రెస్ పార్టీ నాయకులు వాలిశెట్టి బాబు, మంగినపూడి సర్పంచ్, ఇంకా మూర్తి, నాగభూషణరావు, గ్రామపెద్దలు నాయకత్వం వహించారు. బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న తీరప్రాంత రైతుల ఆందోళనకు రైతుకూలీసంఘం(ఆం.ప్ర) సంఘీభావం తెల్పుతూ ఈ కార్యక్రమంలో భాగస్వామైంది.

11.2.2011 తేదీన రచ్చబండ కార్యక్రమం సందర్భంగా చిన్నాపురం రైతాంగం పోర్టుకు తమ భూములను ఇవ్వబోమని, భూసేకరణను నిలిపివేయాలని నిరసన తెలియచేస్తూ బందరు రూరల్‌మండల తహసీల్దార్‌కు మెమోరాండం ఇచ్చారు. ఈ సందర్భాల్లో రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) జిల్లా నాయకులు కా॥జె.జగన్ మాట్లాడుతూ "పర్యావరణ ప్రభావ అంచనా నివేదికలో ల్యాండ్ యూజ్‌ప్లాన్‌లో 615 ఎకరాలు అవసరం అవుతుందని స్పష్టంచేశారు. దానికి భిన్నంగా అవసరానికి మించి 6262.19 భూములెందుకు ప్రభుత్వం సేకరించే ప్రయత్నం చేస్తున్నది? ఈ భూముల్లో ఏఏ పరిశ్రమలు పెడతారో ప్రభుత్వంగాని, పోర్టును నిర్మించే నవయుగ కంపెనీగాని ఇంతవరకూ ప్రకటించలేదు. గతంలో మేటాస్ కంపెనీ తనకు కేటాయించిన భూమిని బ్యాంకులకు తనఖాపెట్టే 1000 కోట్లు పెట్టుబడిని సమీకరించుకొనేందుకు ప్రభుత్వం అనుమతి ఇస్తూ జీ.వో.విడుదల చేసింది. మేటాస్ లాగానే నవయుగ కంపెనీ రైతాంగం నుండి దౌర్జన్యంగా సేకరించిన భూమిని బ్యాంకులకు తనఖాపెట్టి పెట్టుబడిని సమీకరించుకొంటుంది. ఇందుకు రైతులు భూములను వదులుకొని త్యాగాలు చేయాలా! భూములు కోల్పోయిన రైతులు ఏ విధంగా బ్రతకాలి? కనుక తమ భూములు దక్కించుకొనేందుకు సమైక్య ఆందోళన సాగించాలని రైతులకు ఆయన పిలుపు నిచ్చారు. ✡



**రైతుకూలీసంఘం (ఆం.ప్ర.)**
**రాష్ట్ర మహాసభల సావనీర్ - 2010**
వెల : రు. 30/-
ప్రతులకు : **మైత్రీ బుక్ హౌస్**
28-9-1, జలీల్‌వీధి, కార్ల్‌మార్క్స్ రోడ్,
విజయవాడ-2

# 'పంటల నష్టాన్ని మరింత పెంచుతున్న అధ్వాన్న డ్రైనేజీ వ్యవస్థపై పోరాడండి'

నాగాయలంక సదస్సులో ప్రసంగిస్తున్న కా|| కోటయ్య




**నాగాయలంక, 21-2-2011:** 'అధ్వాన్నంగా ఉన్న డ్రైనేజీ-పంటల నష్టం'పై రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) ఆధ్వర్యంలో స్థానిక పంచాయితీ ఆఫీస్ ఎదుట బహిరంగ సభ జరిగింది. ఈ సభకు అధ్యక్షత వహించిన సంఘం జిల్లా కోశాధికారి కా||తలశిల లీలామనోహర్ ఉపన్యసిస్తూ 'ప్రకృతి విపత్తులకు జిల్లాలో 5,50,880 ఎకరాల్లో వరిపంట నష్టం జరిగింది. పంటల నష్టానికి ప్రకృతి విపత్తు ఒక కారణం కావచ్చుకానీ దశాబ్దాల తరబడి మరమ్మత్తులకు నోచుకోకుండా అధ్వాన్నంగా వున్న మురుగుకాల్వల వ్యవస్థే అసలైన ప్రధాన కారణం' అన్నారు. రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) రాష్ట్ర కార్యదర్శి కా||కొప్పుల కోటయ్య మాట్లాడుతూ-ప్రకృతి విపత్తులకు రాష్ట్రంలో 42.30 లక్షల ఎకరాల్లో పంటలకు నష్టం జరిగిందని, ప్రధానంగా 31.38 లక్షల ఎకరాల వరిపంట నష్టపోగా, 35.98 లక్షల మంది రైతులు 5076 కోట్లు పెట్టుబడులు కోల్పోయారనీ అన్నారు. దశాబ్దాల తరబడి మరమత్తులకు నోచుకోకుండా అధ్వాన్నంగా అస్తవ్యస్తంగా ఉన్న మురుగు కాల్వల వ్యవస్థ దీనికి మరో ముఖ్యమైన కారణం అనీ అన్నారు. కేంద్ర ప్రభుత్వం భూపేందర్ హుడా ఆధ్వర్యంలో నియమించిన వర్కింగ్ గ్రూపు ప్రకృతి విపత్తుల సమయంలో హెక్టారుకు 25,000 రూ||లు పరిహారం ఇవ్వాలని సిఫారస్ చేసింది అంటే ఎకరాకు 10 వేలు! ఈ సిఫార్సును కూడ ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదంటే మనం ఏమనుకోవాలి అన్నారు. పన్నులపై పన్నులు వేసి ప్రజల గోళ్ళూడగొట్టి వసూలుచేసి లక్షల కోట్లు దండుకుంటున్న ఈ ప్రభుత్వాన్ని తగిన పరిహారం కోరే హక్కు దేశానికి అన్నం పెట్టే రైతుకు వుందన్నారు. ఈ పరిస్థితికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర) జిల్లా సహాయ కార్యదర్శి కా||యు.వీరబాబు మాట్లాడుతూ 'మన వ్యవసాయరంగం సంక్షోభంలో వుంది. మన పాలకులు మన వ్యవసాయాన్ని అభివృద్ధి చేయలేదు. కావాలనే వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెడుతున్నారు. చిన్న చిన్న కమతాలను రద్దుచేసి, పెద్ద కమతాలను ముందుకు తేవటానికి మన పాలకులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే మన వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. ప్రభుత్వం విదేశీ కంపెనీలకు ప్రోత్సాహకాల రూపంలో 5 లక్షల కోట్లు ఇచ్చింది. పారిశ్రామికవేత్తల పైవున్న ప్రేమ కష్టజీవులైన రైతులపై ఎందుకు లేదని ఆయన ప్రశ్నించారు. సాగునీటి ప్రవేటీకరణ, విత్తనాల బిల్లు 2010, కార్పోరేట్ వ్యవసాయం వంటి రైతు వ్యతిరేక విధానాలు అమలుచేస్తూ ముప్పేట దాడిని సాగిస్తుందనీ ఈ పరిస్థితుల్లో రైతాంగం తమ హక్కులను కాపాడు కొనేందుకు పోరాడేందుకు సమాయత్తంకావాలని' పిలుపు నిచ్చారు. ఆత్మహత్యలకు పాల్పడకుండా పోరాడి సాధించాలని విజ్ఞప్తి చేశారు.

ఇంకా ఈ కార్యక్రమంలో రైతుకూలీసంఘం జిల్లా నాయకులు పామర్తి అంజమ్మ, కొప్పినేని ఉమా మహేశ్వరరావు, ఏపిఎఫ్‌టియు బందరు ఏరియా నాయకులు ఎం.సుధాకర్, రైతుకూలీ సంఘం నాయకులు ఇ.రాంబాబు, తదితరులు ఉపన్యసించారు. అరుణోదయ కళాకారులు పాడిన పాటలు, చేసిన నృత్యాలు నాగాయలంక ప్రజలను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి నాగాయలంక చుట్టుప్రక్కల గ్రామాల సన్న, చిన్నకారు రైతులు, కూలీలు 150 మందికి పైగా పాల్గొన్నారు. ✡

# 'రైతుకూలీసంఘం రాష్ట్ర మహాసభల సావనీర్ - 2010' ఆవిష్కరణ సభ

**నల్గొండజిల్లా, 16-2-11:** రైతుకూలీసంఘం వార్షిక సంచిక ఆవిష్కరణ కార్యక్రమం నల్గొండజిల్లా నడిగూడెం మండలం రామాపురం గ్రామంలో జరిగింది. సాయంత్రం జరిగిన బహిరంగసభకు రామాపురం గ్రామ నాయకులు కామ్రేడ్ బండారు నీలాద్రి అధ్యక్షత వహించారు. ఈ సభలో రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్ర కార్యదర్శి కా||కోటయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, వరంగల్‌జిల్లా కార్యదర్శి కా||యాకూబ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కా||యలకా ప్రతాప్‌రెడ్డి, నల్గొండజిల్లా రైతుకూలీసంఘం ఆర్గనైజింగ్ కమిటీ కన్వీనర్ కా||బి.వెంకటరెడ్డిలు ప్రసంగించారు. 2010 సావనీర్‌ను అలనాడు మునగాల రైతాంగ ఉద్యమంలో పాల్గొన్న దళిత యువకులలో ఒకరైన నేటికి వయోవృద్ధులైన నేలమర్రి వెంకయ్య ఆవిష్కరించారు.

కా|| కోటయ్య అలనాటి మునగాల పరగణా వీరోచిత పోరాటాలను, నాటి కలకోవ సత్యాగ్రహంను, భూపోరాటంతో జోడించి నడిపిన తీరును వివరిస్తూ నేటికీ అపరిష్కృతంగా ఉన్న మునగాల, తెలంగాణా రైతాంగ పోరాట కర్తవ్యాలను నెరవేర్చేందుకు నడుంకట్టాలని పిలుపు ఇచ్చారు. కా||యాకూబ్ గ్రామీణ ప్రాంతాలలో తాండవిస్తున్న పలుసమస్యలను ముఖ్యంగా ఉపాధిహామీ పథకాలను ప్రస్తావిస్తూ దళారీల, అధికారుల, అవినీతి వ్యవస్థకి వ్యతిరేకంగా గ్రామీణ పీడిత ప్రజలు పోరాడాలని పిలుపు ఇచ్చారు. కామ్రేడ్ ప్రతాపరెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని కోదాడ, సూర్యాపేట తదితర మార్కెట్లలో రైతులపై సాగుతున్న దోపిడీనీ, పండిన పంటను కబళిస్తున్న దళారీల విధానాన్ని వివరిస్తూ గ్రామీణ ప్రజానీకం అంతా ఏకం కాకుండా రైతుకూలీలు ఉత్పత్తిచేసిన గ్రామీణ సంపదను దక్కించుకోలేమని వివరించారు. కామ్రేడ్ వెంకటరెడ్డి మాట్లాడుతూ వివిధ ప్రాంతాలలోని దేవాలయ, పోరంబోకు భూములు ప్రజలకు దక్కాల్సివుందని గ్రామీణ ప్రజలు, పీడిత ప్రజలంతా ఐక్యమై పోరాడాలని వివరించారు.

వరంగల్, నల్గొండ జిల్లాలనుండి వచ్చిన ప్రజాకళాకారులు కామ్రేడ్స్ పాపన్న, రాము, జయరాజ్ తదితరులు జనం పాటలు పాడి, సభికులను ఉత్తేజితుల్ని చేశారు. గ్రామ ప్రజలేకాక చుట్టుప్రక్కల గ్రామాలనుంచి ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సభ మంచి ఉత్తేజపూరిత వాతావరణంలో జరిగింది. ✡

## హక్కుల... (7వ పేజీ తరువాయి)

ప్రజాస్వామిక చైతన్యం మొలకెత్తిందని చెప్పటం సరియైనదికాదు. ఈ ఆలోచనా సరళి గతానికి, వర్తమానానికి గల సంబంధాన్ని నిరాకరిస్తూ, గతం యొక్క ఉనికిని నిరాకరించే శూన్యవాదం (Nihilisim) అవుతుంది. వినాయక్‌సేన్‌కు విధించిన యావజ్జీవ కారాగార శిక్షను రద్దు చేయకపోతే ప్రతీకార చర్యలు ఉంటాయనే మావోయిస్టుల ప్రకటన వారి అతివాద దుస్సాహసికవిధానాన్ని తెలియజేస్తుంది. ఈ ప్రకటన పౌర, ప్రజాస్వామిక, మానవ హక్కుల ఉద్యమానికి తీరని నష్టాన్ని కలుగ చేస్తుంది.

1990ల నుంచి సామ్రాజ్యవాద ప్రపంచీకరణను అమలు చేస్తూ, దోపిడీ బట్టబయలు అయిన ఫలితంగా, భారత సమాజంలో ఉద్వేగం, ఉద్విగ్నత. త్వరితగతిన పెరిగిపోతున్నాయి. అందువలననే పాలకుల, ప్రభుత్వ అధికారాన్ని నిలబెట్టే న్యాయవ్యవస్థలో భాగమైన రాయపూర్ న్యాయమూర్తి న్యాయ నిపుణులను విస్మయపరిచే భాషతోను, గొంతుతోను తీర్పునిచ్చారు.

**కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి తన 'తాకట్టులో భారతదేశం'** గ్రంథంలో వివరించినట్లుగా ప్రజాస్వామిక శక్తులు భారత పాలనా వ్యవస్థ సహజ, మౌలిక స్వభావాన్ని అర్థం చేసుకొన్నప్పుడు భారత దేశంలో ప్రజాస్వామిక హక్కుల ఉద్యమం, పాలకవర్గం, రాజ్యంయొక్క వివిధ దాడులను తట్టుకొనే విధంగా నిలకడగా ప్రజాస్వామిక ఆకాంక్షలకు అనుగుణంగా నిర్మితమవుతుంది. ✡

# డ్రైయిన్ల మరమ్మత్తులకై ఆందోళన

**బందరు, 24.1.2011:** డ్రైయిన్ల మరమ్మత్తులు చేపట్టకపోవటంతో ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు వరి పొలాలు ముంపుబారిన పడి రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నారనీ, వెనువెంటనే ప్రభుత్వం వీటి మరమ్మత్తులకు చర్యలు చేపట్టాలని డిమాండ్‌చేస్తూ రైతుకూలీసంఘం ఆందోళనా కార్యక్రమం చేపట్టింది. డిసెంబర్‌లో సంభవించిన భారీ వర్షాల కారణంగా మచిలీపట్నం రూరల్‌మండల పరిధిలోని వేలాది ఎకరాల్లో వరిపంట దెబ్బతిన్నదనీ, ఆయా గ్రామాల సమీపంలోని డ్రైయిన్లలో పేరుకుపోయిన తూడు, గుర్రపుడెక్క, నాచులే కారణమనీ, డిఆర్‌ఓ ను కలిసి విజ్ఞాపనపత్రం అందజేశారు. రైతుకూలీసంఘం బందరు ఏరియా నాయకులు కామ్రేడ్స్ పి.అంజమ్మ, జె.జగన్, లీలామనోహర్, కొప్పినేని ఉమామహేశ్వరరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ✡

## సమైక్య ... (చివరి పేజీ నుండి)

పోరాడుతున్నారని, భారత కార్మికవర్గం శ్రామికవర్గ పోరాటాలకు సంఘీభావం తెలుపుతూ కార్మికవర్గ ఐక్యతకు పాటుపడాలని కా|| పెద్దన్న పిలుపునిచ్చారు.

సభకు అధ్యక్షత వహించిన కా|| గణేష్‌పండా మాట్లాడుతూ దోపిడీ, పీడన లేనటువంటి, శ్రమను గౌరవించే నూతన ప్రజాతంత్ర వ్యవస్థలో మాత్రమే శ్రామిక ప్రజలకు వేతన బానిసత్వం నుండి విముక్తి లభిస్తుందని, కార్మికవర్గ నాయకత్వంలో, రైతాంగాన్ని ఇతర శ్రామిక ప్రజానీకాన్ని కలుపుకొని సాగే దీర్ఘకాలిక పోరాటం ద్వారానే అది సాధ్యమని అటువంటి చారిత్రక కర్తవ్యాన్ని నిర్వర్తించే శక్తిగా కార్మికవర్గాన్ని సిద్ధం చేయవలసిన బాధ్యత, వారికి బాధ్యత వహించే నాయకత్వ శక్తులపై వుందని ఏపిఎఫ్‌టియు భావిస్తున్నదన్నారు ఈ కర్తవ్య నిర్వహణకు అంకితమై, మొత్తం కార్మికవర్గాన్ని సంఘటిత శక్తిగా తీర్చదిద్దడం తన లక్ష్యంగా ఎంచుకున్నదని అందుకు అడ్డంకిగా వున్న, ట్రేడ్ యూనియన్లలో వేళ్ళూనుకొనివున్న సంస్కరణవాదం, ఆర్థికవాదం, ఆధిపత్యవాదం, కులతత్వం, మతతత్వం తదితర కార్మిక వర్గేతర ధోరణులపైనా పోరాడవలసి ఉంటుందని వివరించారు..

రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) రాష్ట్ర అధ్యక్షులు కా|| యస్. ఝాన్సీ మాట్లాడుతూ దేశంలోనూ, రాష్ట్రంలోనూ నేటి ఆర్థిక, రాజకీయ పరిస్థితులు ఆందోళన కలిగించేవిగా వున్నాయని; అవినీతి, కుంభకోణాలతో అట్టుడుకుతున్న సమాజంలో వున్నామనీ, రైతాంగం పరిస్థితి చాలా దుర్భరంగా వుందని, ప్రకృతి వైపరీత్యాలకి గురై దిక్కుతోచని స్థితిలోవున్న రైతాంగాన్ని ఈ పాలకులు పట్టించుకోలేదని, రైతాంగ దుస్థితిని తమ రాజకీయ లబ్ధికి ఉపయోగించుకునేందుకు పోటీలు పడి, రైతు బాంధవులుగా చెప్పుకుంటూ మొసలికన్నీరు కారుస్తున్నారనీ, నిత్యావసరవస్తువుల ధరలు సామాన్య మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో లేకుండా పోయాయనీ. దీనికితోడు పెట్రోలు, డీజిల్ ధరలు పెంచటంతో ధరలు మరింత పెరిగిపోతున్నాయనీ అన్నారు. మరోప్రక్క లక్షలకోట్ల కుంభకోణాలతో పాలకులు మునిగి తేలుతున్నారని, 70లక్షలకోట్లకు పైగా స్విస్ బ్యాంకులో ప్రజలకు చెందవలసిన డబ్బును తమ ఖాతాల్లో మేటలు వేసుకుంటున్నారని, సామ్రాజ్యవాదులకు పాలకులు దళారీలుగా వుంటూ దేశ సహజసంపదలను తరలించడమే కాకుండా, దేశాన్ని దోచుకోడానికి రమ్మని సామ్రాజ్యవాద, బహుళజాతి కంపెనీలను పోటీలుబడి మరీ ఆహ్వానిస్తున్నారనీ, కార్మిక, కర్షక మైత్రితో, ఇతర పీడిత ప్రజలను కలుపుకొని, పాలకుల ప్రజావ్యతిరేక విధానాలను త్రిప్పికొట్టవలసిన కర్తవ్యం కార్మికవర్గంపై వుందని ఈ నేపథ్యంలో కా|| ఝాన్సి పిలుపునిచ్చారు.

ఏపిఎఫ్‌టియు రాష్ట్ర కార్యదర్శి కా|| వై. సోని సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలను అనుసరిస్తున్న ఫలితంగా దేశంలోని చేతి వృత్తులన్నీ నాశనం అయ్యాయన్నారు. వ్యవసాయ రంగం మరణశయ్యపై వుందని, బ్రతుకు తెరువు కోల్పోతున్న చేనేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని. సామ్రాజ్యవాద ద్రవ్య సంస్థలైన ప్రపంచ బ్యాంకు, ఐ.ఎం.ఎఫ్. సంస్థల ఆదేశాలను అమలు చేస్తున్న దాని ఫలితంగా దేశ పారిశ్రామిక, వ్యవసాయరంగం, వైద్యం, విద్య, సేవారంగాలు, చేతి వృత్తులు నాశనం అవుతున్నాయని, ప్రభుత్వ దోపిడీ, అణచివేత విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న అన్ని రంగాల ప్రజలకు కార్మికవర్గం సంఘీభావంగా నిలవాలని, పోరాటాలకు నాయకత్వం వహించే శక్తిగా ఎదగాలని పిలుపునిచ్చారు.

స్త్రీ విముక్తి సంఘటన రాష్ట్ర అధ్యక్షులు కా|| సి. విజయ మాట్లాడుతూ తమ శ్రమను తప్ప ప్రతి అవసరాన్నీ పొదుపుగా చూసే స్త్రీలు ఆహారం తీసుకోవడంలో కూడా ఆఖరి వాళ్ళుగా వున్నారనీ, పోషకాహార లోపంతో, రక్తహీనతతో, నిత్యం అనారోగ్యంతో సహజీవనం చేస్తున్నారని; కూరగాయలు, ఆకుకూరల మొదలు అన్ని ఆహార దినుసుల ధరలు పెరగటంతో స్త్రీలు తీసుకునే ఆహారంపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నదనీ, ధరల పెరుగుదలకు కారణమైన పాలకుల విధానాలకు వ్యతిరేకంగా, ధరలు నియంత్రించే విధంగా, ప్రజాపంపిణీ వ్యవస్థను సక్రమంగా పనిచేయించే విధంగా ఆందోళనోద్యమాలను తీవ్రం చేయవలసిన అవసరం వుందని కా|| విజయ అన్నారు.

"కార్మికనగారా" మాసపత్రిక ఎడిటర్ కా|| ఆడారి అప్పారావు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధి పేరిట పర్యావరణ విధ్వంసానికి, ఆహార భద్రతకు, చేటు తెస్తున్నారనీ, విశాఖ జిల్లా ఎస్. రాయవరం, రాంబిల్లి మండలాలలోని ప్రజలను నిర్వాసితులను చేసి, దేశ రక్షణ కోసమంటూ "నేవల్ ఆల్‌టర్నేటివ్ ఆపరేషన్ బేస్" నిర్మాణం చేపట్టారనీ, పాలకుల దృష్టిలో దేశభద్రత అంటే పెట్టుబడిదారుల ఆస్తుల భద్రతేననీ, పరవాడలో నెలకొల్పిన థర్మల్ ప్రాజెక్టు, లంకెల పాలెం దగ్గర ఏర్పాటు చేసిన "జవహర్ లాల్ నెహ్రూ ఫార్మాసిటీ"లో నెలకొల్పబడిన రసాయనిక, మందుల తయారీ పరిశ్రమలు, వెదజల్లే విషవాయువులు ఆ ప్రాంత ప్రజలను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయనీ. ప్రజలు దీర్ఘకాలిక వ్యాధులకు గురౌతున్నారనీ, ఫార్మాసిటీ వస్తే తమ పిల్లలకు ఉద్యోగాలొస్తాయని చెప్పిన నాయకుల మాటలు నమ్మి, తమ ఇళ్ళు, పొలాలు కోల్పోయిన ప్రజలు పునరావాస ప్రాంతాల్లో, అనేక అసౌకర్యాలతో ఇబ్బందులు పడుతున్నారనీ, ఉద్యోగాలిస్తారన్న హామీలు నేటికీ అమలుకాలేదనీ, ఉపాధి దొరికిన కొద్దిమంది కార్మికులకు కూడా జీవిత భద్రతలేదనీ, కనీస వేతన చట్టం ప్రకారం వేతనాలు చెల్లించరనీ, పి.ఎఫ్., ఇ.ఎస్.ఐ, లాంటి చట్టాలు వారికి వర్తింపచేయరనీ, సంఘం పెట్టుకోకూడదనీ, తమ సమస్యలను నోరువిప్పి చెప్పకూడదనీ, ప్రమాదం జరిగి ఏ కార్మికుడైనా చనిపోయినా, అంగవైకల్యం పొందినా, న్యాయమైన పరిహారం చెల్లించరనీ, సమస్యలు వచ్చినప్పుడు స్థానిక పెత్తందారులో, రాజకీయనాయకులో రంగప్రవేశం చేస్తారనీ, వారికి తోచిన పద్ధతిలో పరిష్కారం చేసేస్తారనీ, ఈ పరిస్థితులలో కార్మికులు సంఘటిత పోరాటాలకు సిద్ధంకావాలనీ అన్నారు.

ఏపిఎఫ్‌టియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కా|| జి. నాగభూషణం మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాలలో దశాబ్దాల తరబడి కార్మికుల శ్రమను కారుచౌకగా దోచుకుంటూ పరిశ్రమలు లాభాలార్జిస్తున్నాయనీ, జ్యూట్ మిల్లు యాజమాన్యాలు అక్రమంగా పరిశ్రమలను "లాకౌట్" చేసినా, కార్మిక శాఖాధికారులు కానీ, ప్రభుత్వం కానీ మిల్లును తెరిపించలేవనీ, విశాఖజిల్లా చిట్టివలస జూట్ మిల్లు సంవత్సరం పైబడి అక్రమ లాకౌట్‌లో వున్నా, కార్మికులు ఆకలి బాధలకు లోనవుతున్నా పాలకులకు పట్టదనీ, దశాబ్దాలు గడుస్తున్నా, నేటికీ కనీస వేతనాలు చెల్లించడంలేదనీ, ఒకే పనికి వివిధ రకాల వేతనాలు (బహుళ వేతన విధానం) ఇస్తున్నారనీ, సమాన పనికి సమాన వేతనం చెల్లించరనీ ట్రైనీలు, బదిలీలుగా మారడానికి, బదిలీలు పర్మనెంటు అయ్యేసరికి రిటైర్‌మెంటు వయస్సు దగ్గరకు వచ్చేస్తుందనీ, అక్కడ కార్మిక సంఘాలకు నాయకత్వం వహిస్తున్న వివిధ కార్మిక సంఘాలు, ఎంతో పోరాట చైతన్యం కలిగిన జ్యూట్ కార్మికుల పోరాట చైతన్యాన్ని, తమ చర్యల ద్వారా నిర్వీర్యం చేస్తున్నాయనీ, కా|| బెహరా శంకరరావు వివరించారు.

సభానంతరం కార్మికవర్గం పై అన్యవర్గ ధోరణుల ప్రభవాన్ని ఎత్తిజూపుతూ, కార్మికవర్గ కర్తవ్యాన్ని తెలియజేప్పే ప్రజాకళాకారులు ప్రదర్శించిన ''జనవిజయం'' కళారూపం కార్మికులను ఆలోచింపజేసింది. కార్యక్రమం ఆద్యంతం కార్మికులకు ఎంతో ఉత్తేజాన్నిచ్చింది. ✡

జనశక్తి ప్రచురణ
**విప్లవ ప్రజా ఉద్యమం**
**విప్లవ ప్రజా ఉద్యమ సమస్యలు సావధానంగా చర్చిద్దాం!**
**కామ్రేడ్ విశ్వం వ్యాస సంకలనం**
వెల: 10.00

Janasakti (Communist Revolutionaries'Fortnightly) RNI No.8315/63 VJ-077/2010-12

# 'సమైక్య కార్మిక పోరాటాలకు సంసిద్ధులు కావాలి'

## 'కేంద్ర, రాష్ట్ర పాలకుల పారిశ్రామిక విధానాలు - ప్రజల దుస్థితి'పై బహిరంగ సభలో వక్తల పిలుపు



కార్మిక ప్రదర్శన



అధ్యక్షత వహించిన కా॥ పండా, వేదికపై ఇతర వక్తలు


సభకు హాజరైన ప్రజలు

**విశాఖపట్నం, 21-2-11 :** **ఆంధ్రప్రదేశ్** కార్మిక సంఘాల సమూఖ్య (ఎపిఎఫ్‌టియు) ఆధ్వర్యాన ఉత్తరాంధ్ర జిల్లాల కార్మికుల ప్రదర్శన, విశాఖరైల్వేస్టేషన్ నుండి సా॥ 4 గంటలకు ప్రారంభమై శ్రీసూర్యా జంక్షన్ మీదుగా, ఎల్ఐసి కార్పోరేషన్ మీదుగా రామాటాకీసు, బుల్లయ్యకాలేజి దగ్గరనున్న అంబేద్కర్ భవనంవరకు, దిక్కులు పిక్కటిల్లే నినాదాలతో ఉత్తేజంగా సాగింది. పెరుగుతున్న ధరలను తగ్గించాలని, కాంట్రాక్టు కార్మిక విధానాన్ని రద్దుచెయ్యాలని, కాంట్రాక్టు కార్మికులకు శాశ్వత ఉపాధి కల్పించాలని, సామ్రాజ్య వాద ప్రపంచీకరణ నశించాలని తదితర డిమాండ్లతో ఈ కార్మిక ప్రదర్శన సాగింది.

అనంతరం సా॥6గం॥కు అంబేద్కర్ భవనంలో ఎపిఎఫ్‌టియు రాష్ట్ర సహాయ కార్యదర్శి కా॥గణేష్ పండా అధ్యక్షతన బహిరంగసభ జరిగింది. తొలుత ఏపిఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షులు కా॥సి. పెద్దన్న మాట్లాడుతూ-పాలకులు ఏనాడూ స్వతంత్ర పారిశ్రామిక విధానాలను అవలంబించలేదని, ప్రభుత్వరంగంలోనూ ప్రైవేట్ పెట్టుబడులను బహిరంగంగా ఆహ్వానిస్తూ '48లోనే తీర్మానం చేశారన్నారు. ప్రపంచీకరణ విధానాల అమలుతో ప్రైవేటీకరణ విధానాలను వేగవంతం చేసారని, దేశం-సామ్రాజ్యవాద, బహుళజాతి కంపెనీలకు దోపిడీ వనరుగా మారిపోయిందన్నారు. నష్టాల సాకుతో అనేక పరిశ్రమలను మూసివేశారని, నష్టాల నివారణకు కార్మికులను తగ్గించివేయడమే పరిష్కారమన్న ప్రపంచబ్యాంకు సలహాను పాటించి వేలాది కార్మికులను పరిశ్రమలనుండి గెంటివేస్తున్నారన్నారు. కార్మికవర్గం పోరాడి సాధించుకున్న అనేక హక్కులను కత్తిరించి వేస్తున్నారన్నారు. కాంట్రాక్టు కార్మిక వ్యవస్థను అన్ని రంగాలకు విస్తరిస్తూ, తక్కువ వేతనాలిస్తూ, వారిని శ్రమదోపిడీకి గురిచేస్తున్నారన్నారు. పనిగంటలు పెంపు, సౌకర్యాలు కుదింపుతో, అభద్రతా భావంతో కార్మికులు జీవిస్తున్నారని, కాంట్రాక్టు పనివిధానం రద్దుకోసం, కాంట్రాక్టు కార్మికులుగా పనిచేస్తున్నవారికి శాశ్వత ఉపాధి కోసం పోరాడాలన్నారు. 93శాతంగా వున్న అసంఘటిత కార్మికులు నికృష్టమైన శ్రమదోపిడీకి గురౌతున్నారని సెజ్‌ల పేరుతో నెలకొల్పే పరిశ్రమల్లో కార్మికులు సంఘాలు పెట్టుకోకూడదని చట్టంచేశారని, యజమానుల దయాదాక్షిణ్యాలకు కార్మికులను వదిలివేసారని; సామ్రాజ్యవాదులు-తమ దేశ ప్రజలు వ్యతిరేకించిన పర్యావరణ విధ్వంసక థర్మల్, అణువిద్యుత్ కర్మాగారాలను మన నెత్తిన రుద్దుతున్నారని, పచ్చని పంట పొలాలను మరుభూమిగా మార్చివేస్తున్నారని, వీటికి వ్యతిరేకంగా కార్మికవర్గం పోరాడాలని, లక్షలాది కార్మికులకు ఉపాధి కలిగించే చిన్న, మధ్యతరహా పరిశ్రమల కోసం, వ్యవసాయాధారిత పరిశ్రమలకోసం కార్మికవర్గం పోరాడాలని, అసంఘటిత కార్మికుల హక్కులకోసం సమగ్ర చట్టంచేసి అమలుచెయ్యాలని డిమాండు చేశారు. ప్రపంచీకరణ దుష్ఫలితాలపై ప్రపంచ వ్యాపితంగా కార్మికవర్గం అనేక రూపాల్లో

**(తరువాయి 11వ పేజీలో)**

# థర్మల్ విద్యుత్ కేంద్ర వ్యతిరేక ఆందోళనాకారులపై పోలీసు కాల్పులకు నిరసన-బంద్




**శ్రీకాకుళం, 1-3-11 :** సంతబొమ్మాళి మండలంలో ఈస్ట్‌కోస్ట్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ నిర్మిస్తున్న థర్మల్ విద్యుత్ కేంద్ర ఫలితంగా విధ్వంసమయ్యే ప్రజల జీవనం, పర్యావరణాలపట్ల ఆందోళనతో గత సం॥ర కాలంగా ఆ ప్రాంత ప్రజలు ఆందోళన సాగిస్తున్నారు.

ప్రజల నిరసనలను ప్రక్కనబెట్టిన ప్రభుత్వం రైతుల భూముల సేకరణకు పూనుకోవటంతో పాటుగా ఈస్టుకోస్టు కంపెనీ నిర్మాణాలను ప్రారంభించేందుకు అనుమతించింది.

ఈ నేపథ్యంలో 25-2-11న పోలీసులు పెద్ద ఎత్తున మోహరించి వడ్డితాండ్ర గ్రామస్థులపై పెద్దస్థాయిలో లాఠీఛార్జీకి పాల్పడటంతో పాటుగా రాష్ట్రస్థాయి నిరసనలను బేఖాతరు చేస్తూ పోలీసులు చుట్టుముట్టి అణచివేయటం కొనసాగింది.

28-2-11న పోలీసులు కాకరపల్లి ఆందోళనకారులపై మరో పర్యాయం పెద్ద ఎత్తున దాడులకు పాల్పడ్డారు. దాదాపు గ్రామంలోని గుడిశెలన్నింటినీ బాంబులు ప్రయోగించి కాల్చిబూడిద జేయటంతోపాటుగా, బాష్పవాయు ప్రయోగం, కాల్పులు సైతం సాగించారు. రబ్బరు బుల్లెట్లను మాత్రమే ప్రయోగించామని పోలీసులు అధికారులు చెప్తుండగా ఇద్దరు గ్రామస్తులు మృతి చెందారు. అనేకమంది తీవ్రగాయాలపాలయ్యారు. 150 మందికి పైగా ప్రజలను అరెస్టులుచేశారు.

ఈ నేపథ్యంలో కాకరాపల్లి పోలీసు కాల్పులను నిరసిస్తూ వివిధ పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శ్రీకాకుళం జిల్లా వ్యాపితంగా బంద్ జరిగింది. టిడిపి, సిపిఐ, సిపిఎం, బిజెపి, న్యూడెమోక్రసీ తదితర పార్టీలతో పాటుగా రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కా॥ అరుణ బాధిత గ్రామాలను, సందర్శించారు. ప్రజలకు ధైర్యం చెప్పారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానంలో భాగంగానే థర్మల్ విద్యుత్ కేంద్రాలు, అణు విద్యుత్ కేంద్రాలు పెద్దఎత్తున నిర్మాణం అవుతున్నాయి వీటికి వ్యతిరేకంగా బలమైన, ఐక్యప్రజా ఉద్యమాన్ని నిర్మాణం చేయవలసిన అవసరముందనీ పేర్కొన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బుల్లెట్ క్షతగాత్రులను పరమర్శించారు. పోలీసు కాల్పులలో మృతిచెందిన సీరపు ఎర్రయ్య (సీరపువానిపేట), జీరు నాగేశ్వరరావు (ఆకాశ లక్కవరం)ల మృతదేహాలకు పోస్టుమార్టం అనంతరం వారి,వారి గ్రామాల్లో అంతిమయాత్ర నిర్వహించి అంత్యక్రియలు జరిపారు. ఆకాశలక్కవరం, సీరాపువానిపేటలలో జరిగిన అంత్యక్రియల్లో సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

కాకరాపల్లి పోలీసు కాల్పులకు నిరసనగా శ్రీకాకుళం జిల్లాబంద్ సంపూర్ణంగా జరిగింది ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, బ్యాంకులు మూతబడ్డాయి. రోడ్డు రవాణా సౌకర్యాలు నిలిచి పోయాయి. ఇతర పార్టీలతో పాటుగా రైతుకూలీసంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కా॥ అరుణ నాయకత్వంలో బృందాలుగా ఏర్పడి పట్టణంలో బంద్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇంకా కా॥ రమణ, అంజయ్య, చిట్టి తదితరులు పాల్గొన్నారు.


శ్రీకాకుళంలో బంద్ నిర్వహిస్తున్న రైతుకూలీ సంఘం, ఇతర సంఘాల, పార్టీల కార్యకర్తలు

జనశక్తి ప్రచురణ
**ఆంధ్రప్రదేశ్ విభజన కమ్యూనిస్టు విప్లవకారుల వైఖరి**
కామ్రేడ్స్ తరిమెల నాగిరెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు, విశ్వం తదితరుల
వ్యాస సంకలనం
వెల: రు. 15/-

జనశక్తి ప్రచురణ
**విభజనవాద-సమైక్యవాద మూలాలు**
**మార్క్సిస్టు పరిశీలన-కర్తవ్యాలు**
వెల: రు. 5/-
ప్రతులకు: మైత్రీ బుక్ హౌస్
జలీల్ వీధి, కారల్‌మార్క్స్ రోడ్, విజయవాడ-2

Printed, Published and Owned by P.Jaswantha Rao 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010
and Printed at Chaitanya Printers, Gora Veedhi, Suryaraopet Vijayawada-2
Editor: P. Jaswantha Rao, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010